# శ్రీ వేంకటేశం

ఆధ్యాత్మిక మాసపత్రిక

ఏప్రిల్ 2022

వెల: రూ. 25/-







# శ్రీవేంకటేశం

ఆధ్యాత్మిక మాసపత్రిక

**సంపుటి:** 15 **సంచిక:** 4


**సలహాదారులు, స్ఫూర్తిదాత,**
**కర్త, కర్మ, క్రియ మా ప్రభు**
**తిరుమల శ్రీ వేంకటేశ్వరుడు**


ప్రధాన సంపాదకులు:
**పుల్లగూర్ల సాయిరెడ్డి**
(గోవిందదాసు)

గౌరవ సంపాదకులు:
**డా|| పులిగడ్డ విజయలక్ష్మి**

ఫొటోగ్రాఫర్:
**పత్తి సుబ్రమణ్యం,** శ్రీనివాస మంగాపురం

డి.టి.పి: **సాయినాథ్**

డిజైన్: **రమేష్**



**Email:** srivenkatesham@gmail.com
namo_venkateshaya@yahoo.com
**Website:** www.srivenkatesham.org
**E-Magazine:** www.readwhere.com
Phone: **040–27175050**
Cell: **9348212354**


## లోపలి పేజీల్లో


| | |
|---|---|
| శ్రీ వేంకటేశ్వర స్తుతి | 4 |
| ముక్తిమార్గం | 5 |
| కమనీయం రమణీయం - శ్రీ సీతారామ కళ్యాణం | 6 |
| సుమనోహరం సుమనోజ్ఞం- ఉగాది పర్వదినం | 9 |
| శఠగోపం-శఠగోపయతి నమ్మాళ్వార్ | 12 |
| నిజభక్తి భావం | 16 |
| మహాభారతంలోని మహోపాఖ్యానాలు | 19 |
| రామాయణ రత్నాకరం | 25 |
| కనక దుర్గాదేవి బ్రహ్మోత్సవములు | 29 |
| కాలాతీతుడు | 32 |
| శ్రీ వేంకటేశ సహస్ర నామావళి | 34 |
| శ్రీ వేంకటాచల మాహాత్మ్యం | 36 |
| మీ ప్రశ్న - మా సమాధానం | 40 |
| తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవ వైభవం | 42 |
| ఉగాదికి స్వాగతం | 46 |
| త్రివక్రం | 48 |
| శ్రీ వేంకటేశ్వర అష్టోత్తర శతనామావళి | 49 |
| సారంగ పాణిఆలయం- కుంభకోణం | 51 |
| శబరి | 53 |
| శ్రీకృష్ణ పరమాత్మ ఇచ్చిన చివ్వరి సందేశం | 55 |
| మయూరధ్వజుడు | 57 |
| హృదయార్పణం | 58 |
| ఉబ్బలి బసవన్న | 60 |
| కణ్వ మహర్షి (మన మహర్షులు) | 61 |
| శ్రీ విష్ణు మహాపురాణం | 62 |
| రాశి ఫలితములు | 65 |
| మీ విజ్ఞానం | 66 |




# అంతిమ లక్ష్యం

శ్రీవేంకటేశం పాఠకులకు శ్రీశుభకృత్ నామ సంవత్సర శుభాకాంక్షలు. రాబోవు ఈ సంవత్సరంలో తిరుమల శ్రీవేంకటేశ్వరుని కృపా కటాక్షాలతో మనమంతా సుఖ సంతోషాలతో జీవించుచు, ఆధ్యాత్మికంగా మరింత ముందుకు పోగలమని ఆశించుచున్నాము.

ఈ ఏప్రిల్ 2022వ సంచికతో శ్రీవేంకటేశం మాసపత్రిక 16 సంవత్సరాలు పూర్తి చేసుకుని 17 వ సంవత్సరంలోనికి అడుగిడింది. కరోనా సమయాన 3 నెలలు తప్ప, ప్రారంభం నుండి నేటివరకు ప్రతినెల ప్రచురించాము. 2007 సంవత్సరంలో తిరుమల శ్రీవేంకటేశ్వరుని ఆజ్ఞచే ''నమో వేంకటేశాయ'' అనే పేరుతో ప్రారంభమైన ఈ పత్రిక 2008 సంవత్సరం జనవరి నుండి ''శ్రీవేంకటేశం'' అని పేరు మార్చుకుని ప్రచురింపబడుచున్నది. ఈ పత్రికకు కర్త, కర్మ, క్రియ మా ప్రభు తిరుమల శ్రీవేంకటేశ్వరుడే. మేము కేవలం నిమిత్త మాత్రులం మాత్రమే. ఈ పత్రిక ద్వారా శ్రీవేంకటేశ్వరునికి మరియు ఆయన భక్తులకు సేవ చేసే భాగ్యాన్ని ప్రసాదించినందులకు మా ప్రభు శ్రీవేంకటేశ్వరునికి శతకోటి ప్రణామాలు అర్పించుచున్నాము. మొదలు కేవలం 2018 వరకు మాత్రమే ప్రచురించుదామనుకున్న ఈ పత్రిక శ్రీవేంకటేశ్వరుని ఆజ్ఞచే మా జీవితాంతము ప్రచురించుటకు నిర్ణయించుకున్నాము. కాని దానికి కావలసిన శక్తి సామర్థ్యములు ఎప్పటికప్పడు ప్రసాదించవలసిందిగా స్వామివారిని ప్రార్థించుచున్నాము. శ్రీవేంకటేశ్వర మహామంత్ర పీఠం ఆధ్వర్యంలో తిరుమల శ్రీవేంకటేశ్వరునికి చేయు సేవలలో ''శ్రీవేంకటేశం'' మాసపత్రిక మూడవది. మొదటిది స్వామివారికి ప్రతి సంవత్సరము 7 కోట్ల జప సమర్పణ, రెండవది ''నమో వేంకటేశాయ'' రథయాత్ర, మూడవది ''శ్రీవేంకటేశం'' మాసపత్రిక, నాల్గవది ''భజగోవిందం'' కార్యక్రమం, ఐదవది ఈ సంవత్సరం ప్రారంభించిన నూతన కార్యక్రమము ''శ్రీనివాస కళ్యాణాలు''. మొత్తం 111 కళ్యాణాలను వివిధ ప్రాంతములలో ఉచితంగా నిర్వహించి స్వామి భక్తులపై ఆ దేవదేవుని కృపా కటాక్షాలను అందించుటే ఈ కార్యక్రమము యొక్క ముఖ్య ఉద్దేశ్యం. గత తొలి ఏకాదశి 20-07-2021 రోజున ప్రారంభమైన ఈ కార్యక్రమము కోవిడ్ కారణంగా కొంత వెనుకంజ వేసినప్పటికీ ఇప్పటివరకు 18 కళ్యాణాలను నిర్వహించాము. శ్రీవేంకటేశ్వరుని కృపతో మిగిలిన కళ్యాణాలను త్వరలోనే పూర్తి చేయగలమని ఆశిస్తున్నాము.

కృతయుగములో నారసింహునిగా, త్రేతాయుగములో శ్రీరామునిగా, ద్వాపర యుగములో శ్రీకృష్ణునిగా జన్మించి లోకాలను రక్షించిన శ్రీమన్నారాయణుడు ఈ కలియుగములో తిరుమల కొండపై శ్రీవేంకటేశ్వరునిగ అవతరించి, మన పాపాలను హరించి, కంటికి రెప్పలా కాపాడుచున్నాడని, శ్రీవేంకటేశ్వరుని కంటే గొప్ప దైవము వెతికినా దొరకడని మన పురాణాలు చెప్పచున్నవి. మరోప్రక్క భక్తులు తమ అనుభవాలతో ప్రత్యక్షంగా తెలుసుకుంటున్నారు. భక్తులకున్న సమస్త క్లేశములను పారద్రోలి ఆనందాన్ని, మనశ్శాంతిని ప్రసాదించుచున్నాడు. ఈయన కృపను పొందుట చాలా సులభము. మనసాక్షిగా స్వామివారిని నమ్ముచు, ఆయన నామస్మరణను విడువక చేయుచు ఆయనకు శరణాగతులమై జీవించుట అంటే శ్రీవేంకటేశ్వరునికి ఎంతో ఇష్టం. అలాంటి భక్తులను రక్షించి తీరుతాడు శరణాగత రక్షకుడు. పూర్వం అజామిళుడు అనే వ్యక్తి ఏ రోజూ నారాయణ నామస్మరణ చేయలేదు. తన జీవితం మొత్తం ఎలాంటి మంచి పనులు చేయలేదు. తన అవసాన దశలో కూడా భగవంతుని నామస్మరణ చేయుటకు ఇష్టపడలేదు. కాని అవసాన దశలో కలిగిన బాధను తీర్చుకొనుటకు అవసర నిమిత్తము నారాయణుడనే పేరు కలిగిన తన కుమారుని ఒకటి రెండు మార్లు పిలిచి అంతలోనే ప్రాణం వదిలాడు. అంతటి పాపాత్ముని సైతం అవసాన దశలో నారాయణా అని పిలిచినందులకు అతడు వైకుంఠానికి వెళ్ళాడని పురాణాలు పేర్కొంటున్నాయి. ఈ కలియుగంలో మానవుడు తరించాలంటే శ్రీవేంకటేశ్వరుని నామస్మరణ ఒక్కటే మార్గం. దీని ద్వారా అతి సులభంగా ప్రతి ఒక్కరం శ్రీవేంకటేశ్వరుని కృపకు పాత్రులము కాగలము. ఇదే ''శ్రీవేంకటేశ్వర మహామంత్ర పీఠం'' యొక్క అంతిమ లక్ష్యం.

నమో వేంకటేశాయ

వినా వేంకటేశం న నాథో న నాథః |
సదా వేంకటేశం స్మరామి స్మరామి ||

శ్రీ వేంకటేశ్వర పాదసేవకుడు

పుల్లగూర్ల సాయిరెడ్డి (గోవిందదాసు)


Editor, Publisher, Printer and owned by **Pullagurla Sai Reddy**. Published at: H.No.1-1-53, Street No:1, Habsiguda, Hyderabad-500007. Printed at: Sai Tirumala Printers, H.No:1-8-556/2, Chikkadpally, Hyderabad-500020. Editor: Pullagurla Saireddy: Cell : **93482 12354**, Ph:040-27175050; E.mails: **srivenkatesham@gmail.com**, namo_venkateshaya@yahoo.com

## చందా వివరాలు
(రూ.లలో)

| | |
|---|---|
| ☐ 1 సం॥ | 250-00 |
| ☐ 2 సం॥ | 500-00 |
| ☐ 4 సం॥ | 1,000-00 |
| ☐ జీవిత చందా | 3,000-00 |
| ☐ పోషకులు | 5,116-00 |
| ☐ రాజపోషకులు | 10,116-00 |

**9348212354**

నంబర్‌కు పేటీఎం / ఫోన్‌పే / గూగుల్ పే ద్వారా జమచేసి మీ చిరునామాతోపాటు మాకు తెలపండి.

లేదా

శ్రీ వేంకటేశం పేరుపైన ఎం.ఓ / డి.డి. / క్రాస్డ్ చెక్‌ను

లేదా

**Srivenkatesham**

A/c no. S.B. 11002191002593
(Ifsc Code: PUNB0110010)
Punjab National Bank,
Habsiguda, Hyderabadలో

చేరునట్లు ఏదేని పీఎన్బీ కాని, ఆన్‌లైన్ ద్వారా కాని చెల్లించి మాకు తెలియజేయండి.


పూర్తి పేరు:____________________
____________________
చిరునామా:____________________
____________________
____________________
____________________
____________________
పిన్‌కోడ్:____________________
చందా వివరాలు:____________________



మా చిరునామా:
శ్రీ వేంకటేశం, ఆధ్యాత్మిక మాసపత్రిక
ఇం.నెం. 1-1-53, వీధి నెం. 1,
హబ్సిగూడ, హైదరాబాద్-500 007.
ఫోన్: 040-27175050
సెల్: 9348212354
Email: srivenkatesham@gmail.com



చందాదారులకు స్వామివారి పవిత్ర పాదాలు (10"x8") ఉచితం

# శ్రీ వేంకటేశ్వర స్తుతి

## 36.దేవగాంధారి (జంపె)

ద్వారకావాసా! దేవుండవైన నీకు నా చర్మమాంసాస్థిమయంబులైన
 కరంబుల మ్రొక్కుచున్నవాఁడ
పరమ పావనమైన తిరుమంత్రము నా యెంగిలినోర
 నుడువుచున్నవాఁడ
గోపికలు నీవును రహస్యంబున వినోదంబులు నిన్నువేళ యెఱుంగక
 సేవింపుదును
నీ కోమలంబైన తిరుమేను నా కర (ఱ) కుఁజూపులఁ జూచెదను
మీ చిత్తంబు దెలియక యావాహనంబు సేసి పూజించెద నిది
 యపచారమో యెఱుంగ
యేమి సేసినను నీ దాసులను నేరమెంచనిది నీ గుణము
యేలికవని వెఱవక మందెమేళమున వేవేలపరాధంబులుఁ జేసితి
 నోర్చుకొనవె శ్రీవేంకటేశ్వరా!

తాత్పర్యం :

‘ద్వారకావాసా! శ్రీకృష్ణా! నీవు దివ్య దేహుడవు. అంతటా ప్రకాశించేవాడవైన నీకు చర్మ మాంసాలతో అస్థులతో నిండిన నా చేతులతో నీకు నమస్కరిస్తున్నవాణ్ణి. ఓమ్ నమో నారాయణాయ అనే అతి పవిత్రమైన అష్టాక్షరి మంత్రాన్ని ఎంగిలిపడ్డ నా నోటితో ఉచ్చరిస్తున్నవాణ్ణి. అలనాడు రహస్యంగా వినోదంగా నీవు గోపికలతో జరిపిన వృత్తాంతాలు నా చెవులతో వినాలని ప్రయత్నిస్తాను. ఒంటరిగా లక్ష్మీదేవితో కూడి ఉన్న నిన్ను సమయం తెలియక సేవిస్తాను. నీ మృదుల శ్రీకర శరీరాన్ని కఠినమైన నా చూపులతో చూస్తాను. నీ మనస్సును గ్రహించక నిన్ను ఆవాహనం చేసి పూజిస్తాను. అది అపచారమేమో నాకు తెలియదు. ఇలా ఏం చేసినా మేము నీ దాసులం. నీ గుణం తప్పులను ఎంచేది కాదు. నీవు ప్రభువువు అని భయపడక చనువుతో ఉపేక్షతో వేలకొలది అపరాధాలు చేశాను. ఓర్చుకొనవయ్యా స్వామీ! శ్రీవేంకటేశ్వరా!’.

వ్యాఖ్యానం: డా॥ తిరుమల శ్రీనివాసాచార్య



# ముక్తిమార్గము

భావానువాదం:
**శ్రీమాన్ సముద్రాల లక్ష్మణయ్య**

## బౌళి

ఎంత మాత్రమున నెవ్వరు దలచిన – అంతమాత్రమే నీవు
అంతరాంతరము లెంచిచూడఁ బిం-డంతే నిప్పటి యన్నట్లు
|| పల్లవి ||

1. కొలుతురు మిము వైష్ణవులు – కూరిమితో విష్ణు డని
పలుకుదురు మిము వేదాంతులు – పరబ్రహ్మంబనుచు,
తలఁతురు మిము శైవులు – తగిన భక్తులను శివుఁడనుచు
అలరి పొగడుదురు కాపాలికులు – ఆది భైరవుఁడనుచు
|| ఎంత ||

2. సరి నెన్నుదురు శాక్తేయులు – శక్తిరూపు నీ వనుచు
దరిశనములు (ల?) మిము నానా విధులను
– తలపుల కొలదుల భజింతురు
సిరుల మిమ్మునే యల్పబుద్ధిఁదలఁ
– చినవారికి నల్పంబవుదువు
గరిమల మిమునే ఘనమని తలచిన
– ఘనబుద్ధులకు ఘనుఁడవు || ఎంత ||

3. నీవలనఁ గొరతే లేదు మరి – నీరుకొలది తామెరవు
ఆవల భాగీరథి దరిబావుల – ఆ జలమే వూరినయట్లు
శ్రీవేంకటపతి నీవైతే మముఁ – జేకొనివున్న దైవమని
యీవల నేనీ శరణనియెదను – యిదియే పరతత్త్వము నాకు
|| ఎంత ||





భావము : దేవా! ఎవ్వరెవ్వరెంతెంత మాత్రముగా నిన్ను దలచుదురో, వారి వారికంతంత మాత్రముగానే నీవు తోచుచుందువు. భిన్న భిన్న దైవతముల జెప్పు నానా శాస్త్రములు, పలు తెరవులగు ఉపాసనా విధానములు. నానాటికీ గలుగు ఫలభేదములు పరిశీలింపగా పిండికొలది నిప్పటి యన్నట్లే యున్నది.

వైష్ణవులు ప్రేమతో నిన్ను 'విష్ణు'డని సేవింతురు. వేదాంతులు నిన్ను పరబ్రహ్మమను నామముతో వ్యవహరింతురు. శైవులు తమకు తగిన భక్తి పద్ధతులతో నిన్ను శివుడని భావింతురు. మరియు కాపాలికులు నిన్ను ఆదిభైరవుడని సంతసించి పొగడుచుందురు.

ఇక శాక్తేయులన్ననో నీవు శక్తి రూపుడవే యని పరిగణించుచుందురు. ఇట్లు వివిధములైన ఉపాసనా విధానములకు చెందినవారు వారి వారి భావముల కొలది నిన్ను దర్శించుచుందురు (తమ తమ తలపుల ననుసరించి వివిధములైన మంత్రశాస్త్రములను సేవించుచు నిన్ను ఉపాసింతురు). శ్రీమంతుడవైన నిన్నెవరు అల్పబుద్ధితో భావింతురో, వారికి నీవల్పముగానే దోచెదవు. మహామహిమోపేతుడవగు నిన్ను ఘనుడవని భావించిన మహామతులకు నీవు ఘనుడవుగానే కన్పట్టుదువు.

నీ యెడల ఎట్టి లోపమును లేదు. నీవు నీరు కొలది తామరవు. అనగా భక్తి కొలది ఫలము నొసంగువాడవు. గంగానది గట్టున గల బావులలో ఆ గంగాజలమే ఊరినట్లు పై జెప్పిన చొప్పున పలురీతుల నిన్ను భావించువారి హృదయములలో భావానుసారముగా నీవే తోచుచుందువు. శ్రీవేంకటేశ్వరా! నీవే మమ్ము రక్షింపబూనిన దైవమవని నమ్మి నేను నిన్ను శరణు జొచ్చుచున్నాను. ఇదే నాకు పరమప్రాప్యమైన పరతత్త్వము గాని ఇంకొకటి కాదు.



# కమనీయం రమణీయం

# శ్రీ సీతారామ కళ్యాణం

– చింతలపాటి శివశంకరశాస్త్రి

**శ్లో॥ ''శ్రీంకారం వరదాభయప్రద కరాం ఫుల్లాబ్జ హస్తాం శుభాం**
**కళ్యాణీం కమలామనంత ధనదాం సర్వార్ధ ధాత్రీం ప్రభామ్**
**బ్రహ్మేశాది సురార్చితాం భగవతీం శ్రీ విష్ణు పత్నీం రమాం**
**శ్రీలక్ష్మీం ప్రణమామి సర్వజననీం భక్తార్తి విధ్వంసినీమ్''**

చిత్తా నక్షత్రంతో కూడిన పూర్ణిమ గల మాసం చైత్రమాసం. చలితో విసిగిపోయి, సమశీతోష్ణ కాలమైన వసంత ఋతువు చైత్రంతో ఆరంభమవుతుంది. జగత్తంతా చైతన్యవంతమయ్యే కాలమిది. చైత్రమాసానికి మధుమాసం అని పేరు. ''వసతి సుఖ మస్మిన్నితి వసంతః'' అని ఆర్యోక్తి. పచ్చదనం తగ్గిపోయి వెలవెలబోయిన ప్రకృతి నవనవోన్మేష శోభలతో అలరారడం చైత్రమాసంతో మొదలవుతుంది. ఎక్కడ చూసినా ప్రకృతి సౌందర్య భాసరంగా అలరారుతుంది. ఈ చైత్ర మాసంలో ఉగాది, శ్రీరామనవమి, పరశురామ జయంతి మొదలైన పండుగలు వస్తాయి.

**''పరిత్రాణాయ సాధూనాం వినాశాయచ దుష్కృతాం**
**ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే''**

సజ్జన సంరక్షణకు, దుర్జన శిక్షణకు, ధర్మసంస్థాపనకు ప్రతి యుగంలోనూ నేను పుడుతున్నాను అంటాడు గీతాచార్యుడు.

ధర్మానికి, అధర్మానికి, న్యాయానికి, అన్యాయానికి, సత్యానికి, అసత్యానికి సంఘర్షణ జరిగినప్పుడు ధర్మాన్ని నిలబెట్టడానికి, సజ్జనులను రక్షించడానికి భగవంతుడు దశావతారాలను ధరించాడు. ప్రతి అవతారానికి ఒక లక్ష్యం ఉంది. ప్రతి ఆకృతికి ప్రత్యేకత ఉంది. అధర్మ పాలనలో దురాచారాన్ని ప్రబలింపచేస్తున్న రాక్షస సంహారం కోసమే నారాయణుడు దాల్చిన అవతారాలలో రామావతారం మహోన్నతమైంది.

అయోధ్యా నగరాన్ని పరిపాలించే దశరథ మహారాజుకు ముగ్గురు భార్యలు. మొదటి భార్య కౌసల్య. శ్రీరాముడు కౌసల్య గర్భాన చైత్రశుద్ధ నవమి నాడు పునర్వసు నక్షత్రాన జన్మించాడు. శ్రీరాముడు పుట్టిన సమయాన లగ్న, గ్రహ, తిథి, వార యోగాలన్నీ అనుకూలంగానే ఉన్నాయి. ఆ సమయాన సృష్టిలోని ప్రాణులన్నీ ఆనందంతో ఉన్నాయి. రామ జనన వేళ ఆకాశంలో నగారాలు మోగాయి. దేవతలు, నాగులు, మునులు భగవంతుడిని వేనోళ్ళ పొగుడుతూ కీర్తించారు. మిగిలిన భార్యలైన కైకేయి, సుమిత్ర పండంటి పిల్లల్ని ప్రసవించారు.

దశరథుని నలుగురు కుమారులు దినదిన ప్రవర్ధమానులై పెరిగి, గురువుల వద్ద అస్త్ర శస్త్ర విద్యలన్నీ ఆసాంతం గ్రహించారు. పిల్లలందరూ యుక్త వయసునకు రాగానే దశరథుడు వయోభారం చేత తన పెద్ద కుమారుడైన శ్రీరామునికి పట్టాభిషేకం చేయాలని నిశ్చయించుకొని మంత్రులతో, కుల గురువుతో చర్చించి ముహూర్తం నిర్ణయించాడు. మరుసటి రోజు దశరథుడు సభా భవనానికి విచ్చేసినాడు. సభకు నమస్కరించి ధర్మపీఠాన్ని అధిష్ఠించాడు. దశరథుని సభ వేదవేత్తలైన బ్రాహ్మణులతో, పౌరులతో, వశిష్ఠుడు, కశ్యపుడు మున్నగు మహర్షులతో, వ్యవహార జ్ఞాన సంపత్తి గల మంత్రులతో ధర్మజ్ఞులు, న్యాయకోవిదులు, సభ్యులు మున్నగు వారితో దిక్పాలకుల సభ వలె శోభాయమానంగా ప్రకాశిస్తోంది. దశరథుడు రాజ్యానికి సంబంధించిన విషయములను మంత్రులతో చర్చిస్తుండగా విశ్వామిత్ర మహర్షి విచ్చేశాడు. సభకు ఏతెంచిన మహర్షిని చూచి దిగ్గున లేచి ఉచితాసనమందు కూర్చుండబెట్టి పాదపూజ చేసి సత్కరించాడు. అనంతరం మహర్షి నుద్దేశించి ''విశ్వామిత్ర మహర్షీ! మీ రాకతో ఈ సభ పావనమయింది. మిమ్ములను కాంచి ధన్యత చెందాము. నా వలన మీ యజ్ఞ యాగాదులకు అవసరమైన సహాయము కావలసిన నిస్సంశయముగా ప్రస్తావించండి. మీ కోరిక ఎంతటిదైనా నెరవేర్చడానికి సిద్ధంగా ఉన్నానని, ఎవరేమన్నా తప్పక తీరుస్తానని సంశయించవద్దని పలికాడు.

దశరథుని మాటలను ఆలకించిన విశ్వామిత్రుడు చిరునవ్వుతో తిలకించి మహారాజా! లోక కళ్యాణ నిమిత్తం నేనొక యజ్ఞము చేయుచున్నాను. రాక్షసులు తమ శక్తియుక్తులతో మాయాజాలంతో నిర్విఘ్నము గావిస్తున్నారు. యాగరక్షణార్థము మీ కుమారుడైన రాముని పంపించమని, అసలు ఇవ్వమని కోరుతున్నానని పలికాడు. మహర్షీ! నా పిల్లలు ముక్కుపచ్చలారని పసికందులు. రాక్షసులను తుదముట్టించడం వారి వలన ఏమవుతుంది. మీకు సహాయముగా నా సైన్యమునంతటినీ పంపిస్తానని, అలా కాని యెడల యాగరక్షణార్థము నేనే వస్తానని పలికాడు. ఆ మాటలు విన్న విశ్వామిత్రుడు శ్రీరాముడు నీ కుమారుడే కాని, నిజానికి లోకానికే ప్రభువు. సత్య ధర్మస్థాపనల కొరకు రాముడు చూపవలసిన పరాక్రమాన్ని నేనెరుగుదును. నీ కులగురువైన వశిష్ఠునికి తెలుసు. పుత్రవ్యామోహంలో, అజ్ఞానం చేత నీకు తెలియడం లేదు. ఇక్కడున్న తపస్సులందరూ ఎరుగుదురు. వారి మాటనైనా విని శ్రీరాముణ్ణి నాతో పంపించు అంటూ సమాజంలో ధర్మసంస్థాపన చెయ్యడం కోసం తన వెంట తీసుకువెడతాడు. రామలక్ష్మణ సహితుడై యజ్ఞభూమి యైన సిద్ధాశ్రమమును చేరుకున్నాడు. విశ్వామిత్రుడు రామలక్ష్మణుల కోరికపై విశ్వామిత్రుడు యజ్ఞదీక్షితుడయ్యాడు. కంటిమీద కునుకు లేకుండా రామలక్ష్మణులు యజ్ఞాన్ని కాపాడుతున్నారు. ఎదురైన మారీచ సుబాహువులను వధించి రాక్షసులను అంతం చేశారు. యజ్ఞం నిర్విఘ్నంగా జరిగింది.

మరునాడు ఉదయానే విశ్వామిత్రుడు రామలక్ష్మణులను తీసుకొని తిరుగు ప్రయాణమై వెడుతూ ''రామా! మిథిలా నగరపు ప్రభువు జనక మహరాజు. అతని వద్ద అద్భుతమైన ధనుస్సు ఉంది. మీరు చూడవచ్చునని మిథిలవైపుగా ముందుకు సాగుతూ నగరాన్ని చేరుకున్నారు. జనకుడు వారిని సముచితంగా ఆదరించి సత్కరించాడు. విశ్వామిత్రుడు జనకుని ఆహ్వానంపై రామలక్ష్మణులను తీసుకొని సభలోనికి ప్రవేశించాడు. అంతట మహర్షి అనుమతితో రాముడు ధనుస్సును అవలీలగా పట్టుకొని అల్లెతాడును లాగి విల్లును విరిచాడు. జనకుని మనసు ఆనందంతో నిండిపోయింది. విశ్వామిత్రునితో నా కుమార్తె వీర్యశుల్క అని చేసిన ప్రతిజ్ఞ నేటితో నెరవేరింది. అసంభవం, అసాధ్యం అనుకున్న ఈ శివ ధనుర్భంగం మేము ఊహించనంత అద్భుతంగా జరిగింది. ఈ మీ శిష్యుడైన రామచంద్రుడికి నేను నా కుమార్తె అయిన సీతావధూటిని ఇచ్చి కన్యాదానం చేయ సంకల్పించాను. ఇపుడే నా మంత్రులను అయోధ్యా నగరానికి పంపించి

దశరథ మహారాజు, వారి కుటుంబాన్ని సగౌరవంగా ఆహ్వానిస్తానని పలికి జాగు చేయకుండా వెంటనే దశరథునికి వర్తమానం పంపించాడు.

జనకుని ఆహ్వానమును అందుకుని దశరథ మహారాజు పురోహిత, మిత్ర, మంత్రి సమేతంగా వచ్చాడు. అందరూ ఆశీనులయ్యాక జనకుని చూచి మా కులగురువైన వసిష్ఠుల వారు మా వంశక్రమం వివరిస్తారు అని పలికాడు. వసిష్ఠుడు ఇక్ష్వాకు వంశము గురించి వివరించి చెప్పగా జనకుడు చేతులు జోడించి వసిష్ఠునికి నమస్కరించి తన వంశ క్రమం చెప్పాడు. ఆ మాటలు విని అంతా సంతోషించు. అంతట జనకుడు దశరథునితో నేడు మఖా నక్షత్రం. ఎల్లుండి ఉత్తర ఫల్గుణీ నక్షత్రం. ఆ రోజు వసిష్ఠుల వారు చెప్పినట్లుగా సీతను రాముడికిచ్చి, ఊర్మిళను లక్ష్మణునికిచ్చి, మా తమ్ముడైన కుశధ్వజుని కుమార్తెలయిన మాండవి, శ్రుతకీర్తి అనే వారిని భరతుడికి, శత్రుఘ్నుడికి ఇచ్చి వివాహము చేద్దాము అని పలికాడు. జనకుని మాటలకు దశరథుడు అంగీకరించి తన సమ్మతిని తెలియజేశాడు.

మరునాడు మంచి ముహూర్తం చూసి శ్రీరాముని, సీతను పెండ్లికుమారుడు, పెండ్లి కుమార్తెగా అలంకరించారు. పసుపు కొమ్మలను రోళ్ళలో దంచి ఆ పసుపుతో సీతమ్మకు మంగళ స్నానాన్ని ముత్తైదువలు చేయించారు. శ్రీరామునికి సున్నిపిండి, సుగంధ ద్రవ్యాలు, సీకాకాయ పొడి కలిపిన మిశ్రమంతో మంగళస్నానం చేయించారు. ఈ స్నానఘట్టం అనంతరం ఇరువురికి సిరి కళ్యాణపు బొట్టు పెట్టి, నొసట బాసికములు కట్టి, పాదాలకు పారాణిని పూసి అలంకరించారు. మేలిమి రకం బియ్యంతో, ఎక్కడా విరగని పరిశుద్ధమైన బియ్యంతో తలంబ్రాలను తయారు చేయించారు. నూతన వస్త్రాలతో, ఆభరణాలతో వధూవరులను అలంకరించారు.

మిథిలా నగరమంతా రంగు రంగుల తోరణాలతో అలంకరించారు. ఆకుపచ్చని రాళ్ళను, నల్లని రాళ్ళను తెప్పించి అంగరంగ వైభవంగా కళ్యాణ మండపాన్ని నిర్మించారు. మామిడి తోరణాలను కట్టారు. మండపానికి ముందు అరటి చెట్లను ఉంచారు. రంగు రంగు పువ్వులను మాలలుగా కట్టి మండపాన్ని అలంకరించారు. విద్యుద్దీప అలంకరణలతో, పుష్పమాలికల సౌందర్యముతో నవ్యశోభతో, వర్ణరంజితముగా కనువిందు చేస్తున్నాయి. మంగళ వాయిద్యాల నడుమ వేదమంత్రాల సాక్షిగా శ్రీరాముని మంటపానికి తీసుకువచ్చారు. జనకరాజ దంపతులు వరుని కాళ్ళను కడిగి ఆ నీటిని తలపై చల్లుకున్నారు. జనకమహారాజు శాస్త్రోక్తంగా నూతన పట్టు వస్త్రములు సమర్పించారు. పట్టుబట్టలతో, బుగ్గపై కాటుక చుక్కతో, నుదుట కళ్యాణ బొట్టుతో, బాసికాలతో శ్రీరాముడు చిరునవ్వులు చిందించుచుండగా, అందరికీ శోభాయమానంగా కనిపించి ఆహ్లాదమును కలిగింప చేశాడు. మగపెళ్ళివారు మా రామయ్య ఘనత ఇదీ. మా రాముడు చాలా ఘనుడు అంటూ ప్రస్తావించారు. కాదు కాదు మా సీతమ్మను చేపట్టడం మీ రాముడి అదృష్టం. మా జానకీదేవి గొప్పదనం అంతా ఇంతా కాదని ఆడపిల్లవారు వర్ణించారు. పురోహితులు వేదమంత్రాలతో అక్షతలు చల్లి ఆశీర్వదించారు. కమల పత్రేక్షణుడు రాముడు మృదు మధుర మందహాసం చేశాడు. ముహూర్తం మించిపోతోందని ముత్తైదువలు జానకిని పెళ్ళిబుట్టలో తీసుకొని వస్తూ ఉండగా మంగళహారతుల పళ్ళెంతో ముందు, ప్రక్కల నడుస్తుండగా చేతిలో కొబ్బరి బొండము పట్టుకొని రాగా పెళ్ళిపీటలపై కూర్చోబెట్టారు. సుముహూర్తంలో వధూవరుల నెత్తిపై జీలకర్ర బెల్లం ఉంచారు. జనక మహారాజు సముద్ర గంభీర స్వరంతో ''రామా! ఈమె నా కుమార్తె సీత. నీకు సహధర్మ చారిణి అవుతోంది. ఈమెను అంగీకరించి పాణిగ్రహణం చేయి. నీకు మేలవుతుంది. నీడలా నిన్ననుసరించి ఉంటుంది'' అని మంత్రపూరిత జలం విడిచి కన్యాదానం చేశాడు. మంగళవాద్యాలు మిన్నంటాయి. మింట దేవదుందుభులు మోగాయి. శ్రీరాముడు ఋత్విక్కులు మంత్రాలు చదువుచుండగా సీత మెడలో మూడు ముళ్ళు వేశాడు.

అలాగే ఊర్మిళను లక్ష్మణునికి, మాండవిని భరతునికి, శ్రుతకీర్తిని శత్రుఘ్నునికి ఇచ్చి కన్యాదానం చేశారు. తరువాత అగ్నికి ముమ్మారు ప్రదక్షిణం చేశారు నూతన వధూవరులు. పెద్దలందరికీ నమస్కరించారు.

కుమార్తె వివాహ సందర్భముగా జనక మహారాజు సీతకు ఏడు వారాల నగలు, చెలికత్తెలు, వస్త్ర వజ్ర వైఢూర్య మరకత మణి మయాలంకారముల నొసంగెను. అదేవిధముగా మిగిలిన కుమార్తెలకు కూడా ఇచ్చి అల్లుళ్ళను గౌరవించెను. ఆకాశం దివ్యాక్షతలను కురిపించింది. దివి, భువి కూడా ఒక్కటై దంపతులను దీవించాయి. శ్రీరామనామం శుచి, రుచి, కృషి, శేముషీ వైభవాన్ని కల్గిస్తుంది. మనిషిని మనిషిగా, మనీషిగా తీర్చి దిద్దుతుంది. మనుగడను మలుపు తిప్పి మాధవాంకితం చేస్తుంది. అందుకే మనం మన మనసులను, తనువులను పరమాత్మ స్మరణలో, ధ్యానంలో, సంకీర్తనలో కరిగిద్దాము. మన వచస్సు, మనస్సు, కొత్త యశస్సుకు మార్గం సుగమం చేయాలి.

**“సర్వేజనా ...... సుఖినోభవంతు”**



# సుమనోహరం సుమనోజ్ఞం
# ఉగాది పర్వదినం

• గొర్తి రాజరాజేశ్వరి •

**"చతుర్భుజం చిదానందం మల్ల చాణూర మర్దనం
చరాచర గురుం దేవం తం వందే చక్రపాణినం"
"శ్రియఃకరం శ్రియోనాథం శ్రీధరం శ్రీవరప్రదం
శ్రీవత్సల ధరం సౌమ్యం తం వందే సురేశ్వరం"**

హిందువుల పండుగలలో ఉగాది ప్రశస్తమైనది. ఈరోజుతోనే కొత్త సంవత్సరం ప్రారంభమవుతుంది. ఇది ముఖ్యంగా తెలుగువారి పండుగ. తెలుగువారి పండుగే అయినప్పటికినీ కర్ణాటక కూడా మనతో పాటే ఉగాది పండుగను జరుపుకుంటుంది. ఇతర రాష్ట్రాల వారు కూడా వారి వారి కాలమాన ఆచార వ్యవహారాలను బట్టి ఉగాది పండుగను జరుపుకుంటారు.

'ఉగము' ఆదిగా గలది ఉగాది. ఉగమంటే నక్షత్రం గమనం. చుక్కలు కదలడం మొదలైన కాలమే సృష్టి మొదలైన కాలం. కాలం భగవత్స్వరూపం.

**"అహమేవా క్షయః కాలః కలయతా మహమ్"**

తాను కాలస్వరూపుడనని భగవంతుడే స్వయంగా చెప్పినాడు. కాలాయ నమః. త్రికాగ్ని కాలాయ నమః. కాలాగ్ని రుద్రాయ నమః – ఇటువంటి వేదమంత్రాలు భగవంతుడు

కాలస్వరూపుడ న్నాయి. భగవత్స్వరూపమైన కాలాన్ని సకల దేవతా స్వరూపంగా భావించి, పూజించి, సంవత్సర కాల భవిష్యత్తును ముందుగా తెలుసుకొని దైవానుగ్రహాన్ని పొందడానికి ప్రయత్నించే దినమే ఉగాది. 'ఉగాది' యుగాది అన్న సంస్కృత పదానికి వికృతి. సమస్త భువనాలను ప్రకాశింప చేస్తున్నవాడు సూర్యుడు. ఆయన కదలికల వల్ల కలిగే కిరణాల సంకోచ వ్యాకోచాల వల్ల సంవత్సరాలు, అయనాలు, ఋతువులు, మాసాలు. పక్షాలు, తిథులు తదితర కాల ఖండికలేర్పడుతున్నాయి.

మాసాలలో మొదటిది చైత్రం. పక్షాలలో మొదటిది శుక్లపక్షం. తిథులలో మొదటిది పాడ్యమి. నక్షత్రాలలో మొదటిది అశ్వని. ఋతువులలో మొదటిది వసంతం — ఇవన్నీ ఆదిగా ఉన్నరోజు ఉగాది. అన్నీ ఆదులే కాబట్టి ఉగాదికి అంత విశిష్టత. తెలుగు సంవత్సరం శిశిర ఋతువు ఫల్గుణ అమావాస్యతో ముగుస్తుంది. మరునాడు కొత్త సంవత్సరం. చీకట్లు పోయి వెలుగులు పెరిగే శుక్ల పాడ్యమితో మొదలవుతుంది. పాత సంవత్సరపు చీకటి అనుభవాల నుండి ఆనందపు వెలుగుల్లోకి వెల్లువలా అడుగు వేస్తాం. శిశిరంలో ఆకులు రాలి, చెట్లు మోడువారిపోతాయి. పచ్చదనం కంటికి కనిపించదు. ఆహ్లాదం అంతగా కాని వాతావరణం అనుభవిస్తూనే ఉంటాం. ఉగాది వచ్చేనాటికి వాతావరణం ఎంతగానో మారిపోతుంది. వసంతం అడుగు పెడుతుంది. ప్రకృతంతా కొత్త చిగుళ్ళతో, వృక్షాలు ఆకుపచ్చ శోభతో, లేతమామిళ్ళ, వేపపూవుల పరిమళాలు, ఫల, పుష్ప, వృక్షాల గుబాళింపులతో ప్రకృతి ఆహ్లాదపరుస్తూ ఉంటుంది. నవసౌరభాలను మోస్తూ మలయ మారుతాలు మనసులను ఆహ్లాదపరుస్తూ వీస్తాయి. పక్షుల కిలకిలా రావాలు, కోయిలల పాటలు వీనుల విందు చేస్తూ వినిపిస్తాయి. తెలుగు ఉగాది ఆనందపు హరివిల్లు చేతబట్టి వయ్యారంగా, రమణీయంగా తొలి తొలి వెలుగులలో, చిరు చిరు నగవులతో తెలుగు వారింట ప్రవేశిస్తుంది.

యుగాది — యుగ + ఆది = యుగము మొదలు అని అర్థం. త్రిమూర్తులు సృష్టి స్థితి లయ కారకులు. సృష్టి ప్రారంభంతో ముడిపడేవి యుగాలు. అందువలన ఆ యుగాలకు ఆది సృష్టి. బ్రహ్మదేవుడు సృష్టిని ప్రారంభించిన రోజు కనుక చైత్ర శుక్ల పాడ్యమి యుగాది. అంటే యుగానికి ఆది అని అర్థం.

దైవజ్ఞులు కాలాన్ని బ్రహ్మమానం, ప్రజాపత్యమానం, దివ్యమానం, పితృమానం, బార్హస్పత్యమానం, సౌరమానం, నక్షత్రమానం, చాంద్రమానం, సావనమానం అని విభజించినారు. హిందువులు చాంద్రమానాన్ని పాటించేవారు కనుక చైత్ర శుద్ధ పాడ్యమిని ఉగాదిగా భావిస్తారు.

**''చైత్రేమాసి జగద్బ్రహ్మ ససర్జ ప్రథమేజహని**
**శుక్లపక్షే సమగ్రంతు తథా సూర్యోదయే సతి**
**ప్రవర్తయా మాస తథా కాలస్య గణనా మాని**
**గ్రహాన్నాగా నతూన్ మాసా సత్వరాన్వత్సరాదిపాన్''**

సృష్టికర్త బ్రహ్మదేవుడు ఈ లోకాన్ని చైత్ర శుక్ల పాడ్యమినాడు సూర్యోదయ సమయంలో సంపూర్ణంగా సృష్టించి, కాలగణనంలో ప్రవర్తింప చేసినాడని చతుర్వర్గ చింతామణిలో వ్రాయబడింది. కాలగమనంలో గ్రహ, నక్షత్ర, ఋతు, మాస, వర్ష, వారాధిపులను ప్రవర్తింపచేసెను అని చెప్పబడింది. ధర్మసింధు రచయిత చైత్ర శుక్ల పాడ్యమినే అంగీకరిస్తూ దృఢపరిచాడు.

ఉగాది పర్వదినము నాడు సూర్యోదయానికి ముందే అనగా బ్రాహ్మీ ముహూర్తంలోనే నిద్రలేచి, కాలకృత్యములు తీర్చుకొని, నువ్వుల నూనెతో తలంటుకోవాలి. నువ్వులనూనె లక్ష్మీకరం. నీరు గంగాజలంతో సమానం. కావున గంగా యమునా సరస్వతీ నదులను స్మరిస్తూ అభ్యంగనస్నానం చేయాలి. స్నానానికి ఉపయోగించే నీటిలో పంచ పల్లవాలను నానబెట్టి, ఆ నీటితో తలస్నానం చేయాలి. ఆ రోజు (ఉగాది) నూనెతో తలస్నానం చేసినవారు లక్ష్మి, గంగల అనుగ్రహం పొందుతారు. అంతేకాక అభ్యంగన స్నానం వల్ల అవయవ పుష్టి కలుగుతుంది. ఆరోగ్యప్రదం. ఆయుర్దాయకం. అభ్యంగన స్నానం చేసిన తరువాత నూతన వస్త్రములను పూజించి ధరించాలి. వస్త్రములు సర్వదేవతా స్వరూపమని (సర్వ దైవత్యం దైవానః) వేదం చెబుతోంది. కాబట్టి పూజించి, నమస్కరించి, ప్రార్థించి, ధరించి దైవారాధన చేసుకుని ధరించాలి. ఇది హైందవ సంస్కృతి నియమం.

అనంతరం నుదుటిన విభూతిని ధరించి గంధం, కుంకుమ పెట్టుకుని సూర్యభగవానునికి నమస్కరించి పెద్ద పాత్రలో నీరు, అందులో పువ్వులను వేసి సూర్యునికి ఎదురుగా నిలబెట్టి ప్రత్యక్ష నారాయణునికి అర్ఘ్యమిచ్చి ఆ నీటిని తులసి కోటలో కానీ పూల కుండీలలో కాని పోయాలి.



సంవత్సరాదినాడు స్త్రీలు

రంగవల్లు లతో వివిధ పుష్పాలతో తోరణములు కట్టి, మామిడి ఆకులతో గృహాలంకారము కావిస్తారు. తరువాత దే వుని గదిలో గోమయంతో అలికి మంటపాన్ని ఏర్పరచి వారి వారి ఇష్టదేవతా పటములను ఉంచి, కలశమును ఏర్పాటు చేసుకొని ఆ తర్వాత పసుపుతో గణపతి ప్రతిమను చేసుకుని అత్యంత భక్తి శ్రద్ధలతో పూజిస్తారు. ఇంటిముందు ధ్వజారోహణం చేయాలని శాస్త్రం చెబుతోంది. మండపముపై నూతన వస్త్రమును పరచి, 5 పావుల బియ్యాన్ని పోసి, దానిపై అష్టదళ పద్మాన్ని ఏర్పరచి, దానిపై పూర్ణకలశాన్ని పెట్టి అందులో పరిశుద్ధమైన పవిత్రమైన జలమును నింపి సుగంధ ద్రవ్యాలు, చందనమును, తులసి, మారేడు దళాలను, తులసి బృందావనంలోని మట్టిని వేసి దానిపై మామిడి, మఱ్ఱి, రావి, జువ్వి, మేడి చెట్ల చివుళ్ళు ఉంచి పుష్పమాలికలతో, కల్పోక్త ప్రాణ ప్రతిష్ఠాదులు చేసి బ్రహ్మాది దేవతలను ఆవాహన చేసి పూజించాలి.

ఉగాది అనగానే గుర్తుకు వచ్చేది ఉగాది పచ్చడి. దీనినే శాస్త్రాలలో "నింబ కుసుమ భక్షణం" లేక "అశోక కళికా ప్రాశనం" అంటారు. అశోక కళికా ప్రాశనమమని ఆయుర్వేదం పేరు పెట్టింది.

ఉగాది పచ్చడి షడ్రుచుల సమ్మేళనం. కొత్తబెల్లం, కొత్త చింతపండు, లేత మామిడి కాయలు, వేపపూత, పచ్చి మిరపకాయలు, ఉప్పు కలిపి ఉగాది పచ్చడిని తయారు చేస్తారు. కొందరు పచ్చి మిరపకాయలకు బదులు మిరియాల పొడిని వాడుతూ ఉంటారు. తీపి, పులుపు, వగరు, చేదు, కారం, ఉప్పు అనే షడ్రుచులతో కూడిన ఉగాది పచ్చడిని స్వీకరించడం వల్ల సంవత్సరమంతా మనిషి అన్ని రకాలైన ఆటుపోట్లను ఎదుర్కొనే ధైర్య సాహసాలను పొందుతాడు. ఆరోగ్యపరంగా చూస్తే బెల్లం శరీర వేడిని తగ్గించి చల్లదనాన్ని అందించడం, కాలేయ సంబంధ వ్యాధులను నయం చేసి, ఆకలిని కలిగించడంతో పాటు, ఎముకలకు బలం చేకూరుస్తుంది. కొన్ని ప్రాంతాలలో వీటిని కలపడానికి ఉపయోగించే కుండ కూడా కొత్తదిగానే చూస్తారు. ఉగాది పచ్చడి సేవించడం వల్ల విష దోషాలను హరిస్తుంది. వాత, పిత్తములు పెరగకుండా కాపాడుతుంది. కంటిచూపు మెరుగు పరుస్తుంది. తరచూ వచ్చే తలనొప్పికి మంచి నివారకంగా ఉంటుంది. చర్మానికి మంచి వర్చస్సుని, వర్ణాన్ని, తేజస్సుని, మృదుత్వాన్ని ఇస్తుంది. షుగర్ వ్యాధి, స్థూలకాయం, బి.పి, క్యాన్సర్, ఉబ్బసం, కీళ్ళనొప్పుల విషయంలో మేలు కలుగుతుంది. కఫ, శ్వాస కోశ వ్యాధులకు దివ్యౌషధం. దైవారాధన చేసుకొని, షడ్రుచుల వేప ప్రసాదాన్ని దైవానికి నివేదించి మనం స్వీకరించాలి. ఈ ప్రసాదం కూడా ఇంటి యజమానురాలు పెట్టాలని పెద్దల వాక్కు. ప్రసాదాన్ని స్వీకరించే సమయంలో

**"త్వామష్ట శోక నరాభీష్ట మధుమాస సముద్భవ**
**నిచామి శోక సంతప్తాం మమ శోకం సదాకురు"**

అనే మంత్రం చదువుతూ ఉగాది పచ్చడిని తినాలని శాస్త్రాలు చెబుతున్నాయి. ఉగాది పచ్చడి కన్నా యుక్తాహారం ఇంకెక్కడ ఉంటుంది?

**"యుక్తాహార విహారస్య యుక్త చేష్టస్య కర్మసు**
**యుక్త స్వప్నావ బోధస్య యోగభవతి కశ్చిన"**

అంటోంది భగవద్గీత. ఈ వాక్యానికి లేక శ్లోకానికి ఉదాహరణగా నిలుస్తోంది ఉగాది పచ్చడి.

ఉగాదినాడు పాటించాల్సిన మరో ప్రధాన విధి "పంచాంగ శ్రవణం". పంచ+అంగ=పంచాంగ తిథి, వార, నక్షత్ర, యోగ, కరణములనే ఐదు అంగములను గురించి వివరించు దానినే పంచాంగం అంటారు. మనం ఏ పని సాధించాలన్నా పంచాంగం చూడాలి. తిథులు శ్రేయస్సును "తిథేశ్చ శ్రియమాప్నోతి" అని శాస్త్ర వచనం. వారము ఆయుష్షను వృద్ధి చేస్తాయి. నక్షత్రం పాపాలను పోగొట్టి రోగమును నివారిస్తుంది. కరణం కార్యసిద్ధిని చేకూరుస్తుంది. కాలానుకూలత నెరిగి కార్యములు నిర్వర్తించువారికి దేవతానుగ్రహం లభిస్తుంది. కనుకనే ఉగాది పండుగ రోజున పంచాంగ శ్రవణ కార్యక్రమాన్ని నిర్దేశించింది హిందూ ధర్మం. శ్రవణమంటే వినడం. శ్రావణం అంటే వినిపించడం. ఉగాది రోజున పంచాంగాన్ని చదివో, చదివించుకునో చేసి దాని గురించి తెలుసుకోవాలి. పంచాంగ శ్రవణం వల్ల గంగానదిలో స్నానం చేసిన ఫలం లభిస్తుందని శాస్త్ర వచనం. ఉగాది రోజున పంచాంగ శ్రవణం చేసినందు వల్ల సకల సద్గుణాలు కలుగుతాయి. అనంత కాలాన్ని సంవత్సరమనే ప్రమాణంతో గణించి, గ్రహ నక్షత్రాది సంచారాన్ని, వాటి ఫలితాలను గుణించి గ్రహించి మానవునికి చేయవలసిన పనులను, చేయకూడని పనులను తెలియజేసే సాధనం పంచాంగం.

ఉగాది రోజున పసందైన కవి సమ్మేళనాలు జరుగుతాయి. తెలుగునాట నలుచెరగులా ప్రసిద్ధ కవులతో పాటు ఔత్సాహికులు కూడా ఈ సమ్మేళనాలలో పాల్గొని తమ కవితా పటిమను వివరిస్తారు.

ఇంతటి విశిష్టమైన ఉగాది పండుగ సర్వులకూ ఆనందము, ఆయురారోగ్యాలు, సుఖశాంతులు కలిగించాలని ఆకాంక్షిస్తూ ఆనందోత్సాహాలతో జరుపుకుందాం.

**"ఓం నమో వేంకటేశాయ"**



# శఠగోపం

## శఠగోపయతి నమ్మాళ్వార్

- మందరపు వి.జి.శంకరాచారి

**భగవంతుని అనుగ్రహం పొందటానికి ఈ కలియుగంలో నామస్మరణయే సరియైన దారి. అయితే భౌతికంగా ఆ పరమాత్ముని ఆశీస్సులు మనందరికీ ఆలయాలలో పూజారి మన తలపైన ఉంచే శఠగోపం వలన లభిస్తుంది. ఈవిధంగా పరంధాముని అనుగ్రహం పొందడానికి శఠగోప యతి నమ్మాళ్వార్ గా పిలువబడే శఠగోపముని అనే నిస్వార్థ భక్తుడి గురించి.**

కలియుగం ప్రారం భమైన తొలిదినాలలో ఈ భరత ఖండంలో భా గమైన 'కురికాపురి' అనే రాజ్యాన్ని 'కారి' అనే రా జు పరిపాలిస్తూ ఉండేవాడు. ఇతడు అపరిమితమైన విష్ణుభక్తుడు. సదాచార సంపన్నుడు. సత్కర్మలు చేసే గొప్ప ప్రజాసేవకుడు. ఇన్ని సద్గుణాలున్నా సంతానం కలుగకపోవడం గొప్ప విచారకరం. అయితే ఒకసారి ఈ రాజదంపతులు ఇద్దరూ ఆ ఊరిలో గల వైష్ణవాలయానికి వెళ్ళి ఏడు రోజుల పాటు ఉపవాస ప్రార్థనలు చేస్తారు. వారి ప్రార్థనను భగవంతుడు ఆలకిస్తాడు. పుత్ర సంతానాన్ని అనుగ్రహిస్తాడు.

సరిగా కలియుగం ఆరంభమైన 42వ రోజున 'కారి' రాజ దంపతులకు ఒక శిశువు జన్మిస్తాడు. అయితే విచిత్రం... పుట్టిన మగశిశువు ఏ క్షణంలోనూ ఏడ్వడు. కదలడు. నిశ్చలంగా ఉంటాడు. అలా ఉండిపోవడం అందరినీ అబ్బురపరుస్తుంది. ఎన్నిసార్లు ప్రయత్నించినా ఆ శిశువులో చలనం ఉండదు. కానీ జీవం ఉంటుంది. ఇక్కడ ఒక విషయం వివరించాలి. ఏ తల్లి గర్భం నుండి జన్మించిన ఏ శిశువైనా మరుక్షణం ఏడుస్తుంది. అలా ఏడ్చినవెంటనే వారు తమ యొక్క పూర్వజన్మ మరిచిపోతారన్నది భగవంతుడి మాట. ఆ విధంగా ఏడ్చిన శిశువుని శఠం (శఠం అనగా మాయ) కమ్మేస్తుంది. అటువంటిది ఈ కారి రాజపుత్రుడు ఈ పుడమిపై పడిన వెంటనే ఏడ్వకుండా కోపంతో శఠమును ఎదిరించి జన్మించినవాడు కాబట్టి శఠకోపమునిగా తదనంతర కాలములో పిలువబడ్డాడు. విష్వక్సేనుల వారి అంశగా జన్మించినవాడు కాబట్టి జీవం కలిగి మాయను ఎదిరించి ఏడ్వకుండా కదలకుండా ఉన్నాడు.

ఆ విధంగా ఎదుగుదల లేకుండా పడియున్న ఆ శిశువుని తీసుకుని కారి రాజ దంపతులు ఒక శుభముహూర్తములో మరలా వైష్ణవాలయమునకు వెళ్ళి ఆ గుడిలోని విష్ణు పాదముల చెంత ఉంచి ఈ విధముగా ప్రార్థన చేస్తారు.

“పరంధామా! సంతానం లేని మాకు పుత్ర సంతానాన్ని అనుగ్రహించావు. కానీ పుట్టిన ఈ శిశువు నిశ్చలంగా ఉన్నాడు. జీవం ఉండి పెరుగుదల లేకుండా ఉన్న ఈ శిశువును నాకు పుత్రుడిగా ఎందుకు జన్మింప చేశావో అర్థం కావడం లేదు. ఓ స్థితికారకా! నీవే మాకు రక్ష. నా కుమారుణ్ణి అందరిలాగా ఎదిగేటట్టు చేయి తండ్రీ” అంటూ దీనం ప్రార్థన చేస్తారు. అప్పుడు వారికి ఆ దేవాలయం నుండి అంతర్ వాణి గా స్థితికారకుని మాటలు ఈ విధంగా వినిపిస్తాయి.

''ఓయీ! కారి మహారాజా! నీ కుమారుడు సామాన్యుడు కాడు. విష్వక్సేనుల వారి అంశతో జన్మించినవాడు. శఠాన్ని (మాయను) ఎదిరించి ఈ భూమిపై అవతరించినవాడు. నేటికి 16 వ రోజు నుండి ఈ శిశువులో ఎదుగుదల ప్రారంభమవుతుంది. ఇక్కడ కొంత కాలము ఉన్న తర్వాత ఈ బాలుడు ఇక్కడకు దగ్గర్లోనే కనిపిస్తున్న చింత చెట్టు వద్దకు భగవదనుగ్రహముతో మార్చబడతాడు. అక్కడ 16 సం॥లు పూర్తి కావస్తున్న సమయంలో ఒక మహావ్యక్తి చర్య వలన మాట్లాడటం ప్రారంభిస్తాడు. తదనంతరం కృష్ణభక్తునిగా విరాజిల్లుతాడు. కృష్ణ తత్వాన్ని కీర్తనలుగా పాడి ప్రజలలో భక్తిభావానికి అంకురం వేస్తాడు. ఇతని భక్తికి పరమాత్మయే దాసుడవుతాడు. పరమాత్మను కోరిన ఇతడి కోరికతో ప్రజలందరూ ఉద్ధరించబడతారు. కావున నీవు విచారమును వదిలి నీ కుమారుణ్ణి ఈ దేవాలయమునందు నేను చెప్పిన ప్రదేశము నందు ఉంచి మీరు వెళ్ళిపోండి. హరినామ సంకీర్తనలో... నామ జపంలో జీవించండి. ఈ జన్మలోనే మీకు కైవల్యాన్ని ప్రసాదిస్తాను'' అన్న మాటలు విన్న ఆ రాజ దంపతులు తమ బిడ్డను పరమాత్మ చెప్పిన ప్రదేశములో ఉంచి తమ రాజ్యానికి తిరిగి వెళ్ళిపోతారు.

ఈవిధంగా కురికాపురి రాజ్యంలో ఆ దేశ రాజుకు జన్మించిన శఠకోపముని కొంతకాలమైన తర్వాత చింతచెట్టు కిందకు చేర్చబడతాడు. అక్కడే ఆ శిశువులోని ఎదుగుదల ప్రారంభమవుతుంది. తనకు తనే కూర్చొనడం... అక్కడే బొంగరం పరిణామ క్రియలతో పెరుగుతాడు. 7 సంవత్సరాల వయస్సు వచ్చినప్పటి నుండి ధ్యానంలో నిమగ్నుడవుతాడు. అలా 16సం॥లు పూర్తి కావొచ్చే సమయం ఆసన్నమవుతుంది. ఈవిధంగా ఇతడి జీవనక్రియ సాగుతోంది.

ఈ కురికాపురి రాజ్యానికి దగ్గర్లోనే 'తిరుక్కోరూర్' అనే ఊరు గలదు. అక్కడకు ఆళ్వార్ అనే మధుర కవి హరినామ సంకీర్తనతో దేశాటన చేయుచూ వస్తాడా రోజు. ఈ విధంగా దేశాటన చేయుచు తిరుగుచున్న అతడు అయోధ్యాపురమనే గ్రామానికి చేరుకుంటాడు. (ఈ గ్రామం తిరుక్కోరూర్ ఊరుకి దగ్గర్లో ఉన్న గ్రామం) ఆ రోజు రాత్రి అతడు ఒక దేవాలయం ఆరుబయట పడుకొని ఉన్న సమయంలో మిరుమిట్లు గొలుపుతూ ఒక నక్షత్రం నడుస్తున్నట్లుగా అతడికి కనిపిస్తుంది. ఆశ్చర్యమనిపించి ఆ క్షణమే ఆ నక్షత్రం దక్షిణ దిక్కుగా సాగుతూ ఉంటే దానిని అనుసరిస్తాడు. చివరికి అతడు శఠగోపముని ఉన్న ఊరుకి చేరుకుంటాడు.

ఆళ్వార్ ఆ ఊరుకి చేరుకొనగానే ఆకాశంలో నడుస్తూ వచ్చిన నక్షత్రం మాయమైపోతుంది. అది గమనించిన మధుర కవి ఆళ్వార్ ఈ ఊరిలో ఎవరో ఒక మహానుభావుడు ఉండి ఉంటాడు. అందుకే నక్షత్రం మాయమైపోయింది అని అనుకొంటాడు. ఈ విషయమై ఆ ఊరి ప్రజలను అడిగితే వైష్ణవ ఆలయానికి దగ్గరలో గల చింతచెట్టు దగ్గర గత పదహారేళ్ళుగా శఠకోపముని పెరిగిన వైనం తెలుపుతారు. అన్నపానీయాలు తీసుకోకుండా ఈ 16 సం॥లు తదేక ధ్యానంతో ఉన్నాడని ఆ గ్రామ ప్రజలు చెపితే మధుర కవి ఆళ్వార్ విష్ణు ఆలయానికి దగ్గర్లో గల చింతచెట్టు దగ్గరకు వెళతాడు.

అక్కడ తదేక ధ్యానంలో నిమగ్నమై ఉన్న శఠకోపమునిని చూస్తాడు ఆళ్వార్. అతనిని చూసినపుడు అతడిలో అదృశ్యమైపోయిన నక్షత్రం యొక్క కాంతి అంతా కనిపిస్తుంది. అలా కనిపించడంతో ఆ శఠకోపముని అవతార పురుషుడని నిశ్చయించుకుంటాడు.

నిశ్చలంగా కూర్చుని యున్న అతని దగ్గరకు వచ్చి 'నీ పేరేమిటి?' అని అడుగుతాడు. శఠకోపముని అతని మాటలకు సమాధానం ఇవ్వడు. అది గమనించిన మధురకవి ఆళ్వార్ అతను కూర్చుని ఉన్న చింతచెట్టు పైకి ఎక్కి అక్కడినుండి పెద్దరాయిని అతని ముందు పడేటట్టుగా పడవేస్తాడు. ఆ రాయి శబ్దానికి శఠకోపముని కనులు తెరచి ఆళ్వార్ వైపు చూస్తాడు.

అప్పుడు మధురకవి ఆళ్వార్ అతనితో ''తమరు ఎవరు? గత 16 సంవత్సరాలుగా అన్నాహారాలు మాని తదేక ధ్యానంతో ఇక్కడ ఎందుకు కూర్చుని ఉన్నారు'' అని ప్రశ్నిస్తాడు.

దానికి శఠకోపముని నవ్వుతూ ''తల్లి గర్భం నుండి జన్మించినఏ శిశువైనా ఇలపైపడినవెంటనే శఠమునకు (మాయకు) ప్రభావితుడై పోతున్నాడు. పరమాత్మ కొరకు పరితపించుట లేదు. ఒక కొండచిలువలా అక్కడే తింటున్నాడు. అక్కడే పడి ఉంటున్నాడు. తన గమ్యమేమిటో తెలుసుకోలేకపోతున్నాడు'' అని వేదాంతిలా సమాధానమిచ్చాడు.

ఆ సమాధానం మధురకవికి ఎంతగానో నచ్చుతుంది. (అక్కడే తింటుంది. అక్కడే పడిఉంటుంది అన్న

**భక్తులెవరైనా పూజారి ద్వారా శఠగోపాన్ని తలపై ఉంచుకొన్నప్పుడు నా పుణ్యాన్ని క్షయం చేస్తూ నీ అనుగ్రహాన్ని ప్రసాదించవచవయ్యా. ఈ ప్రక్రియ నిరంతరం సాగుతూ ఉండి మానవాళిని రక్షించవలెననేదే నా కోరిక తండ్రీ**




వాక్యంలో పరమార్థాన్ని గ్రహిస్తాడు. ఇందులో పరమార్థం ఏమిటంటే పరమాత్మ యొక్క 84 లక్షల జీవరాశుల సంతానం ఈ భూమిపైన మొదలై ఇక్కడే అంతమైపోతోంది. పరమాత్మలో ఏ జీవీ ఐక్యం కావడం లేదు). ఈ సమాధానానికి మురిసిపోయి మధురకవి ఆ బాలుణ్ణి తన గురువుగా ఎంచుకొని అతడి అనుమతితో అతనితోనే ఉండి గురు శుశ్రూష చేసుకుంటూ ఉంటాడు.

పదహారు సంవత్సరాల పాటు తన మౌన ధ్యానపు పెరుగుదలలో దర్శించిన దివ్య అనుభూతులను వల్లె వేసుకుంటూ శ్రీకృష్ణుడిపైన, రంగనాథుడిపైన ఎన్నో కీర్తనలను రచించి మధురంగా ఆలపిస్తాడు. అతడి కీర్తలను తన్మయంగా విన్న శ్రీరంగనాథుడు శఠకోపమునిని నా ఆళ్వార్ అనుకునేవాడు. ఏరోజైనా శఠకోపముని తనను కీర్తించనిచో ఆ స్వామియే వైకుంఠం నుండి దిగివచ్చి తనని కీర్తించమని కోరేవాడు. భగవంతుడిచేత నా ఆళ్వార్ గా పిలిపించుకున్న ఈ శఠకోపమునియే తదుపరి కాలంలో నమ్మాళ్వార్ గా ప్రసిద్ధుడైనాడు.

తన గాన మాధుర్యంతో ప్రతిక్షణం రంగనాథుడిని పరవశింప చేస్తున్న నమ్మాళ్వార్ కి అతడి అంతిమ ఘడియలో ఎదురుగా ప్రత్యక్షమైన శ్రీమహావిష్ణువు అతడిని ఏం వరం కావాలో కోరుకో అని అడుగుతూ ఒక ప్రశ్న వేస్తాడు.

‘‘ఓయీ భక్తాగ్రేసరా! నాకత్యంత ప్రీతిపాత్రుడవైన నా ఆళ్వార్ ఈ జన్మలో నీవు రాజకుమారుడిగా జన్మించి కూడా చింతచెట్టు క్రింద పెరిగావు. భోగాలను అనుభవించలేదు. మరుజన్మలోనైనా రాజభోగాలను అనుభవించే రాజుగా నీకు జన్మనీయమందువా... లేక మోక్షాన్ని కోరుకొందువా’’ అంటాడు.

అందుకు నమ్మాళ్వార్ ‘తండ్రీ! నాకు భోగాలను అనుభవించాలనే ఆసక్తి లేదు. కోరికలు లేశమాత్రమైన నా మదిలో కానరావు. ఇక మోక్షం గురించి ఆలోచించడం లేదు. నాకు కావలసినదంతా లోక కళ్యాణం. అందరికీ నీ అనుగ్రహం నా ద్వారా ప్రసరించేటట్లుగా చూడు పరంధామా’’ అంటాడు.

‘‘ఏ విధంగా నీ ద్వారా అనుగ్రహాన్ని ప్రజలకు నేను అందివ్వగలను?’’ అని అడుగుతాడు రంగనాథుడు.

‘‘పరంధామా! ఏవిధంగా అనుగ్రహించగలరో అన్నది నీకు తెలియదా... అయినా నీకు తెలియజేస్తాను. పరాత్పరా నీ పాదుకలను నా తలపై ఉంచి నాకు గల పుణ్యాన్నంతా నీ పాదాల దగ్గర కేంద్రీకరించి ఆలయంలో ప్రవేశించిన భక్తులెవరైనా పూజారి ద్వారా శఠగోపాన్ని తలపై ఉంచుకొన్నప్పుడు నా పుణ్యాన్ని క్షయం చేస్తూ నీ అనుగ్రహాన్ని ప్రసాదించవచవయ్యా. ఈ ప్రక్రియ నిరంతరం సాగుతూ ఉండి మానవాళిని రక్షించవలెననేదే నా కోరిక తండ్రీ’ అని కోరతాడు.

లోక కళ్యాణం కోసం అర్థించిన శఠకోపముని (తదనంతర కాలంలో శఠకోపమే శఠగోపంగా మారింది. భక్తులు పూజారి ద్వారా శఠగోపాన్ని స్వీకరించినప్పుడు ఆ పరంధాముడు శఠకోపముని పుణ్య విశేషం వలన మనమెదుర్కుంటున్న మాయని (శఠం అంటే మాయ) క్షీణింపచేస్తూ పరంధాముడు అనుగ్రహిస్తున్నాడని అర్థం) కోరికను శ్రీమహావిష్ణువు ‘తథాస్తు’ అంటూ తన సమ్మతిని తెలియజేస్తాడు.

తదనంతరం విష్వక్సేనుల వారి అంశతో ఈ పుడమిపై అవతరించిన శఠకోపమునిగా పిలువబడి నమ్మాళ్వార్ గా ప్రసిద్ధుడైన ఆళ్వార్ లలో 11 వ వాడిగా చెప్పబడిన అతని జీవం విష్ణు సాన్నిధ్యాన్ని పొందుతుంది.

తిరుమల శ్రీ వేంకటేశ్వరునికి కోట్ల జపములో భాగముగా

# 20వ పర్యాయంగా 7 కోట్ల జప సమర్పణ

# శ్రీ వేంకటేశ్వర దివ్య మహామంత్ర లిఖిత జపము



ఈ సంవత్సరము తిరుమల శ్రీవారికి సమర్పించబోయే 7 కోట్ల జపములో భాగస్వాములు కండి! ఆ స్వామి కరుణా కటాక్షములకు పాత్రులు కండి!!

మీ మీ కోరికలను తీర్చుమని తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని ప్రార్థించే భాగ్యాన్ని మాకు ప్రసాదించండి!!

## సంకల్పం

శ్రీ వేంకటేశ్వరుని కరుణా కటాక్షములకు, స్వామివారి అనుగ్రహానికి అందరూ పాత్రులు కావలెననే ఉద్దేశ్యంతో ఆయన నామస్మరణలోని మాధుర్యాన్ని అందరూ అనుభవించాలనే ఆకాంక్షతో.. ప్రతి భక్తునిచే 1,008 సార్లకు తక్కువ కాకుండా 7 కోట్ల జపమును వ్రాయించి ఒక పవిత్రమైన రోజున తిరుపతిలో, కొండపై ఇట్టి జపమును శ్రీవారి పాదముల చెంత పెట్టి, నివేదించి, ఎస్.వి. డైరీ ఫాం ఆవరణలో జపహోమాదులు నిర్వహించి 'శ్రీ వేంకటేశ్వర దివ్య మహామంత్ర స్థూపం'లో స్వామివారికి సమర్పించాలనే సంకల్పంతో ఈ కార్యక్రమం చేపట్టబడింది.

**నిబంధనలు:**

1. ఈ మహామంత్రాన్ని వ్రాయుటకు ముందు మీ మనస్సులోని కోరికలను శ్రీవారికి నివేదించి, మనసారా ధ్యానిస్తూ, నోరారా పలుకుతూ వ్రాయండి. మననం, స్మరణం స్వామివారికి ప్రియం.
2. ఈ మంత్రమును కుల మత భేదం లేకుండా అందరూ వ్రాయవచ్చును. మన ఆచారవ్యవహారాల ప్రకారం అర్హత లేని సమయములో వ్రాయకూడదు.
3. ఈ మంత్రమును మీ మీ సొంత పేపర్లపై వ్రాయండి లేదా మానుంచి స్వామివారి దివ్యమహామంత్ర లిఖిత జప పుస్తకమును పొంది వ్రాయండి. పుస్తకమును పోస్టు ద్వారా కోరువారు పోస్టు ఖర్చుల నిమిత్తం రూ. 5/– ఎం.ఓ (ఒక్కంటికి) పంపినచో మేము మీకు జప పుస్తకాన్ని పంపగలము. (రూ. 10/–కి తక్కువ కాకుండా పంపండి). 9348212354 నంబర్‌కు ఫోన్‌పే, పేటిఎం, గూగుల్‌పే ద్వారా డబ్బులు, అడ్రస్ పంపి జప పుస్తకమును పొందవచ్చును.
4. మీరు ఈ మంత్రమును 45 రోజులలో వ్రాసి 'శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం' ఇం.నెం. 1–1–53, వీధి నెం. 1, హబ్సీగూడ, హైదరాబాద్ – 500007 చిరునామాకు మాత్రమే నేరుగా గానీ / పోస్ట్ / కొరియర్ ద్వరా గానీ పంపగలరు. జప సమర్పణోత్సవ కార్యక్రమ వివరాలతో పాటు ఆహ్వాన పత్రం అందజేయడానికి వీలుగా సొంత చిరునామా కలిగి రూ. 5/– స్టాంపు అతికించిన కవరును జతపరిచి పంపగలరు.
5. ఈ మహామంత్రమును వ్రాయునప్పుడు మీలో కలిగిన అనుభూతులను మాకు వ్రాసి పంపగలరు.
6. మీరు వ్రాయవలసిన దివ్య మహామంత్రం 'ఓం నమో వేంకటేశాయ'

**గమనిక:**

మేము శ్రీవారికి 2002 నుండి ప్రతి సంవత్సరం సమర్పించదలచిన 7 కోట్ల జపములో మీరు ప్రతి సంవత్సరము పాల్గొని శ్రీవారి కృపను, ఆశీస్సులను సంపూర్ణంగా పొందగలరని ప్రార్థన.

స్వామి నామమును 1,008 సార్లు వ్రాయలేనివారు కనీసం 108 సార్లు అయినా వ్రాసి ఏడు కోట్ల జపములో భాగస్వాములు కాగలరని మనవి.

శ్రీ వేంకటేశ్వర అనుగ్రహ ప్రాప్తిరస్తు..!

**శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం**

ఇం.నెం. 1–1–53, వీధి నెం. 1,
హబ్సీగూడ, హైదరాబాద్ – 500007.
ఫోన్: 040– 27175050

ఈ కార్యక్రమం గురించి పూర్తి వివరాలకు సంప్రదించండి:

**93482 12354**



# నిజభక్తి భావం

- డా|| కూర్మాచలం శంకరస్వామి

ప్రేమ తత్త్వ భావమే నిజమైన భక్తి యని నారదాది మునులు ఉపదేశించినారు. భజ అను దాని నుండి భక్తి అను శబ్దం పుట్టింది. వివిధ నామాలతో కూడిన నదులన్నీ సముద్రంలో కలిసి తమ రూపాలు కోల్పోయి సముద్ర నీరుగా మారిపోయినట్లే వివిధ రూపాలలో ఉన్న దేహములు గలిగిన మానవులు భగవంతునిలో ఐక్యము చెందుటకు ఉపకరించే సాధనమే భక్తి. ఈ భక్తి మార్గాలు నవవిధాలు. శ్రవణం, కీర్తనం, వందనం, పాదసేవనం, అర్చనం, దాస్యం, సఖ్యం, స్మరణం, ఆత్మనివేదనం అనే తొమ్మిది రకాల భక్తిమార్గాల ద్వారా భగవంతుని చేరుకోగలమని వేద ప్రబోధం. ఈ మార్గాల ద్వారా ముక్తిని పొందిన వారు ఎందరో ఉన్నారు. వారిలో నారదుడు, శుకమహర్షి, ప్రహ్లాదుడు, హనుమంతుడు, శబరి, అర్జునుడు, కుచేలుడు, పరీక్షిత్తు, లక్ష్మీదేవి, రుక్మిణి, ద్రౌపది, అక్రూరుడు, పృథుమహారాజు, బలిచక్రవర్తి. కలియుగంలో అన్నమయ్య, రామదాసు, త్యాగరాజు, క్షేత్రయ్య, వెంగమాంబ, రామానుజులు, కులశేఖరాళ్వారులు, అనంతార్యులు, తిరుమలనంబి, హాథీరాం బాబా, కుమ్మరి భీముడు, తులసీదాసు. రాజులలో కంచి వరదరాజస్వామి, తొండమాన్ చక్రవర్తి, ఆకాశరాజు, కృష్ణరాయలు, సాళువ భూపతులు, సన్నిధి గొల్ల మొదలగు వారు తమకు తోచిన మార్గాలలో భగవంతుణ్ణి సేవించి ముక్తిని పొందినట్లు రామాయణ, భారత, భాగవత, అష్టాదశ పురాణాలు, వేంకటేశ్వర మాహాత్మ్యం, అన్నమయ్య, రామదాసు కీర్తనలు మొదలు పవిత్ర గ్రంథాల ద్వారా తెలుస్తున్నది.

**భక్తి యోగము అత్యంత సులభమైన మార్గము. మానవులు తమ తమ కార్యములను చేస్తూ అదే సమయంలో ''హరే రామ హరే రామ రామ రామ హరే హరే, హరే కృష్ణ హరే కృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే'' అను మంత్రమును జపించవలయును. అట్టి మంత్రోచ్చారణము అతనిని ఆ భగవంతుని వైపు ఆకర్షితుడిని చేయగలదు.**

దేవుడెక్కడ ఉన్నాడో తెలుసుకోవడం చాలా కష్టం. అసలెక్కడ లేడో తెలుసుకోవడం అంతకంటే కష్టం. కారణం ఏదైనా, ఎవరైనా ఈ విషయం నిరూపించేందుకే స్తంభంలో నరసింహావతారం ఆవిర్భవించింది. సత్య దర్శనం కోసం తప్ప దేవుడి ఉనికిని సందేహంతో వెతకడం కంటే మూర్ఖమైన పని మరొకటి లేదు. ఎందుకంటే ఎక్కడో లేదా ఎక్కడైనా ఉన్నవాణ్ణి వెతికి పట్టుకోవచ్చు. ఎక్కడ లేడో తెలియనివాణ్ణి పట్టుకునే వీలు ఉంటుందా? ఇందుగలడందులేడను సందేహం వలదు చక్రి సర్వోపగతుండు కదా? భగవంతుని ఉనికి నిర్ధారణకు ఆస్కారమే లేదా? పరిష్కారమే ఉండదా? దేవుడంతటివాడు ఉన్నాడో లేడో స్పష్టంగా తెలీనివాడు లేడని ఎలా అనుకోగలం? అదీ పొరపాటయితే జరిగే నష్టం మనల్ని ఎక్కువ భయపెడుతుంది.

మానవ మనస్తత్వం విచిత్రమైంది. వాస్తవాన్ని నమ్మి నిర్భీతిగా ఉండడం కంటే అవాస్తవాన్నే పట్టుకు వేళ్ళాడుతూ అనవసరమైన భయంతో అవస్థపడటమే దాని స్వభావం. నిజానికి ఒక మంచి ఉందంటే, ఒక మంచి జరుగుతుందంటే మనం అంత సులువుగా నమ్మం. ఎప్పుడూ సందేహ మానసంతో ఉండే మనం మంచి జరుగుతుందనే విషయాన్ని అంత తొందరగా జీర్ణం చేసుకోలేం. అణువణువునా ఆయన ఉనికి సుస్పష్టమవుతున్నా ఎందుకు మనిషి ఆయన ఉనికిని సందేహిస్తూనే ఉంటాడు? మనిషి ముందుగా ఈ డోలాయమాన స్థినుంచి బయటపడాలి. మరి అర్థం కానప్పుడు డోలాయమానమే కదా? కాదు అది అవగాహనా రాహిత్యం. ముందు మనం మన వాస్తవ స్థితిని గ్రహించాలి. గాలిలో దీపం కాదు. మానవజన్మ గమ్యరహితంగా భారరహిత స్థితిలో ఎగురుతున్న పక్షి ఈక కాదు. ఉద్దేశ రహితం అసలే కాదు. ఒక దీక్షా కంకణానికి ఒక కర్తవ్యాన్ని ముడిపెట్టి అనుకూల వనరులు ఒడికట్టి పంపిన బాధ్యతాయుత మానవ జన్మ ఇది.

ఈ పవిత్ర జన్మకు ఒక కర్త ఉన్నాడు. సూత్రధారి ఉన్నాడు. అతడే భగవంతుడు. ఆత్మానుసంధానమై ఉన్న సర్వోన్నతుడు, సర్వజ్ఞుడు, సర్వ స్రష్ట. మన శరీరాన్ని, ఆంతర్యాన్ని, జీవితాన్ని పరిశీలించుకున్నప్పుడు ఈ కీలుబొమ్మను ఆడించువాడొకడు ఉన్నాడనే స్పృహ మనకు కలుగుతుంది. ఆయననే అనుమానించిన మన అజ్ఞానానికి, అవివేకానికి సిగ్గు కలుగుతుంది. అమ్మ కడుపులో నవమాసాలు పెరిగి ఆమె ప్రాణాలు తీసినంత పనిచేసి ఈ లోకంలోకి వచ్చిన బిడ్డ అమ్మ అంటే ఎవరు అని అడిగితే ఎంత హాస్యాస్పదంగా ఉంటుందో ఇది కూడా అంతే.

ఏది ఏమైనా ఈ శరీరం ఒక దేవతా నిలయం. సర్వ దేవతా ఆవాసం. ప్రతి అణువు, ప్రతి కదలిక ఎక్కడుందంటే ఏం చెప్పగలం? పెరుగులో పాలెక్కడున్నాయంటే ఎలా చూపగలం? అంతటా నిండినవాడు, తానే అంతా అయినవాడు, వేరు చేసి ఎలా చూపగలం? అసలు ప్రత్యేకంగా ఎలాగుర్తించగలం? ఈ సందేహానికి సమాధానాన్ని కూడా ఆయననే అడగాలి. ఈ సమస్యకు పరిష్కారాన్ని కూడా ఆయననే చూపమనాలి. అవును ఆయన ఉనికిని తెలపమని ఆయనను వేడుకోవాలి. అలా వేడుకోవాలంటే మనం ఆధ్యాత్మిక చింతనాపరులం కావాలి. నవవిధ భక్తి మార్గాల ద్వారా ఆ భగవంతుని సన్నిధికి చేరుకుంటేనే అన్ని సమస్యలకు పరిష్కారం దొరుకుతుంది.

ఏది నిజభక్తి? ఎవరు నిజ భక్తులు?

''మయ్యావిత చేతసామ్'' అని భగవద్గీత శ్రీకృష్ణ పరమాత్మ చెప్పిన ప్రకారం ఓ పార్థా! సర్వకర్మలను నాకు అర్పించి అన్యచింత లేక నాకు భక్తులై మనస్సును నాయందే లగ్నము చేసి సదా నన్ను ధ్యానించుచు నా భక్తియుత సేవలో నన్ను అర్చించెడి వారికి శీఘ్రమే జనన మరణమును, సంసార సాగరము నుండి ఉద్ధరింతును'' అని పలుకులను బట్టి పరమ భాగ్యశాలురైన భక్తులు శ్రీకృష్ణ భగవానునిచే అతి శీఘ్రముగా భవసాగరముల నుండి తరింపచేయబడుదురని చెప్పిన మాటలను బట్టి భగవానుడు అత్యంత ఘనుడనియు మరియు జీవుడు అతనికి సేవకుడనియు తెలుసుకోగలిగే జ్ఞానమునకు శుద్ధభక్తి యోగమనియు, దాని ద్వారా భగవంతుని చేరుకోవడమే మానవుల నిజ భక్తి ధర్మము. అలా చేయని వారు మాయా సంసారములో మునిగిపోతారు. భక్తి యోగము చేతనే భగవంతుని సంపూర్ణత్వము అవగతము కాగలదు. కనుక ప్రతి యొక్కరు పరిపూర్ణముగా భక్తియుతులు కావలయును. భగవానుని పొందు నిమిత్తమై అతని యందే మనసు నిలిపి కర్మలను ఆచరింపవలయును. కర్మ ఏదైనను

అది భగవంతుని కొరకే అన్న భావనతో చేయవలయును. భగవంతుణ్ణి సంతృప్తి పరచుట కన్నను అన్యమైనదేదియును భక్తుడు సాధింప గోరడు. దేవునికి ప్రియము కూర్చుటయే తన జీవిత విధిగా భావించాలి.

భక్తి యోగము అత్యంత సులభమైన మార్గము. మానవులు తమ తమ కార్యములను చేస్తూ అదే సమయంలో ''హరే రామ హరే రామ రామ రామ హరే హరే, హరే కృష్ణ హరే కృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే'' అను మంత్రమును జపించవలయును. అట్టి మంత్రోచ్చారణము అతనిని ఆ భగవంతుని వైపు ఆకర్షితుడిని చేయగలదు. ఆ విధముగా నియుక్తుడైన శుద్ధ భక్తుని శీఘ్రమే భవసాగరం నుండి ఉద్ధరింతునని శ్రీకృష్ణుడు ప్రతిజ్ఞ చేశాడు. యోగము నందు సిద్ధులైనవారు యోగ విధానం ద్వారా తమ ఆత్మను తాము కోరుకున్న లోకమునకు పంప సమర్థులై యుందురు. కాని భక్తుల విషయంలో భగవంతుడే స్వయముగా తన వెంట గొనిపోవును. భక్తుడు ఆధ్యాత్మిక జగత్తును చేరుటకు గొప్ప అనుభవజ్ఞుడు కావలసిన అవసరం లేదు. సదా భగవంతుని నామ స్మరణ చేస్తే చాలు భక్తుడైనవాడు తన ఆత్మను ఆధ్యాత్మిక లోకములను చేర్చుటకు అష్టాంగ యోగ పద్ధతిని అనుసరించ వలసిన పనిలేదు. బాలుని రక్షణము తల్లి తండ్రులు స్వీకరించినట్లుగా నిజముగా శ్రద్ధతో తనను ఆశ్రయించినవారికి ఆ భగవంతుడే రక్షకుడై ముక్తిని ప్రసాదిస్తాడు.

నిజభక్తులు : నిజమైన భక్తుల గురించి ఆ శ్రీకృష్ణుడే ఇలా పేర్కొన్నాడు. ''మయ్యర్పిత మనో బుద్ధిర్యో మద్భక్తః మే ప్రియః''. ద్వేషమనునది లేకుండా సర్వజీవుల యెడ మైత్రిని కలిగినవాడును, మమత్వము లేనివాడును, మిథ్యాహంకార రహితుడును, సుఖ దుఃఖములు రెండింటి యందును సమభావం కలిగినవాడు, క్షమాగుణం కలవాడును, తన మనోబుద్ధులను నా యందు లగ్నం చేసి దృఢ నిశ్చయముతో నా భక్తి యందు నియుక్తుడైనట్టివాడును అగు నా భక్తుడు నాకు అత్యంత ప్రియుడు. అట్టి నిజభక్తుని యెడల నా అనుగ్రహము మెండుగా ఉంటుందని పలికిన పలుకుల్లో నిజభక్తి తత్త్వం గోచరిస్తుంది.

శుద్ధభక్తుడు ఎటువంటి పరిస్థితి యందును, ఎన్నడును దేనికి కలత నొందడు. ఎవరినీ మనసా, వాచా, కర్మణా ద్వేషించడు. శత్రువుకు శత్రువు కావలయునని అతడు ఎన్నడూ తలవడు. పైగా పూర్వకర్మల కారణంగానే ఇతడు నాయందు శత్రుభావము కలిగి యున్నాడని భావించును. భక్తుడు తన కలతకు, కష్టాలకు కారణం తానేనని భావిస్తాడు. దుఃఖ సమయంలో కూడా నిజభక్తుడు గుండె ధైర్యముతో, ఓర్పుతో, శాంతియుత భావనతో భగవన్నామ స్మరణ చేస్తూ ఉంటాడే తప్ప ఎవరినీ నిందించడు. నిజభక్తుడు దేహమును సంబంధించిన బాధలకు, కష్టములకు అధికముగా ప్రాధాన్యతను ఇవ్వడు. తాను భౌతిక శరీరమును కాననెడి విషయమును గ్రహించి దేహాత్మ భావము లేని కారణమున అతడు మిథ్యాహంకారములకు దూరుడై సుఖ దుఃఖముల యందు సదా సమభావము కలిగియుండును. అతడు క్షమాగుణమును కలిగి భగవత్కృపచే ఏది ప్రాప్తించినదో దానితోనే సంతుష్టుడై యుండును. కష్టసాధ్యమైన విషయాలందు ఆసక్తిని చూపడు.

నిజభక్తుడు ఇంద్రియ నిగ్రహము కలిగినవాడు. ఇంద్రియ నిగ్రహము కలిగి ఉన్నందున అతడు ధీరుడు మరియు స్థిర నిశ్చయము కలిగినవాడై యుండును. స్థిరచిత్తము, మనోబుద్ధులను ఆ దేవునియందే నిలిపిన నిజభక్తుని ఆ భగవంతుడు కూడా ప్రియత్వము చూపి కరుణించును. ''హర్షామర్ష భయోద్వేగైర్ముక్తోయ సచ మే ప్రియ''. అనగా ఎవరికి కష్టం కలిగించనివాడు, ఎవరి చేతను తాను కలతకు గురికానివాడు, సుఖ దుఃఖములందును మరియు భయోద్వేగములందును సమచిత్తునిగా నుండువాడును తనకు ప్రియమైనవాడని శ్రీకృష్ణుడు పలికినాడు. అనగా నిజభక్తునిచే ఎవ్వరును కష్టమునకు గాని, వేదనకు గాని, భయమునకు గాని, అసంతుష్టికి గాని గురి కారు. నిజభక్తుడు సర్వుల యెడ కరుణనే కలిగి యుండును. ఇతరులకు ఇబ్బందులు కలిగించే రీతిలో వర్తించడు. అతడు ఎట్టి బాహ్య క్షోభకు గురి కాలేదు. సాధారణముగా భౌతిక భావన కలిగిన మానవులు తన ఇంద్రియ ప్రీతికి ఏదైనా లభించినచో అత్యంత ఆనందమును పొందుతారు. కాని నిజభక్తి భావము కలిగినవారు ఎలాంటి ఇంద్రియ భావములకు లోను కారు. వారు సదా ఆ భగవంతుని యందే మనసు లగ్నం చేయడం ద్వారా స్థిర చిత్తులై ఉంటారు. సాధారణ కార్యకలాపముల నాశ్రయింపనివాడు పవిత్రుడు, సమర్థుడు, ఉదాశీనుడు, సర్వ వ్యధల నుండి ముక్తుడయినవాడు, ఏదేని ఫలము కొరకై తీవ్ర కృషి చేయనివాడు, ఉప్పొంగుట కాని, దుఃఖించుట గాని తెలియనివాడు, శుభాశుభముల రెండింటిని త్యాగము చేసినవాడు, శత్రుమిత్రుల యెడ సమభావము చూపెడువాడు, మానావమానాల యందు, శీతోష్ణములందు , సుఖ దుఃఖములందు, నిందాస్తుతులందు సమభావము కలిగినవాడు, జ్ఞానము నందు స్థిరుడైనవాడు, దైవమే పరమ గమ్యముగా చేసుకొని భక్తియోగమను అమృత పథమును అనుసరించుచు శ్రద్ధతో దీనియందు సంపూర్ణముగా నియుక్తులైన భక్తులే నిజమైన భక్తులు. అట్టి వారియందే ఆ భగవంతుని కృపాకటాక్షాలు మెండుగా ఉంటాయి.

ధారావాహికం



# మహాభారతంలోని మహోపాఖ్యానాలు

- డా॥ పులిగడ్డ విజయలక్ష్మి

(గత సంచిక తరువాయి)

## ధర్మవ్యాధోపాఖ్యానము

''మునిపుంగవులారా! నేడు జితేంద్రియుడు, సత్యవాది, మాతాపితృభక్తుడు అయిన ధర్మవ్యాధుడనే కిరాతుని ధర్మవర్తన గురించి తెల్పి మిమ్మల్ని ఆహ్లాదపరచాలని అనుకొంటున్నాను'' అన్న ఉగ్రశ్రవసుని పలుకులు విన్న శౌనకాదులు శ్రద్ధా భక్తులతో గురువు గారివైపు చూశారు. వారి ఆసక్తిని గమనించిన ఉగ్రశ్రవసుడు చెప్పటం ప్రారంభించాడు.

**"జననియు జనకుడు నెవ్వని**
**యను వర్తనమునఁ బ్రియంబునందుదురెద త**
**త్తనయుడు ధర్మము కీర్తియు**
**ననూనముగా పడయు, పొందు నక్షయ గతులన్"**

**-6 ప – పంచమాశ్వాసము – అరణ్య పర్వము**

''తన ప్రవర్తన వల్ల తల్లితండ్రులను ఏ పుత్రుడు సంతోష పరుస్తాడో, ఆ పుత్రుడు ధర్మ ప్రవర్తకుడిగా, కీర్తిమంతుడిగా అందరి మన్ననలను పొందుతాడు. పుణ్య లోకాలు అందుకోగలుగుతాడు. మాతా పితల సేవలో జన్మను తరింప చేసుకున్న ధర్మవ్యాధుడి చరిత్ర చెప్పాలంటే వేదవేదాంగ విదుడైన కౌశికుడనే బ్రాహ్మణోత్తముని గురించి కూడా చెప్పాలి. ధర్మవ్యాధుడు కౌశికుడికి సమస్త ధర్మ విషయాలను, ధర్మ సూక్ష్మాలను బోధించాడంటే ధర్మవ్యాధుడెంతటి మహనీయుడో అర్థం చేసుకోవాలి''.

''ఏమిటీ? వేద వేదాంగాలు, ధర్మశాస్త్రాలు అధ్యయనం చేసిన కౌశికుడు ధర్మవ్యాధుని వద్ద ధర్మం గురించి నేర్చుకున్నాడా? వింతగా ఉంది. కౌశికుడికంత అవసరమేం వచ్చింది మహాత్మా? అసలు ధర్మవ్యాధుడంత గొప్ప ధర్మవేత్తా?'' తెలుసుకోవాలనే కుతూహలం అంతకంతకు ఇనుమడిస్తోంది చెప్పండి'' అన్న మునులవైపు వాత్సల్యంతో చూసి మళ్ళీ చెప్పసాగాడు ఉగ్రశ్రవసుడు. ''అవును నాయనలారా! ధర్మవ్యాధుడంతటివాడే. విషయం వింటే మీకే తెలుస్తుంది. ఒక గ్రామంలో కౌశికుడనే బ్రాహ్మణుడు

నిత్య తపశ్శీలుడై, ధర్మాచరణతో, అధ్యయన కుశలుడై జీవిస్తుండేవాడు. ఒకనాడు ఒక చెట్టు క్రింద కూర్చుని వేదా లు పఠిస్తుండగా – అదే చెట్టు పైన ఉన్న ఒక కొంగ ఆ పండితుడిపై రెట్ట వేసింది. వేదపఠనంలో నిమగ్నుడైన కౌశికుడు తనపైన రెట్ట పడేసరికి కోపోద్రిక్తుడై ఎక్కడ నుంచి రెట్ట పడ్డదా అని పైకి తలెత్తి చూశాడు. అంతే కౌశికుడి కోప దృష్టి సోకి ప్రాణహీనమై నేలపై పడిపోయింది. తన ముంగిట చచ్చి పడిపోయిన కొంగను చూచిన కౌశికుడు బాధతో, పశ్చాత్తాప చిత్తంతో అశాంతికి లోనయినాడు.

**"అక్కట నా హృదయము కడు**
**నక్కటికము లేనిదయ్యె; ననిమిత్తమ యీ**
**కొక్కెర నిటు సేసితి; నా**
**కెక్కడి శాంతి? యని వికల హృదయుడగుచున్"**
**–8 ప – పంచమాశ్వాసము – అరణ్యపర్వము**

"అయ్యో! నా హృదయంలో దయ అన్నది లేశమైనా లేకపోయిందే? స్వాధ్యాయన పరుడనైన నేను, ధర్మశాస్త్ర విదుడనైన నేను, అకారణంగా ఈ కొంగ చావుకు కారకుడైనానే! కొంగ నాకేమి ద్రోహం చేసిందని దానిమీద నాకంత ఆగ్రహం కలిగింది? నా క్రోధానికే కదా, నా తపశ్శక్తి మూలంగానే గదా అది బలైంది! తపః ఫలాన్ని ఇందుకా వినియోగించవలసింది? తపశ్శక్తా క్షీణించింది. ఆ అల్పప్రాణా క్షణంలో నశించింది. ఇక నాకు శాంతి కలుగుతుందా? మునులకుండవలసింది శమదమాలు, శాంతి సహనాలు కాని కామక్రోధాలు కావే! తెలిసి తెలిసీ తప్పు త్రోవన పడ్డాను. నాకంత కోపం రావటం అవసరమా?" అని ఆలోచిస్తూ కౌశికుడు మిట్ట మధ్యాహ్నం వరకూ దుఃఖిస్తూనే ఉన్నాడు.

సమయాతీతమవుతుందన్న భావనతో మధ్యాహ్నవేళలో ఆచరించవలసిన దైవపూజాదులు యథాక్రమంగా నెరవేర్చి భిక్షాటనం కోసం కౌశికుడు గ్రామంలోని సద్బ్రాహ్మణుల గృహాల చెంతకు వెళ్ళి ఒక గృహం ముందు నిలబడి "తల్లీ! భిక్షాం దేహి" అని పెద్దగా అనడంతో ఆ గృహిణి భిక్షపెట్టడానికి ఒక పాత్రను పరిశుభ్రం చేస్తుండగా బయట నుండి ఆమె భర్త ఆకలితో తూలిపోతూ ఇంట్లోకి ప్రవేశించాడు. అది చూసిన ఆ సాధ్వీమణి భర్త కాళ్ళకు నీళ్ళందించి జాగు చేయకుండా ఆయనకు అభ్యంగన స్నానం చేయించింది. భక్త్యనురాగాలతో సంభాషిస్తూ రుచికరమైన భోజనం పెట్టి తృప్తి పరిచింది. ఆ తరువాత మెత్తటి పానుపునమరించి ఆయనను శయనింపచేసింది. తాంబూలాన్ని అందించి, పెనిమిటి పాదాలు ఒత్తి, ఆతనిని విశ్రమింపచేసింది. అప్పటికిగాని ఆ పతివ్రతామ తిలకానికి వాకిటిలో భిక్ష కోసం ఇంకా నిలబడే ఉన్న బ్రాహ్మణోత్తముడు గుర్తుకు రాలేదు. వెంటనే భిక్ష తీసుకుని వాకిట్లోకి వచ్చింది. ఆ గృహిణీమణిని చూసిన కౌశికుడి కళ్ళు క్రోధాతిశయం చేత మండిపడ్డాయి. సహజ ధోరణితో–

**"అడిగినయప్పుడ చెచ్చెర**
**కడపిన పోనవ్వ! యేను గడు దుర్మతి వై**
**పడతి! నను నిలిపి భిక్షం**
**బిడక కడు నవజ్ఞ సేసి తేల మదమునన్?"**
**-13 ప – పంచమాశ్వాసము - అరణ్యపర్వము**

"అమ్మా! నేను నీ వాకిట నిలచి 'భిక్షాందేహి' అని అడిగినప్పుడే వెంటనే వెళ్ళిపొమ్మని నీవు చెప్పి ఉంటే మరో ఇంటికి వెళ్ళిపోయేవాడిని గదా! నీవింకా భిక్ష ఇస్తావని అదేవిధంగా ఇప్పటివరకూ ఇక్కడే నిలబడి ఉన్నానే! దుష్టురాలివై భిక్ష ఇవ్వకుండా ఇంతసేపు నన్ను నిలబెట్టి అవమానపరిచావు. నీకింత గర్వం అవసరమా?" అంటూ కోపంతో కౌశికుడు పళ్ళు పటపట కొరికాడు.

దానికా గృహిణి భయపడలేదు సరికదా నిశ్చలంగా సమాధానం చెప్పింది. "బ్రాహ్మణోత్తమా! నీవన్నది నిజమే. కాని ఏం జరిగిందంటే నీవు భిక్షాందేహి అన్న సమయంలోనే నా భర్త క్షుధార్తితో వచ్చాడు. భక్తితో నా భర్తకు కావలసినవన్నీ సమకూరుస్తూ, ఆయనకు సపర్యలు చేస్తూ మీ సంగతి మరచిపోయినాను. అంతేకాని మీపట్ల తప్పు చేయాలనే దురుద్దేశం నాకు లేదు. కనుక నాయీ తప్పును తప్పుగా తలపకుండా శాంతచిత్తంతో నాపై ఆగ్రహించవద్దు. ఆ ఉత్తమురాలు కౌశికుని సహనం వహించి భిక్ష గ్రహించమని ఎంత చెప్పినా కౌశికుని మనసు దానికంగీకరించలేదు.

**"నీ మగడంత యెక్కుడె? మనీషులు భూసురు లింత తక్కువే?**
**కోమలి; యేల యిట్లు కడు క్రొవ్వునఁ గానవు లోకవంద్యులన్?**
**భూమి సురేంద్రులన్ దివిజపుంగవు డాదిగ భక్తికొల్చుచో**
**నేమిట నొక్కొ వారు కడు నెల్లిదమై రిటు నీకు నిచ్చటన్"**

–16 ప – పంచమాశ్వాసము – అరణ్య పర్వము

"చూడమ్మా! నీ భర్త అంత ఎక్కువా? మహా విద్వాంసులు, వేదవిదులు అయిన భూసురులు నీ ఉద్దేశంలో అంత తక్కువ వారా? భూలోకంలో దేవతలుగా పూజింపబడే బ్రాహ్మణులను త్రిలోకాధిపతి అయిన దేవేంద్రుడే మిక్కిలి భక్తితో కొలుస్తాడే! అటువంటిది లోకవంద్యులైన బ్రాహ్మణోత్తములను నీవు గుర్తించలేకపోయావు. నీ గర్వమే దానికి కారణమా? లేక నీవు గౌరవించడానికి మేము తగని వారమని చులకన చేశావా? మరొక్కమాట. నీకు తెలుసో! తెలియదో! విప్ర ముఖ్యుల మహిమ ఎంత గొప్పదనుకున్నావు? వారిని

అవమానిస్తే కలిగే ప్రతిఫలం లోకాన్నే దహించి వేస్తుంది. వారి కోపాగ్నికి పర్వతాలతో, అరణ్యాలతో, మహానదులతో నిండి ఉన్న భూమండలమంతా నామరూపాలు లేకుండా నశించిపోతుంది. వారి ప్రతీకార శక్తిని ఎవరూ ఆపలేరు. ఈమాత్రం కూడా నీవు తెలుసుకోలేదా?'' అని తన కోపాన్ని మాటల్లో వ్యక్తం చేశాడు కౌశికుడు. అతని కోపానికి భయపడక ఆ మహాసాధ్వి తన మనోభిప్రాయాన్ని అతని మాటలకు సమాధానం చెప్పసాగింది.

**"దేవతా సములు భూదేవతా వరులౌట**
**యేను దన్మాహాత్మ్య మెఱుగ నయ్య!**
**ఒక విప్రుడలిగి పయోనిధి జలముల**
**పేయముల్ గాగ శపింపడెట్లు;**
**దండక విషయంబు దగ్ధంబు సేయండె**
**అలుకమై నొక్క మహాద్విజుండు;**
**వాతాపి యను దైత్యవరు మ్రింగి యఱిగించు**
**కొనడె భూదేవుడొక్కరుడు కినిసి;**
**ధరణి మఱియును బెక్కు విధంబులందు**
**బ్రహ్మ విదులైన బ్రాహ్మణ ప్రభుల మహిమ**
**వినమె! యెఱిగి యెఱింగి సద్వినుత చరిత!**
**కొఱవిగొని వెఱ్ఱినే తల గోకికొనగ?"**

**-19 ప – పంచమాశ్వాసము – అరణ్యపర్వము**

''సజ్జనుల చేత స్తుతించబడే మహానుభావా! తపశ్చర్యలో ఉన్నతులైన బ్రాహ్మణోత్తములు దేవతా శ్రేష్ఠులతో సమానులైన వారని నాకు తెలియదా? వారి మహిమ ఎంత గొప్పదో తెలియని దానినా? ఒక విప్రుడు అలిగిన కారణం చేత సముద్ర జలాలు త్రాగడానికి యోగ్యమైనవి కాకుండా ఉండేటట్లు శపించలేదా? ఆ దూర్వాస మహర్షి మాహాత్మ్యం ఎవరికి తెలియదు? ఇంకో మహానుభావుడు ఆగ్రహించిన కారణం చేత 'దండక' ప్రదేశమంతా దగ్ధమైపోయి చివరకు అడవిగా మారిపోలేదా? ఆ శుక్రాచార్యుని తేజో విభవాన్ని మరవగలమా? ఆయన బ్రాహ్మణుడే గదా! భూదేవుడైన అగస్త్యుడు తన బ్రహ్మబలం చేత వాతాపి అనే రాక్షసుని మ్రింగి అరిగించుకోలేదా? ఆయన కోపానికి వాతాపి తట్టుకొని జీవించగలిగాడా? ఆయన బ్రాహ్మణుడు కాదా? అనేక సమయాలలో బ్రహ్మజ్ఞాన సంపన్నులైన బ్రాహ్మణోత్తములు చూపిన మహిమలను వినలేదా? తెలిసి తెలిసి కొరివితో తల గోకుకునే వెఱ్ఱిదాననా? కావాలని గర్వినై నిన్నెందుకు అవమాన పరుస్తానయ్యా? నాకు నా భర్తే దైవం. మనో వాక్కాయ కర్మలతో ఎల్లప్పుడూ నేను నా భర్త హితమే కోరుతాను. ఆయన కిష్టమైన పనిని మాత్రమే చేస్తాను.



ఇంతకు మించిన గొప్ప ధర్మం సతికి వేరొకటి ఉందని నాకనిపించటం లేదు.

మహాత్మా! నీకొక్క విషయం చెబుతాను. విను. నీవు అతి కోపిష్టివని నాకు తెలుసు. ఎలాగని అడుగుతావేమో? నీ కోపం వల్లనే కదా ఒక కొంగ మరణించింది. నా పాతివ్రత్య మహిమ వల్ల ఎక్కడో జరిగిన విషయం నా అంతరాత్మకు తెలిసింది. కోపాన్ని కలిగి ఉండటం ఎంతమాత్రం మంచిది కాదు. మనుషుల అంతరంగాలలో క్రోధం, మోహం అనే ఇద్దరు ఘోర శత్రువులున్నారు గదా! ఆ ఇద్దరూ విజృంభించి హృదయాన్ని మండిస్తుంటారు. ఆ రెండు లక్షణాలను అణచి వేయకపోతే బ్రాహ్మణులకు ఊరకే గౌరవం అనేది, గొప్పదనమనేది లభిస్తాయా? సత్ప్రవర్తనే బ్రాహ్మణుని సద్బ్రాహ్మణుని చేస్తుంది. క్రోధం కాదు.


**"ఎవ్వడు సత్యంబ యెప్పుడు పల్కు హిం**
**సా విదూరుడు గురుజన హితార్థి**
**యింద్రియంబుల నోర్చి యెల్ల వారల తన**
**యట్ల కాఁ జూచు ధర్మాభిరతుడు**
**కామంబు తగులండు కర్మంబు లాఱును**
**సముచిత సంప్రయోజ్యత నొనర్చు**
**నట్టి పుణ్యాత్ముని ననఘు బ్రాహ్మణుడని**
**అనిశంబు కీర్తింతు రమరవర్యు**
**లార్జవంబు శమము నధ్యయనంబును**
**బరమ దనము సువ్వె బ్రాహ్మణునకు**
**ధర్మగతికి నివియ తగు సాధనంబులు**
**వేదవిహిత ముఖ్య విధులు నివియ"**

**-24 ప – పంచమాశ్వాసము – అరణ్య పర్వము**

"ఎవడు ఎప్పుడూ సత్యాన్నే పలుకుతాడో; ఎవడు ఎప్పుడు ఎవరినీ బాధపెట్టకుండా ఉంటాడో; ఎవడు జననీ జనకులకు, గురువులకు మేలు తలపోస్తుంటాడో; ఎవడు ఇంద్రియ వ్యామోహాలను విసర్జించి మనగలుగుతాడో, ఎవడు సర్వ జీవులను తనవలె చూడగలుగుతాడో, ఎవడు కామానికి తగుల్కోడో, ఎవడు షట్కర్మలను యథావిధిగా ఆచరిస్తాడో, ఎవడు ధర్మగుణమందు ఎక్కువ ప్రీతి కలిగి ఉంటాడో – అటువంటి పుణ్యాత్మునే దేవతలు బ్రాహ్మణునిగా భావించి ఆరాధిస్తారు. బ్రాహ్మణులైన వారికి సద్గుణ సంపద, సత్ప్రవర్తన, ఇంద్రియ నిగ్రహము, వేదాధ్యయనము నిజమైన కథనాలు. ధర్మమార్గ ప్రవర్తనకు ఇవే మంచి సాధనాలు. బ్రాహ్మణుడికి వేదాలు విధించిన ముఖ్యమైన విధులు కూడా ఇవే. బ్రహ్మజ్ఞానం కలిగి ఉండటం బ్రాహ్మణుని మహానుభావుడిగా, నిగ్రహానుశక్తి సంపన్నుడిగా దర్శింప చేస్తుంది. విప్రవర్యా! ధర్మం అనేక విధాలుగా ఉంటుంది. స్థూల దృష్టికి ఒకరకంగా, సూక్ష్మ దృష్టికి మరొకరకంగా కనిపించే ధర్మ తత్త్వాన్ని తెలుసుకోవటం చాలా కష్టం. నీవు వేదాధ్యయన పరుడవే కాని ధర్మసూక్ష్మం తెలియనివాడివి. ధర్మాధర్మ జ్ఞానం పూర్తిగా తెలుసుకోవడానికి నీవు వెంటనే ఏమాత్రం ఆలస్యం చేయకుండా మిథిలా నగరానికి వెళ్ళు. అక్కడ ధర్మవ్యాధుడనే మహా జ్ఞాని నీకు సమస్త ధర్మ విషయాలను బోధపరుస్తాడు. ఏది ధర్మం, ఏది ధర్మ సూక్ష్మం అనేది కూడా అవగాహన అయ్యేటట్లు చెబుతాడు. నీ అనుమానాలనన్నిటినీ తీర్చగల ధర్మపరుడూ సత్యశీలి. కామక్రోధాదులను తన దరి చేరనివ్వనివాడు. మనుష్య ధర్మాన్ని నూటికి నూరుపాళ్ళు అవలంబించే ఆ కిరాత ముఖ్యుడు పితృభక్తి పరాయణుడు. వృత్తి ధర్మాచరణలో ఆదర్శప్రాయుడు. మహాత్మా! ఇక నా సంగతంటావా! స్త్రీలకు వివేకమనేది అంతగా ఉండదు కదా! అందుచేత నావల్ల జరిగిన అపరాధానికి ఆగ్రహించక నన్ను మన్నించమని వేడుకొంటున్నాను. నీవంటి ఉత్తముడికి శాంత సహనాలు అవశ్యాకాలు కదా!" అని అన్న ఆ పతివ్రతామణి మాటలు కౌశికునిపై ప్రభావం చూపాయి. అంతే అంతవరకు క్రోధంతో వివర్ణమయిన ఆతని ముఖం ప్రసన్నంగా మారిపోయింది. ఆమె పట్ల కౌశికునికి గౌరవం ఏర్పడింది.

**"నిన్ను దూఱతగదు నీకత**
**మున నా చిత్తము ప్రశాంతిఁ బొరసె, పురంధ్రీ**
**జన వినుత; పోయి వచ్చెద**
**ననుపమ శోభన సమృద్ధులయ్యెడు నీకున్"**

**-26 ప – పంచమాశ్వాసము – అరణ్యపర్వము**



"తల్లీ! నిన్ను నిందించకూడదు. నీ సద్గుణ సంపత్తి వల్ల, పతిభక్తి పరాయణత వల్ల, ధర్మ సూక్ష్మ పరిజ్ఞానం వల్ల నా మనస్సు ఎంతో ప్రశాంతతను పొందింది. సాధ్వీజనం చేత స్తుతింపబడే నీ ప్రవర్తన నాలో జ్ఞానాన్ని వృద్ధి చెందించింది. నీ ఆజ్ఞానుసారం నేను ఇప్పుడే మిథిలకు వెళ్ళి ఆ మహానుభావుణ్ణి కలుస్తాను. నీకు సకల శుభాలు కలుగు గాక!" అని చెప్పి కౌశికుడు – ధర్మవ్యాధుని చూడాలనే ఉత్కంఠతో బయలుదేరాడు. ఆ మహాపతివ్రతను దూషించినందుకు తనను తాను అపరాధునిగా తలపోస్తూ ఆ సుగుణవతి ఆత్మజ్ఞానానికి విస్తుపోతూ అనేక గ్రామాలను, నగరాలను అతిక్రమించి సాటి లేని శోభతో ఆహ్వానిస్తున్నట్లున్న మిథిలానగరాన్ని చేరుకొన్నాడు. రాజమార్గం ద్వారా నడుస్తూ, పురప్రజల నడిగి ధర్మవ్యాధుడుండే ప్రదేశంలో కాలుపెట్టాడు కౌశికుడు.

ధర్మవ్యాధుని గురించి, అతని ధర్మవేదిత్యాన్ని గురించి గొప్పగా విన్న కౌశికుడు అంగడిలో మాంసాన్ని చిన్న చిన్న ముక్కలుగా చేసి అమ్ముతున్న కిరాతుని చూశాడు. అతడే ధర్మవ్యాధుడా అని ఆశ్చర్యపోయాడు. ఆతడమ్ముతున్న మాంసాన్ని కొనుక్కోవటానికి ఊపిరాడకుండా వస్తున్న జన సమూహం చేత కొట్టంతా నిండిపోయింది. జుగుప్సను కలిగిస్తున్న ఆ అంగడిని సమీపించలేక కౌశికుడు ఒక ప్రక్కకు తొలగి, ఒదిగి నిలబడి ఆ సన్నివేశాన్ని చూడసాగాడు. ధర్మవ్యాధుడు కౌశికుని రాకను మనసులో గ్రహించినవాడై విప్రుడున్న చోటికి తానే వెళ్ళి నమస్కరించి, సగౌరవంగా ఆయన క్షేమ సమాచారాన్ని అడుగుతూ ఆదర వాక్కులు పలికాడు.

**"అనఘ! నితంబినీ తిలకమైన పతివ్రత నా తెఱంగు సె
ప్పినఁ జనుదెంచితీవు ననుఁ బ్రీతిఁ గనుంగొన; నీ మనోరథం
బును మదిలో నెఱుంగుదుఁ బ్రమోదము పొందితి; రమ్ము మద్గృహం
బున' కని పల్కి తోడుకొని పోయె నతండు మహీసురోత్తమున్"**

**-29 వ – పంచమాశ్వాసము – అరణ్యపర్వము**

"పాపరహితుడవైన ఓ విప్రోత్తమా; నా గురించి ఆ మహాపతివ్రత చెప్పిన విషయం విని, నన్ను చూడాలని, నాతో మాట్లాడాలని ప్రీతితో వచ్చావు. నీ మనసులో ఉన్న కోరిక ఏమిటో కూడా నా మనసుతో తెలుసుకున్నాను. నీ రాక వల్ల నాకు చాలా సంతోషం కలిగింది. మా గృహాన్ని పావనం చేయటానికి రండి స్వామీ!" అని గౌరవ సత్కారాలతో కౌశికుని ధర్మవ్యాధుడు తనతో పాటు తీసుకొని పోయాడు. తీసుకుపోయింది కిరాతుడు. అతని ఇంటికి వెళ్ళింది మహీసురోత్తముడు. పిలిచినవాడు ధర్మం గురించి, ధర్మ సూక్ష్మాన్ని గురించి వివరించి తెలిపేవాడు. వెంట వెళుతున్నవాడు జిజ్ఞాసతో వాటి స్వరూప స్వభావాల గురించి తెలుసుకోదలచినవాడు. కౌశికుడికి ఒకటిని మించిన మరొక ఆశ్చర్యం మనసును తొలిచివేస్తోంది. ఎక్కడో ఒక గ్రామంలో నివసిస్తున్న ఒక సాధ్వీమణి – మిథిలలో ఉన్న ఒక బోయవాడు ధర్మ సూక్ష్మాల గురించి శాస్త్రబద్ధంగా వివరిస్తాడని చెప్పిన విషయమే తనను ఆశ్చర్యానికి గురి చేస్తే – ఇపుడు ఆ బోయవాడు తనను పతివ్రత పంపిందని చెప్పడం రెండో ఆశ్చర్యానికి గురి చేసిందిన ఆలోచిస్తూ, ఆ ఇరువురి ఎఱుకకు, జ్ఞాన సంపదకు మనసులోనే అభినందిస్తూ ధర్మవ్యాధుని భవనానికి చేరి ఆతని చేత అతిథి సత్కారాలు పొంది కౌశికుడు కృతార్థుడైనాడు. ఆ ఇద్దరి ఇష్టాగోష్ఠి కొంత సమయం జరిగిన తరవాత తన మనసులోని భావాన్ని అదుపులో పెట్టుకోలేకపోయాడా విప్రోత్తముడు.

**"ధర్మవ్యాధా నాదొక సందేహం".**

**"నీవు కడు ధర్మవిదుడవు జీవహింస
జీవనంబుగ నడచుట శిష్టపథమె?
యకట! యీ ఘోర కర్మంబునకు మదీయ
బుద్ధి తద్దయు దుఃఖంబు పొందె నిపుడు"**

**-31 వ – పంచమాశ్వాసము – అరణ్యపర్వము**

"నీవు ధర్మ సూత్రాలన్నీ తెలిసినవాడివి. ప్రాణి హింస చేసి, తద్వారా ధనం సంపాదించి, ఆ ధనంతో జీవితాన్ని గడపటం మంచి పద్ధతంటావా? నీవు చేస్తున్న ఘోరమైన పనికి నా మనస్సు విపరీతంగా దుఃఖిస్తోంది" అని చింతాకులుడై కౌశికుడు పలికేటప్పటికి కిరాతుడు తన చర్యలో ఉన్న ధర్మ సూక్ష్మాన్ని వివరించాడు.

బ్రాహ్మణోత్తమా! ఒకవిధంగా నీవన్నది సరైనదే కావచ్చు. కాని స్వధర్మమైన వృత్తి ధర్మాన్ని పాటించడం ధర్మమే అవుతుంది గాని, అధర్మమెలా అవుతుంది? బ్రాహ్మణులకు తపస్సు, వేదాధ్యయనం, సత్యపాలన, శుభ్రతను పాటించడం, ఇంద్రియ నిగ్రహాన్ని కలిగి ఉండి బ్రహ్మచర్యాశ్రమాన్ని గడుపుతూ బ్రహ్మజ్ఞానాన్ని పొందటం అనేవి ధర్మాచరణకు నియమింపబడిన అంశాలు. క్షత్రియులు దండనీతి సూత్రాలను పాటిస్తూ సజ్జనులను సంరక్షిస్తూ దుర్జనులను శిక్షిస్తూ రాజ్యపాలనను ధర్మబద్ధంగా చేయటం – వారు నిర్వహించవలసిన నిత్యసూత్రాలు. వైశ్యులకు నియమితమైన ధర్మాలు – వ్యవసాయం చేయటం, పాడి గోవులను సమృద్ధిగా పోషించటం, వాణిజ్యాన్ని అభివృద్ధి పరచడం. శూద్రులకు చెప్పబడిన ధర్మం – శుశ్రూష. ఇవన్నీ వృత్తి ధర్మాలుగా, పరమ ధర్మాలుగా నిర్దేశింపబడి ఆయా జనుల చేత విధ్యుక్త ధర్మాలుగా ఆచరింపబడుతున్నాయి. అదేవిధంగా వ్యాధులమైన మాకు – మాంసం అమ్మి జీవించడమనేది వృత్తి ధర్మంగా నిర్ణయింపబడింది. మాంస విక్రయమనేది వంశక్రమానుగతమైన ఆచారం. ఇంకో విషయమేమిటంటే – మిథిలను పరిపాలిస్తున్న జనక మహారాజు రాజ ధర్మ నిర్వహణలో ఉద్దండుడు. అన్ని వర్ణాల (కులాల) స్వధర్మాలను సమగ్రంగా రక్షిస్తూ ఎవరైనా తప్పు చేస్తే వారిని శిక్షా స్మృతి ప్రకారం దండిస్తాడు. చివరికి తన కొడుకైనా సరే. ఆ కారణం చేత నా కులధర్మమైన మాంసం అమ్మడాన్ని వదలలేకున్నాను. పైగా మీవంటి మహాత్ములకు నా యీ స్వధర్మాచరణ పాపకర్మగా కనిపించవచ్చును. కాని నేను ఎప్పుడూ ఇంతవరకూ ఏ ప్రాణినీ చంపలేదు. వేరేవాళ్ళు జంతువులను చంపి తెచ్చిన మాంసాన్ని కొని సరైన వెలకు దానిని అమ్మి, ఆ ధనంతో మాత్రమే జీవిస్తున్నాను. ధర్మబద్ధంగా సంపాదిస్తున్న ధనం వల్ల నాకు మన శ్శాంతి లభిస్తున్నదే కాని ఏవిధమైన ఆర్తీ కలగటం లేదు.

విప్రవర్యా! నా జీవన విధానం చయెబుతాను విను.

**"వినయము విస్తరిల్ల గురు వృద్ధ జనాతిథి విప్రదేవతా
ర్చన లొనరింతు, సత్యమును శౌచమునేమఱ, నీగి మన్న నం
దనుపుదు భృత్య బంధుతతి, తాల్మి వహింపతు, ననూయ జేయ, నెం
దునుమది తృష్ణ సొన్న పరదోష కథావిముఖుండ నెప్పుడున్"**

**-34 వ – పంచమాశ్వాసము – అరణ్య పర్వము**

"వినయం నా జన్మ లక్షణం. గురువులను, వృద్ధులను, అతిథులను, బ్రాహ్మణులను, దేవతలను భక్తిపూర్వకంగా, నమ్రతతో పూజిస్తాను. సత్యాన్నే పాటిస్తాను. శుచి విషయంలో ఎన్నడూ ఏమఱిపాటు వహించను. సేవకులను, వారికి

కావలసిన వసతి సౌకర్యాలు కల్పిస్తూ కాపాడుతుంటాను. ఇక బంధు సమూహాన్ని వారు ఎప్పుడేది కావాలని కోరుకుంటే నిస్సంకోచంగా వారికది సమకూరుస్తూ వారి మన్ననలు పొందుతుంటాను. ఓర్పు కలిగి ఉండటం నాకెంతో ఇష్టమైన విషయం. ఎవరిపట్ల ఎప్పుడు గాని ఈర్ష్య చెందను. ఏ విషయంలో అయినా సరే నా మనస్సును తృష్ణతో (అంతులేని కోరికతో, ఇంకా ఇంకా కావాలని కోరుకుంటూ) నింపను. ఇతరుల దోషాలను విప్పి కథలు, కథలుగా చెప్పే ప్రసంగాలంటే నాకసహ్యం. అటువంటి విషయాలను అత్యుత్సాహంతో జనంలోకి తీసుకుపోయే దుష్టుల చెంతకు చేరను సరికదా, వారు నా వద్దకు వచ్చి చెప్పినా వాటిని పట్టించుకోను, వినను కూడా. నా దృష్టి అంతా నియమ నిష్ఠలతో కూడిన వ్రతాచరణ వైపే ఉంటుంది. ఎల్లప్పుడూ ఉపవాస దీక్షతో పరమాత్మనే ఆరాధిస్తుంటాను. కామానికి దూరంగా ఉంటాను. మోహమంటే గిట్టదు. ఏకపత్నీ వ్రతుడను. ఎవరైనా నన్ను నిందించినా, లేక పొగిడినా ఏదీ నాకు పట్టదు. పొగిడారు కదా అని ఆనందంతో పొంగిపోను. అయ్యో! తిట్టారే అని క్రుంగిపోను. నిందాస్తుతులు రెండూ నాకు సమానాలే. ఈవిధమైన ప్రవర్తన వల్లనే వ్యాధుల వంశంలో జన్మించినప్పటికీ, వారి లక్షణాలను అంటిపెట్టుకోకుండా, సచ్ఛీలంతో జీవిస్తున్నాను.

మహాత్మా! ఇదంతా నీవడగటం వల్ల చెప్పవలసి వచ్చింది. అంతేగాని, నా ఉన్నతిని చాటుకోవటానికి మాత్రం కాదు. అది నీవు గ్రహిస్తే చాలు. ఇక అసలు విషయానికి వద్దాం. నీవు ధర్మబోధ కోసం అంత దూరం నుండి ఇక్కడకు వచ్చావు. నీ సంకల్పం నెరవేర్చడం నా ధర్మం. ధర్మ విశేషాలను తెలియ జెపుతాను. శ్రద్ధాసక్తులతో ఆలకించి ఆచరించు.

**"తన కుల ధర్మము విడువక**
**మనుట పరమ ధర్మమండ్రు మాన్యులు; చిత్తం**
**బున గృప కలుగుట ముఖ్యపు**
**పని; సైరణ వలయు నఖిల భావములందున్"**

**-37 ప – పంచమాశ్వాసము – అరణ్యపర్వము**

శాస్త్రజ్ఞులు – తన కులానికి నిర్దేశింపబడిన ధర్మాన్ని (పద్ధతిని) వదిలి పెట్టకుండా ఆచరించటమే గొప్ప ధర్మమని చెబుతారు. మనసులో దయను కలిగి ఉండటం ప్రతివారూ చేయవలసిన ముఖ్యమైన పని. సర్వుల భావాలను సహించటం కర్తవ్యంగా భావించాలి. తనదే సదభిప్రాయం, ఇతరులది స్వీకరించవలసిన ఆలోచన కాదని అనుకోరాదు. **(సశేషం)**


# రచనలకు శ్రీ వేంకటేశం ఆహ్వానం



'శ్రీ వేంకటేశం' మాస పత్రికలో వివిధ రకాల శీర్షికలకు రచయితల నుండి, కవుల నుండి, పాఠకుల నుండి సరికొత్త రచనలను ఆహ్వానిస్తున్నాము. యాత్రానుభవాలు, భక్తుల అనుభూతులు, దైవసంబంధమైన వ్యాసాలు, కథలు, కవితలు, ఇతర అంశాలను పంపవచ్చు. అయితే ఆయా రచనలతో పాటు అందుకు సంబంధించిన ఫొటోలను వీలైనచో జత చేయండి. పరిశీలించిన తరువాత ప్రచురణకు యోగ్యమైన రచనలను ప్రచురిస్తాం.

రచనలు తిప్పిపంపగోరువారు తగు స్టాంపులు అతికించిన కవరు కూడా జతచేయాలి. ప్రచురించిన ప్రతి రచనకు తగు పారితోషికం ఉంటుంది. రచనలలో అవసరమైతే భాష, శైలిలో మార్పులు, చేర్పులు చేసుకునే స్వేచ్ఛ మా సంపాదక వర్గానికి ఉంటుందని తెలియజేయుచున్నాం.


ఈ పత్రిక ప్రపంచంలోని నలుమూలలలో గల తెలుగు ప్రజలు అంతర్జాలంలో (ఇంటర్‌నెట్) వీక్షించుదురు కావున రచయితలు తగు జాగ్రత్తలు వహించి మంచి రచనలు పంపగలరని మనవి.

మీరు పంపే ప్రతి రచన పాఠకులలో భక్తిభావం కలిగే విధంగా, వారి జీవితమునకు కొంతవరకైనా ఉపయోగకారిగా ఉండవలెనని మనవి. రచనలు తెలిసే విధంగా దస్తూరి స్పష్టంగా ఉండాలి. ఫోన్ నెంబర్ తప్పనిసరిగా వ్రాయాలి.

గమనిక: మీ రచనలను ఆన్‌లైన్‌లో పంపాలనుకునేవారు srivenkatesham@gmail.com మెయిల్ చేయండి.

రచనలు పంపవలసిన చిరునామా

**శ్రీ వేంకటేశం** ఆధ్యాత్మిక మాసపత్రిక,
(శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం)
ఇం.నెం. 1-1-53, వీధి నెం.1, హబ్సీగూడ, హైదరాబాద్-07.
ఫోన్: 040-27175050, సెల్: 9348212354
Email: srivenkatesham@gmail.com



ధారావాహికం



# రామాయణ రత్నాకరం

– రాళ్ళబండి శ్రీనివాసన్

గత సంచిక తరువాయి

నడవలే క ఆగారు అంతఃపుర స్త్రీలు. అక్కడనుంచే మనసులో రామునికి నమస్కరించారు. అశ్రుధారలు ఆపుకోలేకపోతున్నారు.

ఆగిపోయిన మహారాజు

చూశారు మంత్రులు. అంటున్నారు మహారాజుతో. ''ప్రభూ ప్రయాణమైపోతున్న వారిని సాగనంపటం మంచిదే. వాళ్ళు తిరిగి రావాలని కోరుకుంటే మాత్రం – ఎక్కువ దూరం వెంబడించరాదు''.

సద్గుణ సంపన్నులు అమాత్యులు. విన్నాడు దశరథుడు. విషణ్ణుడైనాడు. శరీరమంతా చెమట్లు పోశాయి. ఆగాడు. రథం వంక చూశాడు. అలాగే నిలుచున్నాడు. భార్యలందరూ ఆగారు. తదేకంగా రథం కేసి చూస్తున్నాడు.

రథం వాయువేగంతో పోతోంది. దుమ్ము రేగింది. ఆకాశాన్ని అంటింది. కన్నార్పలేదు దశరథుడు. చూస్తూనే ఉన్నాడు. చూస్తున్న కొద్దీ దుమ్ము రేగుతోంది. క్రమంగా తగ్గుముఖం పట్టింది. రథం కనపడలేదు. ఆర్తుడైనాడు. తెలివి తప్పాడు. కింద పడ్డాడు.

ఆయనకు కుడివైపున కౌసల్య ఉంది. ఎడమవైపున కైకేయి ఉంది. కౌసల్య వెంటనే భర్త భుజాలు పట్టుకుంది. కైక చూసింది. పట్టుకోబోయింది. వ్యథిత హృదయుడైనాడు దశరథుడు. అంటున్నాడు.

''దుష్టచారిణీ నన్ను తాకవద్దు. నీ ముఖం చూడను. నీవు నా భార్యవి కాదు. చుట్టానివీ కాదు. నీ బంధువులతో కూడా నాకు సంబంధం లేదు. వాళ్ళు నా పరిజనులు కాదు. నీవు అర్థపరురాలివి. రాజ్యకాంక్ష నీది. ధర్మాన్ని విడిచావు. నేను నిన్ను త్యజిస్తున్నాను. ఆనాడు అగ్నిసాక్షిగా నీ చెయ్యి పట్టుకున్నాను. అగ్నిహోత్రానికి ప్రదక్షిణం చేశాను. అలా నీకూ నాకూ ఇహ పర సంబంధాలు ఏర్పడ్డాయి. ఆ బంధాలు రెండూ తెంచుకుంటున్నాను. కైకా పాపిష్టిదానా నేను బతకను. భరతుడు రాజుగా ఇష్టపడితే – వాడు చేసే పిండోదకాలు నాకు చెందకుండా ఉండుగాక''.

రాలుతున్న ఆకు చెబుతుంది – ఈ జీవితం శాశ్వతం కాదని. వికసించిన పూవు చెబుతుంది – జీవించే ఒక్క రోజైనా ఆనందాన్ని అందించు అని. ఎండలో మగ్గి – వానకు

తడిసి – చలికి వణికిపోతున్న చెట్టు చెబుతుంది – ఇతరులకు సుఖాన్ని ఇవ్వాలని. ఆగిపోతున్న గుండె చప్పుడు చెబుతుంది – అంద రితో మంచి అనిపించుకో అని. మరి కైక లాంటి వాళ్ళు ఈనాడు ఎందరో ఉన్నారు. అందరి మనస్సుల్ని గాయ పరుస్తారు. వాళ్ళు దుఃఖిస్తుంటే వీళ్ళు ఆనందిస్తూ ఉంటారు.

అందుకే ఎవరు ఎపుడు ఎలా మారుతారో చెప్పలేం. విషం నింపుకున్న మనసుల మధ్య – కఠిన పాషాణంలా మారే మనుషుల మధ్య ఉంటున్నాం మనం. ఎవరితో ఎంతలో ఉండాలో – అంతలో ఉండటానికి ప్రయత్నించాలి. ఒకరిని నమ్మినామంటే వెంటనే అనుమానించాల్సిన కాలమిది. అందరూ మనవాళ్ళే అనుకోవడం తప్పు. నేరం.

దశరథుని శరీరానికి, బట్టలకు అంటుకున్న దుమ్ము దులిపింది కౌసల్య. లేవనెత్తింది. ఆమెని పట్టుకున్నాడతడు. ఆమెతోనే నడుస్తున్నాడు యాంత్రికంగా. అతని మనసులో రాముని తాపస వేషం పరుగులిడుతోంది. బుద్ధిపూర్వకంగా బ్రాహ్మణుని హత్య చేసిన వాడిలా బాధపడుతున్నాడు. మండుతున్న నిప్పు కణాల్ని చేత్తో పట్టుకున్న వాడిలా పరితపిస్తున్నాడు. మాటి మాటికి వెనక్కి తిరిగి చూస్తున్నాడు. రాహువు మింగిన సూర్యునిలా అయిపోయాడు.


రాముడు పొలిమేర దాటాడు – అందింది వార్త.

వినింది కౌసల్య. స్పృహ కోల్పోయింది. పడిపోతున్న ఆమెని దాసీలు పట్టుకున్నారు. నెమ్మదిగా అంతఃపురానికి తీసుకెళ్ళారు.

పరిజనులు మహారాజుని నడిపించారు. విలపిస్తున్నాడతడు. అడవిలో రాముడెలా ఉంటాడో – ఏం తింటాడో – ఎక్కడ పడుకుంటాడో – ఆలోచనలతో సతమతమైపోతున్నాడు. శరీరం వణికిపోతోంది.

రాముడు లేకుండా బతకలేడు తను. పుట్టుక తొలి మెట్టు. చావు మలి మెట్టు. బతకటం గొప్ప కాదు. చావటం గొప్ప. మంచాన పడి – నలుగురిలో ఛీ ఛా అనిపించుకుని పోవటం దౌర్భాగ్యం. అలాంటి చావు రాకూడదు తనకు. అనాయాసంగా పోవాలి. అలా ఉన్నాయి అతని ఆలోచన్లు. రామునితో తనకు ఎడబాటు కల్పించిన కైకేయి స్మృతిపథంలో మెదిలింది. ''కైకా ఈ రాజ్యం నీదే. విధవవై పడి ఉండు....'' అలా ఇంకా తిడుతూనే ఉన్నాడు కైకేయిని.

సేవకులు దశరథుని చుట్టూ ఉన్నారు. మృతస్నాతుడైనవాడు అపవిత్ర గృహంలో ప్రవేశించినట్లు – అయోధ్యలో అడుగుపెట్టాడు మహారాజు. రాజవీధుల్లో నడుస్తున్నాడు. వీధులు కూడళ్ళు గృహాలు శూన్యంగా



ఉన్నాయి. దేవాలయాలు అంగళ్ళు మూసివేయబడి ఉన్నాయి. జనం పలచగా ఉన్నారు. ఆ ఉన్నవారు దుఃఖార్తులు. దుర్బలులు. వృద్ధులు. ఒంట్లో సత్తువ ఉన్నవారందరూ రాముని రథం వెంట పోయారు. దశరథుడు సేవకుల వైపు చూశాడు. ఆ చూపుల్లో దైన్యం నిండి ఉంది.

''రాముని మాత కౌసల్య మందిరానికి నన్ను చేర్చండి. ఇంకో చోటికి వద్దు. నాకు మనశ్శాంతి కావాలి'' – అది మహారాజు మాట. అతని స్వరం గద్గదమై ఉంది.

ఎంతవాడైనా తన భుజాలపై తల వాల్చలేడు. మనశ్శాంతిని పొందలేడు. తనకు తానై ఓదార్చుకోలేడు. అందుకు ఒక ఆసరా కావాలి. ఒక చేయూత కావాలి. ఒక తోడు కావాలి. ఒక ఊరడింపు కావాలి. ఎంత సంపాదించినా, ఎన్ని స్థిర చరాస్తులున్నా మనిషికి ప్రశాంతత లేకపోతే జీవితం వ్యర్థం.

దశరథుని ఇష్ట ప్రకారం అతణ్ణి కౌసల్య గృహానికి తీసుకెళ్ళారు ద్వార దర్శినులు.

### కౌసల్య గృహం

పడకపై ఉన్నాడు మహారాజు. సీతారామ లక్ష్మణులు లేని భవనం అది. చంద్రుడు నక్షత్రాలు లేని ఆకాశంలా తోచింది.

'రామా – రామా' బిగ్గరగా అరిచాడు.

పధ్నాలుగేళ్ళు ఆగాలి. అంతవరకు బతికి ఉండాలి. రాముడు వచ్చేవరకు బతకగలనా? ఆ భాగ్యం నాకు లేదు.

రాముణ్ణి దర్శించేవాళ్ళు — వాణ్ణి ఆలింగనం చేసుకునే వాళ్ళు ఎంత పుణ్యాత్ములో — ఎంత అదృష్టవంతులో. నాకు ఆ యోగం లేదు. అలా దశరథుని ఆలోచనలు సాగుతున్నాయి. చీకటి పడింది. అతని మనసులో కూడా చీకట్లు కమ్ముకున్నాయి.

అది అర్థరాత్రి. మేల్కొన్నాడు మహారాజు. అది కాళరాత్రిలా భయంకరంగా ఉన్నట్లుంది. అంటున్నాడు కౌసల్యతో.

**''రామం మే అనుగతా దృష్టిః అద్యాపి న నివర్తతే**

**నత్వాం పశ్యామి కౌసల్యే సాధు మాం పాణినా స్పృశ''**

''ఓ సాధ్వీ కౌసల్యా నా చూపు రామునితోనే పోయింది. నీవు నాకు కనిపించటం లేదు. నీ చేత్తో నన్ను ఒకసారి తాకు. నీవు రాముని కన్నతల్లివి. నన్ను తాకితే నా తాపం పోతుంది. నాకు శాంతి దక్కుతుంది'' — అది దశరథుని హృదయ పరితాపం.

**కౌసల్యా విలాపం**

కౌసల్య శోకార్త అయింది. పుత్ర శోకంతో కుమిలిపోతున్నడు మహారాజు. అంటోంది

''పాము విషం చిమ్మినట్లు — కైక కుటిలత్వాన్ని రాముని మీద వెళ్ళగక్కింది. ఇపుడా కైక కుబుసం విడిచిన పాములా ఉంది. హాయిగా స్వేచ్ఛగా తిరుగుతోంది. ఇక నన్ను వేధిస్తుంది. ఆమె చర్యలు తల్చుకుంటే భయం వేస్తోంది నాకు''.

''నాథా కైక భరతునికి రాజ్యం కోరిది. మీరు ఇస్తానన్నారు. నా కొడుకుని అడవి పాలు చేసింది ఎందుకు? నీకు అన్నం లేదు. నీళ్ళు లేవు. నా కొడుక్కి (భరతునికి) దాసుడై పడి వుండని రాముణ్ణి ఆదేశించలేకపోయింది. అలా కోరి ఉంటే నా రాముడు ఇక్కడే ఉండేవాడు. బిచ్చమెత్తుకుని దొరికింది తినేవాడు. నా కళ్ళ ముందు తిరుగాడేవాడు. హవిర్భాగాలను దేవతలకు కాకుండా రాక్షసులకు అందించినట్లు — రాజ్యం భరతునికి ఇచ్చావు. నా రాముణ్ణి పదభ్రష్టుణ్ణి చేశావు. సీతా లక్ష్మణులతో రాముడు గజరాజులా — రాక్షస నివాసమైన అడవి చేరి ఉంటాడు. ఆ ముగ్గురూ సుఖభోగాలనుభవించాల్సిన వయస్సులో ఉన్నారు. ఆ అడవిలో ఎక్కడ పడుకుంటారు? కందమూలాలు తింటూ ఎలా బతుకుతారు? పద్నాలుగేళ్ళు ఎపుడు పూర్తవుతాయి? అయోధ్యలో వేడుకలు ఎపుడు జరుగుతాయి? గోవు వెంట వృషభంలా సీత వెంబడి రాముడు ఎపుడు వస్తాడు? రాజవీధుల్లో వస్తుంటే జనులెపుడు పేలాలు చల్లుతారు? ''

''రాజా పూర్వజన్మలో పాలకోసం వచ్చిన దూడల్ని తల్లుల్నించి ఎడబాపి ఉంటాను. ఆవు మురిపెంగా చూసుకునే దూడను సింహం ఎత్తుకుపోయిందిట. అలా బలవంతంగా నా కొడుకును కైక దూరం చేసింది''.

''సర్వశాస్త్ర విశారదుడు, సకల కళ్యాణ గుణసంపన్నుడు, ఆజానుబాహుడు నా రాముడు. వాణ్ణి వదిలిపెట్టి నేను బతకలేను. వేసవిలో మండుటెండలకు భూమి వేడెక్కిపోతుంది. అలా పుత్రశోకాగ్ని నన్ను తీవ్రంగా తపింప చేస్తోంది.

**సుమిత్ర ఓదార్పు**

కౌసల్య విలపిస్తోంది. సుమిత్ర హృదయం ఆర్ద్రమైంది. సంతోషంగా తన కొడుకుని అడవులకు పంపిన పరమ ధార్మికురాలు ఆమె. కౌసల్యని ఊరడిస్తోంది ఇలా.

''పూజ్యురాలా నీ కొడుకు ఐహిక సుఖాలకు ఆశపడనివాడు. శిష్టాచారుడు. తండ్రిని సత్యసంధుణ్ణి చేయాలనుకున్నాడు. అందుకే రాజ్యం త్యజించాడు. అడవులకెళ్ళాడు. రాముడంటే ఎవరనుకున్నావు. మహా బలవంతుడు. శౌర్యవంతుడు. పరాక్రమవంతుడు. దయామయుడు. సర్వ భూత హితుడు. పురుషోత్తముడు. అలాంటి మహాత్ముని కోసం ఏడ్వరాదు. రాముని కోసం నీవూ — లక్ష్మణుని కోసం నేనూ దుఃఖించరాదు. రామ సేవాభాగ్యం నా కొడుక్కి దక్కటం ఒక విశేష లాభం. ఇక వైదేహి అంటావా — పతిసేవా పరాయణురాలు. వనవాస కష్టనష్టాలు తెలిసి కూడా ఆ పతివ్రత రాముణ్ణి అనుసరించింది. సత్య ధర్మాలే రామునికి సహజ సంపదలు. అవే ఆ ధర్మాత్మునికి కీర్తి పతాకాలు. అవే దివ్య కాంతులతో లోక వ్యాప్తమైనాయి''.

''వాయువు రాముణ్ణి సేవిస్తూ ఉంటుంది. ఆయా కాలాలకు తగ్గట్టు చల్లగా వీస్తుంది. రాత్రిపూట చంద్రుడు చల్లని వెన్నెల కురిపిస్తాడు. రాముడు దివ్యాస్త్ర సంపన్నుడు. వాడిని ఎదిరించి ఎవ్వరూ నిలవజాలరు. వాడికి వనవాసం స్వగృహ వాసమే. అడవిలో నిర్భయంగా తిరుగుతాడు. సూర్యునికి మించిన తేజస్వి వాడు. వాడి ముందు అగ్ని తాళజాలదు. సర్వ లోకాలకు ప్రభువు వాడు. సర్వ సంపదలకు పెన్నిధి వాడు. కీర్తికే కాంతి నిచ్చేవాడు. సర్వజీవకోటికి భూమి ఆధారమైతే — ఆ భూమికి ఆధారం వాడు. వనవాసం ముగించి తిరిగి వస్తాడు. రాజు అవుతాడు. ఈ భూమండలాన్ని శాసిస్తాడు. వాడు సామాన్యుడు కాడు. పురుషోత్తముడు. భూదేవి సీతాదేవి విజయలక్ష్మి — ముగ్గురితో పట్టాభిషిక్తుడు కాగలడు. అంతటి రాముణ్ణి కన్నతల్లివి నీవు. కుంగిపోతే ఎలా? దుఃఖిస్తే ఎలా? నిబ్బరం తెచ్చుకో. ధైర్యంగా ఉండు'' — అలా అనేక విధాల ఓదార్చింది సుమిత్ర.

రాముడు సాక్షాత్ నారాయణుడని గ్రహించిన జ్ఞాని

సుమిత్ర.

భీషాస్మాత్ అగ్నిశ్చ ఇంద్రశ్చ మృత్యుర్ధావతి పంచమ ఇతి తైత్తిరీయ ఉపనిషత్తు మంత్రం అది.

భగవంతునికి భయపడి వాయువు వీస్తుంది. సూర్యుడు ఉదయిస్తాడు. అగ్ని మండుతుంది. ఇంద్రుడు తన విధులు నిర్వహిస్తాడు. ఐదవదైన మృత్యువు ఎపుడు రావాలో అపుడే వస్తుంది. పరా అపరా ప్రకృతులకు అధిపతి పరమాత్మ అంటుంది భగవద్గీత. నారాయణుడే నరునిగా అవతరించాడని గ్రహించిన పరమ తాత్త్వికురాలు సుమిత్ర. కౌసల్యను ఓదార్చటంలో ఆ విషయం స్పష్టమవుతోంది.

**రాముడు లేని అయోధ్య**


సీతారామ లక్ష్మణులు రథంలో వెళ్ళిపోయారు. అంతఃపుర స్త్రీలు ఆర్తనాదాలు చేశారు. కౌసల్యా దశరథులు రథం వెంట పడ్డారు. నిరాశతో తిరిగి వచ్చారు. అయోధ్యా వాసుల నిత్యకృత్యాలు స్తంభించాయి. హోమ కార్యాలు ఆగిపోయాయి. గృహాల్లో ఒక్క పొయ్యి కూడా వెలగలేదు. వంట చేయాలని తినాలని ఎవరికి తోచలేదు. పౌరులు తమ పనులకు పోలేదు. పశువులకి దిక్కు తోచలేదు. బొమ్మల్లా నిల్చున్నాయి. ఏనుగులు తిండి మానేశాయి. ఆవులు దూడలకు పాలివ్వలేదు. తొలి చూలి బిడ్డల్ని తల్లులు చేరదియ్యలేదు. కౌసల్యా దశరథులపై కోపించారు. కొడుకుకు అమ్మా నాన్నల మీద ప్రేమానురాగాలు అంతరించాయి.

ఆకాశంలో మబ్బులు కమ్మాయి. నగర వాసుల దుఃఖం చూడలేక సూర్యుడు ఎపుడో అస్తమించాడు. హోరుగాలులు వీస్తున్నాయి. చంద్రుని వెన్నెల మసకబారింది. నక్షత్రాలు గుడ్డిగా వెలుగుతున్నాయి. గృహాలు తేజస్సు కోల్పోయాయి. భార్యాభర్తల అన్యోన్య సంభాషణలు లేవు. సోదరుల్లో అనుబంధాలు ఆగిపోయాయి. అందరూ రామధ్యాసలో నిమగ్నమై ఉన్నారు. రాముని స్నేహితుల్లో కొందరు మతులు పోయినవారిలా ఉన్నారు. కొందరు మంచమెక్కారు.

**రాముని హితవు**

అక్కడ రథం వెంట పరిగెడుతున్నారు. వారి బాధ చూడలేకపోయాడు రాముడు. రథాన్ని ఆపమన్నాడు. ఆగింది రథం. చుట్టూ నిలుచున్నారు పౌరులు. దయాదృష్టితో చూశాడు రాముడు. అంటున్నాడు.

"మీరందరూ నామీద ఇంత ప్రేమ చూపుతున్నారు. సంతోషం. అంతకు రెట్టింపుగా భరతుని మీద చూపండి. అపుడు నేను ఎక్కువగా సంతోషిస్తాను. భరతుడు మన రాజు అన్నాడు మహారాజు. మనం ఆ మాటని గౌరవించాలి. ఆ పితృ వాక్యం కోసమే నేను ఇలా బయలుదేరాను. మీరందరూ



రాజాజ్ఞను పాటించండి. వెనక్కి వెళ్ళండి".


సుమంత్రుడు రథాన్ని నెమ్మదిగా పోనిచ్చాడు. నగర వాసులు వెనక్కి పోలేదు. రథం వెంట నడిచారు. వాళ్ళలో జ్ఞాన సంపన్నులున్నారు. తపస్సంపన్నులు, బ్రాహ్మణోత్తములున్నారు. పామరులున్నారు. వృద్ధులున్నారు. బాలురున్నారు. చూశాడు రాముడు. రథం దిగాడు. సీతాలక్ష్మణులూ దిగారు. బ్రాహ్మణులు పరితపిస్తున్నారు. అంటున్నారు

"రామా మేం నిత్యాగ్నిహోత్రులం. అరణి కట్టెలు మా భుజాల మీదున్నాయి చూడు. నీవెంట వస్తాం. వెనక్కి వెళ్ళం. ఇంతవరకు వేదాధ్యయనం, అధ్యాపనం మీదున్న మా మనసులు నీతోనే మా వనవాసం అంటున్నాయి. మేం అడవికి వస్తే — మా భార్యల గతేమిటంటావా — వారు పతివ్రతలు. పాతివ్రత్యమే వారికి భద్ర కవచం. నిన్ను అనుసరించటమే మా పరమ ధర్మం. అది సరికాదంటావా — నీవు మాతో అయోధ్యకు రా. ఇది మా ప్రార్థన".

నడక ఆగలేదు. నడుస్తూనే తమ దీనాలాపనలు వినిపించారు. విన్నాడు రాముడు. సమాధానం చెప్పలేదు. కౌసల్యా దశరథులు రాముణ్ణి ఆపలేకపోయారు. బ్రాహ్మణోత్తములు ఆపలేకపోయారు. వయో వృద్ధులు ఆపలేకపోయారు. నేను ఆపుతున్నాను చూడు అన్నట్లు తమసానది అడ్డు వచ్చింది.

అందరూ నదీతీరం చేరారు. రథం దిగాడు సుమంత్రుడు. గుర్రాలు విప్పాడు. అలసట తీరేటట్లు అవి గడ్డిలో అటూ ఇటూ పొర్లాడాయి. తర్వాత వాటిని నదికి తీసుకెళ్ళాడు. ఒళ్ళంతా బాగా కడిగాడు. నీళ్ళు తాగించాడు. మేతకోసం పచ్చిక మీదకి వదిలాడు.

**(సశేషం)**



# కనకదుర్గాదేవి బ్రహ్మోత్సవములు

**– చింతలపాటి శివశంకర శాస్త్రి**

**శ్లో|| విద్యుద్ధామ సమప్రభాం మృగపతి స్కంద స్థితాం భీషణాం**
**కన్యాభి; కరవాల ఖేతు విలసత్ హస్తాభిరా సేవితాం**
**హస్తైశ్చక్ర గదాసిఖేట విశిఖాం శ్చాపం గుణాంతర్జనీం**
**బిభ్రాణా మసలాత్మికాం శశిధరాం దుర్గాం త్రినేత్రాం భజే''**

మెరుపు తీగ వంటి కాంతి గలది, సింహ స్కంధాన్ని అధిరోహించినది, భయం గొలిపే ఆకారం గలది, కత్తి, డాలు చేపట్టిన కరములతో, చక్రము, గద, ఖడ్గము, శరము, ధనుస్సు, గుణము, తర్జనా ముద్రలతో విరాజిల్లే త్రినేత్రి అయిన దుర్గాదేవిని ప్రార్థిస్తున్నాను.

చిత్తా నక్షత్రముతో కూడిన పూర్ణిమ గల మాసాన్ని చైత్ర మాసమని అంటారు. ప్రకృతి శోభ పరిపూర్ణంగా ప్రకాశించే మాసం చైత్రమాసం. చలి తొలగిపోయి, సమశీతోష్ణ కాలమైన వసంత ఋతువు చైత్రంతో ఆరంభమవుతుంది. జగత్తంతా చైతన్యవంతమయ్యే కాలమిది. ఈ మాసానికే మధుమాసమని పేరు.

''వసతి సుఖమస్మిన్నితి వసంతః'' అని ఆర్యోక్తి. పచ్చదనం


తగ్గి వెల వెల బోయిన ప్రకృతి నవనవోన్మేష శోభలతో అలరారడం చైత్రమాసంతో మొదలవుతుంది. ఆమని ఆగమనం అడవికి ఎంత సంబరమో, అడవితో ఆలింగనం ఆమనికి అంత సంతోషకరం. వసంతం ప్రాకృతిక వికాసానికి సంకేతం. లోకం ఓ కోకిల కోసం ఎంతగా ఎదురు చూస్తుందో, కోకిల కూడా లోకం కోసం అంతగా ఆరాట పడుతుంది. అది ప్రకృతి సహజం.

చైత్రమాసంలోని తొలి తొమ్మిది రోజులూ దుర్గాపూజ చేయడం ఆచారం. వీటినే వసంత నవరాత్రులు అని అంటారు. గోకులంలో శ్రీకృష్ణుడు చైత్రమాసంలోనే దుర్గాదేవిని అర్చించాడని బ్రహ్మ వైవర్త పురాణం చెబుతోంది. ఆ అర్చనకు ప్రతీకగా చైత్ర మాసంలో విజయవాడలోని కనకదుర్గాదేవికి బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. బ్రహ్మ+ ఉత్సవాలు = బ్రహ్మోత్సవాలు. చతుర్ముఖ బ్రహ్మ చేత ఆరంభింపబడిన ఉత్సవాలని అర్థము. ''బ్రహ్మణః ఉత్సవః అథవా బ్రహ్మణే క్రియమాణః ఉత్సవః బ్రహ్మోత్సవః'' అనేది మరియొక నిర్వచనం. న భూతో న భవిష్యతిగా నిర్వహించే ఉత్సవాలు కాబట్టి ఇవి బ్రహ్మోత్సవాలు. సంతోషాన్ని, ఉల్లాసాన్ని కలిగించేవి ఉత్సవాలు. ఆలయాలలో ఉత్సవాలు అనేక రకాలుగా నిర్వహించుచున్నప్పటికిని, అన్ని ఉత్సవాలు కంటే బ్రహ్మోత్సవాలు రమణీయమైనవి, కమనీయమైనవి. మరియు మహత్తరమైనవి.

ఈ చైత్ర మాసంలో జగన్మాతను ఆరాధించాలి. జగత్+మాత = జగన్మాత. అనగా చరాచర జగత్తంతటికీ తల్లి. ఈ తల్లి అష్ట భుజాలతో అష్టదిక్కులా వ్యాపించిన విశ్వ చైతన్యమూర్తి ఆదిపరాశక్తి. కోరిన కోరికలు తీర్చే దయ గల చూపుల శక్తి స్వరూపిణి. సర్వత్రా వ్యాపించి యున్న పరమాత్ముని శక్తి స్వరూపిణిగా భావించి, అర్చించి పూజించే వరాల తల్లి. అమృతవల్లి. సర్వ జగత్తుకూ కల్పవల్లి. ఆ తల్లి లీలలు అనంతం. దేవీతత్వమును ప్రమాణీకరించడం అంటే ఆకాశంలో నక్షత్రాల సంఖ్యను లెక్కించడమే.

నగరాజ పుత్రి. సుకుమార సౌందర్య లహరి. మల్లేశ్వర హృదయ సామ్రాజ్య పట్టమహిషి అయిన కనకదుర్గాదేవి కరుణాంతరంగ హృదయవాసిని అయి గావుట చేత వసంత నవరాత్రుల శుభదినాలలో దుర్గాపూజ చేయడం ఆచారంగా వస్తోంది. గోలోకంలో చైత్రమాసంలో అర్చించారనడానికి ప్రతీకగా కనకదుర్గాదేవికి విజయవాడలో బ్రహ్మోత్సవాలు జరుగుతాయి.

''దుర్గం గమయతాతీ దుర్గః'' చిత్తభ్రమ యనే దుర్గమమైన స్థితిని దాటించే శక్తి గల దేవి దుర్గ. 'దుర్గ' అంటే ఆశ్రయశక్తి



అని అర్థము. వేదం దుర్గను తారిణీ శక్తిగా పేర్కొంది. అనగా దాటించే శక్తి అని అర్థము. కష్టాల కడలి నుండి తన భక్తులను దాటించి, ఒడ్డుకు చేర్చే నావగా వేదం పేర్కొంది. మాటకు, మనసుకూ అందని పరతత్వమే దుర్గ. ప్రకృతి స్వరూపిణి అయిన ఆ తల్లిని ఆరాధించి, వినమ్రతతో జరుపుకునే ఉత్సవాలు బ్రహ్మోత్సవాలు.

చైత్రమాసపు ప్రత్యేక ఉత్సవాలు ఉగాదితో ప్రారంభమవుతాయి. నవరాత్రి ఉత్సవాలు అను పేరు విన్నంతనే నూతనోత్తేజంతో మనసు ముప్పిరి గొంటుంది. భక్తి సమ్మిళితమైన ఉత్సాహ వాతావరణం ఈ తొమ్మిది రోజులు ఉంటుంది. ఓ అద్భుత దివ్యానుభూతికి నిదర్శనమై నిలుస్తుంది.

ఉగాది పర్వదినాన తెల్లవారు ఝామున విజయవాడ కనకదుర్గాదేవిని స్వర్ణ కవచంతో అలంకరిస్తారు. అష్టభుజాలతో, నక్షత్రాల కంటే అధికమన కాంతి కలిగిన ముక్కుపుడక ధరించి, పసిడి ఛాయ కలిగిన మోముతో అమ్మ దర్శనమిస్తుంది. సింహ వాహనాన్ని అధిష్టించి, శంఖం, చక్రం, గద, శూలం, పాశం, మహాఖడ్గం, పరిఘ అనే ఆయుధాలు ధరించి యుంటుంది. సకల శత్రుబాధలు

నివారిస్తుంది. ఆకర్షణ శక్తితో కోటి సూర్యచంద్ర ప్రభ కాంతితో విరాజిల్లుతూ దర్శనమిస్తుంది. బ్రాహ్మీ ముహూర్తంలో ప్రత్యేక అభిషేకం జరుగుతుంది. అమ్మవారి మూల విగ్రహానికి పంచామృతాలతో శుద్ధోదకంతో, ఉష్ణోదకంతో, వివిధ పరిమళ సుగంధ ద్రవ్యాలతో స్నపనాభిషేకం నిర్వహిస్తారు. ఆ తరువాత అమ్మవారి మూల విగ్రహానికి ముఖాలంకారాన్ని చేస్తారు. యథావిధిగా ప్రాతఃకాలార్చన చేసి, బాల భోగాన్ని నివేదిస్తారు. స్నపనాభిషేకంలో పాల్గొన్న వారందరికీ అమ్మవారికి పూసిన గంధాన్ని, అభిషేకించిన తీర్థాన్ని ప్రసాదంగా ఇస్తారు. కలశ స్థాపనతో వసంత నవరాత్రులు ప్రారంభమవుతాయి. హోమాలు, వేద పారాయణాలు జరుగుతాయి. ప్రముఖ జ్యోతిష్య పండితుల చేత నూతన సంవత్సర పంచాంగ శ్రవణం, పండిత సత్కారాలు జరుపబడుతాయి.

అనంతరం సాయంత్రం నాలుగు గంటలకి అమ్మవారి ఉత్సవ విగ్రమాన్ని వెండి రథంలో ఉంచి నగరంలో ఊరేగిస్తారు. దీనినే నగరోత్సవంగా పేర్కొంటారు. వసంత నవరాత్రుల ఉత్సవాల సందర్భంగా పాడ్యమి నుంచి దశమి వరకు ప్రతిరోజు ఉదయం, సాయంత్రం మండప పూజలు, హోమాలు, పారాయణాలు జరుగుతూ ఉంటాయి.

ఇంద్రకీలాద్రి దుర్గా మల్లేశ్వరస్వామి వారి దేవస్థానంలో వార్షిక కళ్యాణ బ్రహ్మోత్సవాలలో భాగంగా చైత్రపూర్ణిమ నాడు శివకళ్యాణం నిర్వహిస్తారు. ఈ ఉత్సవాలు పంచాహ్నిక దీక్షతో జరుగుతాయి. హైందవ పూజా ఉత్సవాల్లో కళ్యాణోత్సవాలు ప్రధానాలు. అనేక ఆలయాలలో నిత్య కళ్యాణాలు, ప్రత్యేక పర్వాలలో కళ్యాణోత్సవాలు పరిపాటి. కళ్యాణోత్సవాలను నిర్వహించడమే కాకుండా, ప్రాచీన గ్రంథాలలో ఉన్న దేవతా కళ్యాణ ఘట్టాలను పారాయణ చేసి కూడా అభీష్ట సిద్ధులను సులభంగా పొందుతున్నవారు ఎందరో. పైపైన చూస్తే ఇది ఏదో మత విశ్వాస సంబంధ క్రియగా కనిపించవచ్చు. కానీ, వీటి వెనుక కొన్ని మంత్ర, యజ్ఞ, యోగ సంకేతాలున్నాయని లోతైనపరిశీలనాదృష్టికిస్పష్టమవుతుంది.శివపురాణంలోనూ కుమార సంభవంలోనూ, కొన్ని ఇతర పురాణాల్లోనూ శివపార్వతుల కళ్యాణ గాథ ఉంది. దీని పారాయణం వలన, క్రియారూపంగా ఆచరించడం వలన కూడా గ్రహ దోషాలు తొలగి లోకం సుభిక్షంగా విరాజిల్లుతుంది. కళ్యాణోత్సవాల వల్ల అంతర్లీనంగా జగద్కళ్యాణము ప్రస్ఫుటమవుతూ ఉంటుంది.

ప్రతిరోజు ఉదయం కనకదుర్గాదేవిని, శ్రీమల్లేశ్వర స్వామిని పెళ్ళికొడుకు, పెళ్ళికూతురుగా చేస్తారు. ఆ తరువాత మంటపారాధన, కలశ స్థాపన, అగ్నిప్రతిష్ఠాపన, పర్యగ్నీకరణం, ధ్వజారోహణం, ఔపోసన, బలిహరణ హోమాది కార్యక్రమాన్ని నిర్వర్తిస్తారు. అలాగే ఉదయం సాయంకాల సమయాలలో వైదిక కార్యక్రమాలు చేయబడతాయి.

బ్రహ్మోత్సవాలలో భాగంగా మొదటిరోజు పల్లకి వాహనం, రెండవరోజు నంది వాహనం, మూడవ రోజు సింహవాహనం, నాల్గవరోజు రావణ వాహనం, ఐదవరోజు వెండిరథ వాహనం మీద దుర్గాసమేత మల్లికార్జునస్వామిని అలంకరించి. ఉత్సవమూర్తుల్ని నగరంలో ఊరేగిస్తారు. ఈ తొమ్మిది రోజులూ ఆలయంలో లక్ష కుంకుమార్చన, నిత్యార్చన, శ్రీచక్ర నవావరణార్చనలు తప్ప మిగిలిన శాంతి కళ్యాణాలు, చండీ హోమాలు, పవళింపు సేవలు నిర్వహిస్తారు. వివిధ రకాల గాజులతో అర్చించి చేతులకు అలంకరిస్తారు. వివిధ రకాల పూలతో అలంకరించిననూ, పూజించిననూ, మల్లె పువ్వులతో అర్చన, అలంకరణ తప్పనిసరిగా చేస్తారు. చివరి రోజున అమ్మ అయ్యవార్లను కృష్ణానదిలో హంసవాహనంలో అధిష్టింపచేసి తెప్పోత్సవం నిర్వహిస్తారు. ఈ తెప్పోత్సవం చూడటానికి ఇసుక వేసినా రాలనంతగా భక్తజనం హాజరై భక్తి ప్రపత్తులతో కొలుస్తారు. నమస్కరిస్తారు. ఈ తెప్పోత్సవం చూడటానికి వెయ్యి కళ్ళు కూడా సరిపోనంతగా అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. తెప్పోత్సవ సమయాన హంస వాహనాన్ని కోటి దీపాలతో అలంకరిస్తారు.

దుర్గా! అని నోరారా పిలిస్తే చాలు జీవన్ముక్తులవుతారని వ్యాసగురుని వచనం. దుఃఖాలు దూరం కావాలంటే, దారిద్ర్య బాధ తొలగాలంటే, విజయాన్ని సాధించాలంటే దేవీ పూజయే ఏకైక సాధనం. ఆమెను పూజించిన వారికి ఆ తల్లి కరుణా కటాక్షాలు తప్పక కలుగుతాయని భవిష్య పురాణం చెబుతోంది. అటువంటి చల్లని తల్లిని, ఈ పవిత్ర సమయంలో మనందరం ఆరాధిద్దాం. అనుగ్రహాన్ని పొందుదాం.

**''దుర్గా దుర్గార్తి శమనీ దుర్గాపద్వి నివారిణీ''**
**దుర్గమచ్ఛేదినీ దుర్గాసాధనీ దుర్గనాశినీ**
**ఓం దుర్గతోద్ధారిణీ దుర్గ నిహంత్రీ దుర్గమాపహా**
**ఓం దుర్గ మజ్ఞానదా దుర్గ దైత్యలోక దవానలా**
**ఓం దుర్గమా దుర్గమాలోకా దుర్గమాత్మ స్వరూపిణీ**
**ఓం దుర్గమార్గప్రదా దుర్గమ విద్యా దుర్గమాశ్రితా**
**ఓం దుర్గమజ్ఞాన సంస్థానా దుర్గమధ్యాన భాసినీ**
**ఓం దుర్గమోహా దుర్గమగా దుర్గమార్థ స్వరూపిణీ**
**సర్వేజనా స్సుఖినో భవంతు**



# కాలాతీతుడు

– ఈరంకి కాశీ విశ్వనాథరావు

**సృష్టికి ఆద్యంతాలు కానరానట్టే, ఎప్పుడు ఆరంభమైనదో, ఎప్పుడు అంతము కానున్నదో ఊహాతీతము. ఉన్నవాడు ఒక్కడే. అందరికీ, అన్నిటికీ సుప్రీమ్, సర్వశక్తిమంతుడు, సూత్రధారి. పరాశక్తితో కూడియున్నవాడు. కాలమనే చక్రం తిప్పువాడు, సుదర్శన చక్రం ధరించినవాడు. సదా తిరుగుతూనే ఉంటుంది నిర్విరామంగా. క్షీరసముద్రంలో శేషశయ్యపై, లక్ష్మీ సమేతంగా, ప్రశాంత చిత్తుడై, ధ్యానముద్రలో నిమగ్నమై సర్వాంతర్యామిగా విలసిల్లుతుంటాడు. ఆయనే హిరణ్యగర్భుడు. పద్మనాభుడు. గుణాతీతుడు. నిర్గుణుడు. చైతన్యస్వరూపుడు. సకల మనోభిరాముడు.**

చరాచర జీవులకు చైతన్యము కలిగించువాడు. ఆరోగ్య, ఆ హారముల నందించువాడు, సర్వాంతర్యామి. దశావతారములుగా అవతరించి దుష్టశిక్షణ, శిష్టరక్షణ గావించినవాడు, దశకంతుని సైతము సంహరించినవాడు, మునిజన సంరక్షకుడు భక్తవల్లభుడు, సర్వజన సంరక్షకుడు. రేయింబవళ్ళు నిత్యము పరితపించువాడు. పుష్పములకు రంగులనద్దినవాడు. సుగంధ పరిమళాలను వ్యాపింపచేయువాడు. మకరందములను నింపినవాడు. ప్రాణవాయువునందించువాడు. తేనెటీగలకు సైతము ఆహారము నందించువాడు. సీతాకోకచిలుకల ద్వారా ఆకర్షింపచేసి పరాగ సంపర్కము, ఫలదీకరణము గావించి జాతిని నిలబెట్టువాడు. నదులను ప్రవహింపచేసేవాడు. వర్షములు కురిపించి, పంటలను పండించి జీవరాసులకు ఆహారమందించి దాహము తీర్చేవాడు. పంచభూతములను అధీనమునందుంచుకున్నవాడు (ఆకాశము, భూమి, అగ్ని, జలము, వాయువు). సకల జీవులను పోషించువాడు. చీకటి వెలుగులను కల్పించినవాడు. సూర్యచంద్రులకు

విశ్రాంతి నీయనివాడు. శీతోష్ణ స్థితులకు కారకుడు. అన్నిటిని సమకూర్చి మానవులకు మాత్రమే మనసునిచ్చినవాడు. నర నారాయణులుగా ప్రసిద్ధి చెందిన మహా మహితాత్ముడు. ఆత్మలన్నీ తానే అయినవాడు. ఉన్నదంతా ఒకటే. వేరొకటి లేదు అని బోధించినవాడు శంకర భగవత్పాదులవారు. అదే అద్వైత సిద్ధాంతము. యజ్ఞస్వరూపుడు, యజ్ఞకర్త. భోక్త. సమస్తమూ స్వాహా జేయగల సమర్థుడు.

ఇప్పటివరకు ఎన్ని కల్పములు, యుగములు, సంవత్సరములు, మాసములు, దినములు గడిచిపోయినవో కదా. ఇంకనూ ఎన్ని గడువనున్నవో ఎవరికీ ఊహకందని రహస్యము. కృతయుగములో తపస్సు ద్వారా, త్రేతాయుగములో యజ్ఞ యాగాదులు, ద్వాపర యుగంలో అర్చనలు, ప్రస్తుత కలియుగములో నామస్మరణములచే ముక్తిని ప్రసాదించువాడు. అవతార పురుషుడుగా ఆవిర్భవించి మానవులకు మార్గదర్శమైనవాడు. ఇతర జీవులకు ఇట్టి అవకాశము లేదు. విత్తనం ఒకటైతే మొక్క మరొకటి మొలవదు. మానవులు తిరిగి మానవులుగానే జన్మలనెత్తుతారు. అయితే వారు సంపాదించుకున్న పాప పుణ్యములను బట్టి ఉత్తమ మానవులుగా జన్మించు అవకాశము పొందగలుగుతారు. కుచేలుడు బీదవాడిగా జన్మించిననూ తన స్నేహితుడైన శ్రీకృష్ణుని అనుగ్రహమునకు పాత్రుడైనాడు.

కలియుగంలో స్వయంభూ అర్చామూర్తిగా తిరుమల గిరులపై కొలువై ఆపద మొక్కులవాడుగా కాపాడుచున్నాడు. తన మహిమలతో నమ్మి వచ్చి కొలుచు భక్తులను సదా కాపాడుచున్నాడు. ఆయన పాదాలు పట్టుకుని ధర్మ మార్గమున నడుచు మానవులను ఉద్ధరించుచున్నాడు. కష్టములను బాపుచున్నాడు. కోరిన కోరికలు తీరుస్తూ, అభయ హస్తముతో సదా ఎదురు చూస్తూ కొలువై ఉన్న శ్రీనివాసుడు కొంగుబంగారము అనుట అతిశయోక్తి కాదు. కానేరదు. శ్రీ వేంకటేశం సమో దేవో న భూతో న భవిష్యతి. అందుకే వినా వేంకటేశం సదా స్మరామి. సదా నమామి. ఏడుకొండలపై సదా వరాహ నరసింహస్వామి ఆస్థానంలో విరాజిల్లుతున్న దేవదేవుడు. ఎంతవారుగాని, వేదాంతులైన గాని సత్ చిత్ ఆనంద స్వరూపుడైన శ్రీవేంకటేశుని నమ్మి శరణాగతి కావటం మనందరికీ శ్రేయోదాయకం. జగమే మాయ, బ్రతుకే మాయ అని చెప్తోంది వేదాంతము. మార్పులను మనోధైర్యం ఎదుర్కోవటం మనందరి కర్తవ్యం.

అనన్యాశ్చింతయంతోమాం, యేజనాః పర్యు పాసతే, తేషాం సతత్ యుక్తానాం యోగక్షేమం వహామ్యహం అని ఆనతిచ్చిన అభయహస్తుని సదా స్మరించుదాము. చింతలను రూపు మాపుకుందాము.

**అన్యథా శరణం నాస్తి త్వమేవ శరణం మమ.**
**నమో వేంకటేశాయ**

# భక్తుడు అనుకునే వారి సాధన ఎలా ఉండాలి?
## – భగవంతునికి ఇష్టమైన భక్తి ఏమిటి?

" మానవునిలో హృదయ పరివర్తనం రానంతవరకు ఎన్ని సాధనలు చేసిననూ ప్రయోజనము లేదు "...

దయాగుణం, దానగుణం లేనిదే దైవమును ఎన్ని పూజలు చేసిననూ ఉపయోగం ఏమీ ఉండదు...

నేడు చాలామంది పుణ్యం వస్తుందని నదులలో స్నానములు చేస్తుంటారు, ఉపవాసాలు చేస్తుంటారు, ప్రదక్షిణలు ,జపాలు చేస్తుంటారు...

కానీ వీటి వలన పుణ్యం రాదు, ఇవన్నీ మన హృదయాన్ని పరిశుద్ధం చేసుకోవడానికి చేసే సాధనలు మాత్రమే! ...

నదులలో స్నానం చేస్తే పాపం పోయి పుణ్యం వస్తుందనుకుంటే, చేపలు కంటే పుణ్యాత్ములు ఈ సృష్టిలోనే ఉండవు!

ఉపవాసాలు ఉండడం వలన కోరికలు తీరుతాయి అనుకుంటే, నిత్యమూ ఆకలితో పస్తులుండే పేదవాడు ఎప్పుడో ధనవంతుడు అయ్యేవాడు! ...

అత్యాశ, సోమరితనం వలన మానవుడు ఇట్టి భ్రమకు లోనగుచున్నాడు...

ఇవన్నీ చేయకూడదు అని కాదు, చేయాలి.... కానీ అంతటితో ఆగిపోకుండా ఆత్మతత్వమును అర్థం చేసుకుని హృదయము పరిశుద్ధం చేసుకుని పరమాత్మను అంతరాత్మలో ఆరాధించుకోవాలి,

ఏనాడు మన హృదయాలు పరిశుద్ధమై పరమాత్మ కొరకు పరితపిస్తాయో ఆనాటి నుంచి మీరు నిజమైన పుణ్యాత్ములవుతారు... ధన్యాత్ములవుతామని తెలుసుకుని ఆ ప్రకారం నడచుకోవడమే ఆధ్యాత్మిక సాధన...

# శ్రీ వేంకటేశ సహస్ర నామావళి

సేకరణ : కె.వి.రాఘవాచార్యులు

గత సంచిక తరువాయి

## 140. రాఘవాయ నమః

సూర్యవంశపు రాజులలో రఘు రాజు శ్రేష్ఠుడు. ప్రసిద్ధుడు. అతని తర్వాత సూర్యవంశము రఘువంశముగా ప్రసిద్ధమయింది. రఘువంశములో జన్మించిన శ్రీరాముడు రాఘవుడు అను నామాంతరము పొందినాడు. రాఘవుడైన శ్రీరామునిగా జన్మించిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

## 141. భరతాగ్రజాయ నమః

గుణవంతుడు, సోదరప్రేమ కలవాడు, భాగవతోత్తముడు అయిన భరతునికి శ్రీరాముడు అన్న. భరతుని ప్రసిద్ధిని బట్టి శ్రీరామునకు భరతాగ్రజుడు అను బిరుదము కల్గింది.

భరతునికి అన్న అయిన శ్రీరామునిగా అవతరించిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు శ్రీవేంకటేశునకు నమస్కారము.

భరతుని తల్లి కైకేయి కోరికపై రాముడు 14 సంవత్సరములు అరణ్యవాసము చేసినాడు. రాముని అరణ్యవాసమును మాన్పించి అయోధ్యకు తిరిగి రప్పించడానికి ప్రయత్నించి భరతుడు విఫలుడైనాడు. అంత రాముని బదులుగ రాముని పాదుకలకు రాజ్యాభిషేకము చేసి, వాటికి ప్రతినిధిగా భరతుడు రాజ్య పరిపాలన కొనసాగించినాడు. తను అయోధ్యలో నుండుటకు ఇష్టపడక భరతుడు రాముని వలె జటావల్కల ధారియై నంది గ్రామమున నివసించి రాజ్య పాలన చేసినాడు. రాముడు రావణ సంహారము చేసి 14 సంవత్సరములు అరణ్యవాసము పూర్తి చేసి అయోధ్యను చేరినపుడు భరతుడు శ్రీరామునికి రాజ్యపాలన అప్పగించి పరిపాలనా భారము నుండి విముక్తుడైనాడు. పరిపాలనలో సోదర ప్రేమకు ప్రసిద్ధుడైన భరతుని వలన రాముడు భరతాగ్రజుడుగా ప్రసిద్ధుడైనాడు. రాముడు భరతుడు లక్ష్మణ శత్రుఘ్నుల సోదర ప్రేమకు ఆదర్శ పురుషులైనారు.

## 142. కౌసల్యా తనయాయ నమః

దశరథ మహారాజుకు పట్టమహిషి జ్యేష్ఠ భార్య అయిన కౌసల్య యొక్క కుమారుడు శ్రీరాముడు. శ్రీవేంకటేశ సుప్రభాతము

శ్లో ॥ కౌసల్యా సుప్రజా రామ పూర్వా సంధ్యా ప్రవర్తతే
ఉత్తిష్ఠ నరశార్దూల! కర్తవ్యం దైవ మాహ్నికమ్ రామా – బాల – 23-2

అను శ్రీరాముని మేలుకొలుపుతో ప్రారంభమగుచున్నది.

కౌసల్యా సుప్రజా రామా అనుటలో తల్లితండ్రులలో తల్లికే ప్రథమ స్థానము గౌరవం. 'మాతృదేవోభవ, పితృదేవోభవ' అను ఆర్యోక్తి తల్లికే ప్రాధాన్యమును తెలుపుచున్నది.

పూర్వము సంఘములో కూడ తల్లికే తొలి గౌరవము. పేర్లు కూడా తల్లి పేరుతో, తల్లి నుండి జన్మించిన వారమనియో తెలుపుచున్నవి. ఉదా॥ వాసిష్ఠీ పుత్ర పులమావి. గౌతమీ పుత్ర శాతకర్ణి అదితి యొక్క కుమారులు ఆదిత్యులు. దితి యొక్క కుమారులు దైత్యులు. తపతి వంశీయులు తాపత్యులు.


కౌసల్యకు పుత్రునిగా జన్మించిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము. పితః శత గుణం మాతా అని శ్రుతి వాక్యము.

## 143. రామాయ నమః

రాముడు అను పేరుగల పురుషోత్తమునికి నమస్కారము.

ఈ రామ నామము వేంకటేశ 108 నామములలో 12 సంఖ్యతో, విష్ణు సహస్ర నామములలో 396 సంఖ్యతో ఉన్నది.

**వినా వేంకటేశం న నాథో న నాథః**
**సదా వేంకటేశం స్మరామి స్మరామి**





**అన్ని నామాలూ నీవే అయిన**
**ఓ వేంకటేశా! నీకు నమస్కారము**

కృతేతు నారసింహో஽ భూత్ త్రేతాయాం రఘునందనః
ద్వాపరే వాసుదేవశ్చ కలౌ వేంకట నాయకః ॥

అని పూర్వాచార్యులు నరసింహ, రామ, కృష్ణ, వేంకటేశులకు భేదము లేదు. అందరూ ఒక్కరే. అందరూ విష్ణుదేవుని అవతార మూర్తులే అని నిర్ధారించారు. ప్రస్తుతించారు.

కౌసల్యాదేవి సుపుత్రుడైన రాముడు తన రూప సౌందర్యముచే, సద్గుణములచే, సత్ప్రవర్తనచే అందరినీ ఆనందింప జేయుచున్నాడు అని తాత్పర్యము. విష్ణుదేవుని సహస్ర నామములతో త్రిరావృతమైనప రామ నామము సమానమని శివుడు పార్వతికి చెప్పినాడు.

శ్రీరామ రామ రామేతి రమే రామే మనోరమే
సహస్రనామ తత్తుల్యం రామనామ వరాననే

సంఖ్యాపరంగా రామనామం మూడుమార్లు ఆవృత్తి అయితే అది విష్ణు సహస్రనామ తుల్యమగును. ఇది ఎట్లనగా – ర కారము అంతస్థములలో రెండవ అక్షరము. మ కారము పవర్గములో అయిదవ అక్షరము కనుక రామ శబ్దము 2x5=10 సంఖ్య అగును. ఈ రామ శబ్దము రెండవసారి ఉచ్చరించగా 10x10=100 అగును. దీనిని మూడవసారి పలికిన రామ శబ్దము వలన 100x10=1000 అగును. ఇట్లు రామ శబ్దము మూడు మార్లు ఆవృత్తి చెందినపుడు 10, 10x10=100x10=1000 సంఖ్య అగుచున్నది. కనుక విష్ణు సహస్ర నామ ప్రభావము త్రిరావృతమైన రామ నామముతో లభించుచున్నదని తెలియుచున్నది. 'శ్రీరామ రామ రామేతి' అని సహస్ర నామ తుల్య'మని శివుడు పార్వతికి ఉపదేశించుటలో ఎంతో పరమార్థమున్నదని నిష్కర్ష.

శ్రీరామునకు వేంకటేశ్వరునకు ధర్యైక్యము కలదు. వేంకటేశ్వరాలయంలో సీతారామ లక్ష్మణుల ఉత్సవ విగ్రహములు కలవు. వార్షిక బ్రహ్మోత్సవములలో ఆరవనాటి పగలు వేంకటేశ్వరుడు (మలయప్ప స్వామి) హనుమంతుని వాహనంపై వేంకటాద్రి రాముడుగా దర్శనమిస్తాడు.

రామ శబ్దమునకు ''రమ్యతే஽స్మిన్ సదా సర్వైః గుణ రూప వశీ కృతైః'' అను నిర్వచనం ఉన్నది. శ్రీరాముని యొక్క దివ్య స్వరూపమునకు, ఇతర సద్గుణములకు వశమైపోయిన వారు నిరంతరం రాముని ధ్యానించటంలోనే ఆనందించుచున్నారు. రమించుచున్నారు కనుక ఇతడు రాముడు అనబడుచున్నాడు. ''రామో రమయతాం శ్రేష్ఠః'' 'గుణాభిరామం చ' అనియు ''శ్యామో యువా లోహితాక్షః'' అనియు ''తథా సర్వ ప్రజా కాంతైః... సూర్య ఇవాంశుభిః'' అనియు రామ సౌందర్యమును వర్ణించిన రామాయణ శ్లోకములన్నియు రాముడు సర్వజన మనోహరుడు, సర్వజన మనోరంజనుడు అని తెలుపుచున్నవి. రాముని ధ్యానించు శ్లోకములలో గల ''శరదిందీవరత్విషే అభిరామ శరీరాయ'' అను వర్ణన శరత్కాలము నందలి కలువల వలె నల్లని దేహకాంతి గలవాడని, సుందర విగ్రహుడనియు తెలుపుచున్నది.

రెండు అక్షరములు గల రామ శబ్దమును ''మరామ మరామ మరామ'' అని జపించుట చేతనే బోయవాడైన వాల్మీకి మహర్షిగా మారి రామాయణమును రచించి, ఆదికవిగా ప్రసిద్ధుడైనాడు. నేటికీ నాగరికులు కొందరు ర కారము ముందు పలుకరు. దాని ముందు అచ్చు చేర్చి పలుకుచున్నారు. రాముడు ''పుంసాం మోహన రూపాయ'' అని కీర్తించినట్లు వైరాగ్య సంపన్నులయిన మహర్షులను కూడ ఆకట్టుకున్న సౌందర్యంతో పరవశింప చేసినాడు. వ్యాధుడగు వాల్మీకికి రామ నామము ఉపదేశించిన నారదుడు

శ్లో ॥ భర్జనం భవ బీజానాం ఆర్జనం సర్వ సంపదాం
తర్జనం యమ దూతానాం రామ రామేతి గర్జనమ్ ॥

లోకులారా! ఉచ్చైః స్వరముతో మీరందరు రామ రామ అని గర్జనము చేయుడు. రామ గర్జనం మీకు పునర్జన్మ అనబడు సంసారమునకు కారణమైన కర్మ బీజములను వేయించి మసి చేయును. రామ గర్జనము అన్ని విధములైన సంపదలను సంపాదించి పెట్టును. మరణ సమయమున యమ దూతలను కూడ మీ వద్దకు రాకుండ తరిమి కొట్టును అని రామనామ ప్రభావమును ఘనముగా ప్రస్తుతించినాడు.

రామనామ ప్రభావమును ఎరింగిన శివుడు నిరంతరం రామ నామ జపము చేయుచు, తన కాశీ నగరమున మరణించిన వారందరి కుడి చెవిలో రామ నామము ఉపదేశించి, వారికి మోక్షార్హత కల్గించు ననుట వాస్తవం కదా.

రామునిగా అవతరించిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.



(స్కాంద పురాణాంతర్గతం)

# శ్రీ వేంకటాచల మాహాత్మ్యం

డా॥ విష్ణుభట్ల గోపాలకృష్ణమూర్తి, 9491579452

## 13.అగస్త్య మహర్షి వృత్తాంతం :

### పార్వతీ పరమేశ్వరుల కళ్యాణం :

పూర్వం దక్షప్రజాపతి కుమార్తె దాక్షాయణి తండ్రిచే అవమానింపబడి ఆ శరీరాన్ని వదలి హిమవంతుని పుత్రికగా, పార్వతిగా జన్మించింది. సప్తర్షుల ప్రార్థన మేరకు హిమవంతుడు తన కుమార్తెను శంకరునకిచ్చి వివాహం చేయాలని నిశ్చయించాడు. వృషభధ్వజుడు, జగత్ప్రభువైన శంకరుడు పార్వతీదేవిని పరిణయమాడగోరి హిమవత్పర్వతంలోని 'ఓషధీప్రస్థ' మనే ప్రదేశానికి వచ్చాడు. అతని ఆజ్ఞ చేత స్థావర జంగమాత్మకమైన ప్రపంచమంతా ఆ భూతనాథుని కళ్యాణాన్ని చూడాలనే వేడుకతో అక్కడికి వచ్చింది. వారందరి బరువు వల్ల ఉత్తర భూభాగమంతా పాతాళలోకం వరకు క్రిందకు దిగిపోయింది. బరువులేక పోవటం వలన దక్షిణ భూభాగం బాగా పైకి లేచింది. ఆ పరిస్థితిని చూచి అందరూ భయపడిపోయారు.

### భూమిని సమం చెయ్యి :

అప్పుడీశ్వరుడు అగస్త్యమహర్షిని 'మహాప్రాజ్ఞా! ఇటు రా' అని పిలిచి ఆయనతో ''లోకంలోని ప్రాణికోటి అంతా ఈ పర్వతానికి రావడం వలన ఆ భారంతో భూమి తల్లక్రిందులవుతున్నది. దీనిని సమం చేయాలంటే నీవే తగినవాడివి. ఓ మహామతీ! నీవు తప్ప ఇతరులకు ఇది సాధ్యం కాదు. నీవు నా అంశతో జన్మించావు. లోక సంరక్షణ చేయటంలో దక్షుడవు. సమర్థుడవు. కావున నాయనా! నా ఆజ్ఞచే భూమిని సమానంగా చెయ్యి. నా వివాహాన్ని చూడాలని వేడుకతో వచ్చిన వారిలో నీవు కూడా ఇక్కడే ఉండవలసిన వాడివే కాని, నీవు వెళ్ళనిచో భూమి వైపరీత్యాన్ని ఎవరూ పోగొట్టలేరు. కావున నీవు వెళ్ళే తీరాలి. నీవు ఉన్నచోటునే పార్వతీ పాణి గ్రహణోత్సవాన్ని నీకు దర్శింపచేస్తాను'' అని చెప్పి అగస్త్య మహర్షిని ఆలింగనం చేసుకున్నాడు. అగస్త్య మహర్షి అలాగేనని మహేశ్వరునికి నమస్కరించి దక్షిణ దిక్కుకు వెళ్ళాడు. అగస్త్యుడు వింధ్యాద్రిని దాటి దక్షిణ దిక్కుకు వచ్చిన వెంటనే భూమి సమతలమైంది. భూమి హెచ్చు తగ్గులను పోగొట్టిన అగస్త్యుని దేవతలు, గంధర్వులు, కిన్నరులు ఆనంద పరవశులై స్తుతించారు.

### అగస్త్య పర్వతం :

ఆ తరువాత అగస్త్య మహర్షి ముందుకు వెళ్ళగా ఒక ఎత్తైన

పర్వతం కనబడింది. అది విశాలమైన ప్రత్యంత పర్వతాలతో భూమిని ధరించి ఉన్నది. అఖండ తేజస్సుతో ప్రకాశించే గొప్ప ఓషధు లకు, అశేష రత్నాలకు నిలయంగా బ్రహ్మదేవుడు దా నిని సృజించాడా అన్నట్లుంది. ఆ పర్వతం గొప్ప శిఖరాలతో భూమిపై పడటానికి సిద్ధంగా ఉన్న ఆకాశాన్ని నిరంతరం మోస్తున్నదో అన్నట్లుంది. అగస్త్య మహర్షి ఆ పర్వతాన్ని చూచి మెల్లగా దాని నధిరోహించి, సుందరమైన ఆ పర్వత శిఖరంపై తన నివాసాన్ని ఏర్పరచుకోవటానికి సంకల్పించాడు. ఆ పర్వతంపైన అమృతం వంటి రుచిగల జలం కలిగి, తామరలు – కలువలతో శోభిస్తూ, తీరంలో అనేక వృక్షాలు గల ఒక సరస్సు ఉంది. అగస్త్యుడు ఆ సరస్సుకు ఉత్తర తీరంలో పితృదేవతలను, ఋషులను పూజించి, యథావిధిగా వాస్తుదేవతారాధన చేసి ఒక మనోహరమైన పర్ణశాలను నిర్మించుకొని చాలాకాలం అక్కడ మునిగణాలతో పాటున్నాడు. దేవతలు, సిద్ధులు, గంధర్వులు, అప్సరసలు సేవిస్తున్న ఆ పర్వతంపై నున్న తపోవనంలో అగస్త్య మహర్షి నిష్ఠతో తపస్సు చేయడం వలన ప్రశస్తమైన సౌభాగ్యం గల ఆ పర్వతానికి అగస్త్య పర్వతమని పేరొచ్చింది.

**మహానదిని ప్రవహింపజేయి :**

ఒకనాడు అగస్త్యుడు మాధ్యాహ్నిక క్రియలను పూర్తిచేసి శివుణ్ణి అర్చించడానికి దేవతా గృహంలో ప్రవేశించగానే మహాత్ముడు, అద్భుతమైన శక్తిగల ఆ మహర్షికి అశరీరవాణి వాక్కులు స్పష్టమైన అక్షరాలతో వినబడినాయి. మునిశ్రేష్ఠుడైన అగస్త్య మహర్షితో అశరీరవాణి ఇలా అంది –



'బ్రాహ్మణోత్తమా! నదిలేని ఈ దేశం ప్రఖ్యాతి చెందినదైనప్పటికీ శోభించడం లేదు. ఆధ్యాత్మిక జ్ఞానం, విజ్ఞానం లేని మంచి రూపం గల బ్రాహ్మణుని వలె, దక్షిణ లేని యజ్ఞదీక్ష వలె, వెన్నెల లేని రాత్రి వలె, కాంతి విహీనమై ఉంది. కావున ఘోర పాపాల వలన కలిగిన భయాన్ని పోగొట్టే ఒక మహానదిని లోకహితం కోరి నీవిక్కడ ప్రవహింపజేయి. సువ్రతా! ఇది దేవతలకు హితమైంది. మునులంతా కోరింది మానవులకు శుభాన్ని కలిగించే, దేవతలకు–మునులకు–భూలోకవాసులందరికీ మేలు చేసే పాపమనే బురదను ప్రక్షాళన చేసే ఒక మహానదిని ప్రవహింపజేయి' అని ఆకాశవాణి పలుకగా ఆ మాటలు విని అగస్త్య మహర్షి క్షణకాల మాలోచించి, దేవతారాధన ముగించి బయటనున్న వేదికపై కూర్చున్నాడు.

ఆ తరువాత తన ఆశ్రమంలోని మునులందరినీ పిలిచి ఆకాశవాణి పలికిన విషయాన్ని చెప్పాడు. ఆ అద్భుతాన్ని విని ఆ మునీంద్రులు సంతోషించి, మిత్రావరుణుని పుత్రుడు, మునిశ్రేష్ఠుడైన అగస్త్య మహర్షికి నమస్కరించి 'ఓ కృపానిధీ! మీ చరిత్ర ఆశ్చర్యకరమైన వాటిలోకెల్లా ఆశ్చర్యకరమైంది. మంగళప్రదమైన వాటిలో మంగళకరమై శోభిస్తున్నది. పూర్వం నహుషుడనే నరేంద్రుడు మీ హుంకారం మాత్రం చేతనే దేవరాజ్యం నుండి భ్రష్టుడైనాడు. కొండచిలువైనాడు. దానికంటే విచిత్రమేముంది? మీరు ఈ భూమండలాన్నంతా ఆక్రమించి తన తరంగాలతో ఆకాశాన్ని తాకే సముద్రాన్ని ఆపోశన పట్టారు. ఇంతకంటే విచిత్రమేముంది? సూర్యుని మార్గాన్ని అడ్డగించటానికై పెరుగుతున్న వింధ్య పర్వతాన్ని శాంతింప జేశారు. ఇంతకంటే ఆశ్చర్యమేముంది? మీ అద్భుత కృత్యాలను ఈ భూలోకంలో ఎవరు స్తుతించగలరు? మా అందరి మహద్భాగ్యం వల్ల మీరు మాకు లభించారు. ఓ మహామునీ! మేమీ ఆశ్రమంలో నిశ్చింతగా ఉన్నాం. దక్షిణ దిక్కులో ఈ ఆశ్రమప్రాంతం వర్ధింపదగింది. సమస్త వస్తువులతో నిండి ఉన్నప్పటికీ నదిలేని ఈ ప్రదేశం శోభించడం లేదు. ప్రాణులకు నదీస్నానం వల్ల లభించనిదేముంది? నది లేని గ్రామంలో నివసించడం కంటే పుట్టకుండా ఉండడమే మేలు. మా భాగ్యం ఫలించే గొప్ప నదిని ప్రవహింపజేయండి. పరమ పావనా! మీరు ఈ ప్రాంతంలో మహానదిని ప్రవహింపజేస్తే మేము దాంట్లో ఎప్పుడు స్నానం చేసి కృతార్థులమవుతామో కదా! ఇంకా ఆలస్యమెందుకు? ఇంక ఆలోచించవలసిందేముంది? వెంటనే గట్టి ప్రయత్నం చేయండి. ఒక పూజ్యమైన, రక్షణ దక్షమైన గొప్ప నదిని తీసుకురండి' అని ప్రార్థించారు.

**సువర్ణ ముఖరికై అగస్త్య మహర్షి తపస్సు :**

అగస్త్య మ హర్షి మనోహరమైన వారి మాటలను అంగీక రించి 'నదిని తీసుకొస్తాన'ని నిశ్చయించుకున్నాడు. మునీంద్రులందరి అనుమతి తీసుకొని, వారిని పూజించి, దేవతల నారాధించి ఈశ్వరునికి యథావిధిగా విశేషపూజ జేసి, కఠినమైన దీక్షను పూని, ఇతరులకు సాధ్యం కాని దుస్సహమైన, బహుక్లేశతరమైన గొప్ప తపస్సు చేశాడు. భరింపశక్యం కాని ఎండాకాలంలో నాలుగు అగ్నిహోత్రాల మధ్య ఉండి, సూర్యునిపై దృష్టి పెట్టి, పంచాగ్ని మధ్యలో అలసట లేకుండా నిలబడి తపస్సు చేశాడు. వానాకాలంలో భయంకరమైన వాయువు వీచటం వలన తట్టుకోలేని విధంగా వర్షధారలు మీద పడుతున్నా మనస్సులో కూడా బాధపడలేదు. హేమంత ఋతువులో కంఠం వరకు నీటిలో నిలిచి జపధ్యానాలు చేస్తూ కొంచెం కూడా చలించలేదు. అయినప్పటికీ తన కోరిక నెరవేరటానికి ఆలస్యమవడం వలన మరల మిక్కిలి భయంకరమైన, గాఢతరమైన నిష్ఠతో తపస్సు చేశాడు. నిశ్చల మనస్సుతో నిరాహారుడై, జితేంద్రియుడై, అంతర్ముఖుడై బాహ్య ప్రపంచ స్పృహ లేకుండా శిలవలె నిలబడ్డాడు. ఈ విధంగా తపస్సు చేస్తున్న ఆయన అవయవాల నుండి అగ్నిజ్వాలలు ఆకాశాన్నంటుతూ ఉజ్జ్వలకాంతితో భయంకరంగా బయటకు వచ్చాయి. అద్భుతమైన ఆ అగ్ని జ్వాలలు అన్ని దిక్కులు వ్యాపించాయి. ప్రజలంతా మిక్కిలి భయపడి బిగ్గరగా అరవడమారంభించారు. జగత్తంతా కల్లోలమయింది. అది చూచి దేవతలు బ్రహ్మదేవుని వద్దకు వెళ్ళి ఆయనకు నమస్కరించి ఈ విషయాన్ని విన్నవించారు.




**బ్రహ్మదేవుని వరప్రదానం :**

బ్రహ్మదేవుడు దేవతలను ఊరడించి, సిద్ధగంధర్వ సేవితుడై, తపస్సు చేస్తున్న అగస్త్యుని ఎదుట ప్రత్యక్షమయ్యాడు. అగస్త్య మహర్షి చతుర్ముఖుని దర్శించి, నమస్కరించి శ్రద్ధతో అనేక విధాల ఆయనను స్తుతించి సంతోషపరిచాడు. అప్పుడు బ్రహ్మదేవుడు వినయంతో వినమ్రుడైన అగస్త్యుని చూచి అనుగ్రహంతో 'ఓ పుణ్యాత్మా! నీ ఘోర తపస్సు చేత సంతోషించాను. నీకిష్టమైన వరాన్ని కోరుకో ఇస్తాను' అన్నాడు. ఆ మాటలు విని అగస్త్య మహర్షి 'ప్రభూ! మీ అనుగ్రహం వల్ల నాకు సర్వం సిద్ధించింది. మీరు నా కోర్కెను తీర్చేటట్లైతే సందేహం లేకుండా అడుగుతాను. అర్థజ్ఞానం లేని వేదపాఠం వలె ఉన్న నది లేని ఈ ప్రదేశాన్ని చూచి నా మనస్సు చాలా బాధపడుతున్నది. భూమిని పవిత్రం చేయటానికి, ప్రజలను రక్షించటానికి సమర్థమైన మహానదిని అనుగ్రహించండి. ఇదే నా అభీష్టం! అని అడిగాడు.

**చతుర్ముఖుడు గంగను ప్రేరేపించటం :**

అగస్త్య మహర్షి ప్రార్థన విని చతుర్ముఖుడు 'తథాస్తు' అని పలికి తన మనస్సులో ఆకాశగంగను స్మరించాడు. వెంటనే ఆకాశగంగ పితామహుని ఎదుట శిరస్సున చేతులు జోడించి నిలిచింది. తన ఆజ్ఞచే వచ్చిన, వినయ వినమిత శిరస్సు గల సకల జగత్తును ధరిస్తున్న గంగాదేవితో బ్రహ్మదేవుడు 'ఓ గంగా! లోకోపకారం కోసం నిన్ను ప్రేరేపిస్తున్నాను. నా వలెనే నీకు కూడా లోకరక్షణ అవశ్య కర్తవ్యం కదా. నదిలేని ఈ ప్రదేశంలో నదిని ప్రవహింపచేయాలని సకలలోకహితంకోరి అగస్త్య మహర్షి అభిలషిస్తున్నాడు. కావున నీవు భూలోకంలో నీ ఒక అంశచే అవతరించి భూలోకవాసుల్ని పునీతుల్ని గావించు. అగస్త్యుడు చూపించే మార్గంలో వెళ్ళు. నీవు భూలోకానికి వెళ్ళినంతనే సిద్ధిని కోరే దేవతలు, మునీంద్రులు నిన్ను సేవిస్తారు. శుభప్రదా! నదులలో శ్రేష్ఠమైన దానివికా. నిన్ను ఆశ్రయించిన జనులను కాపాడు. అగస్త్యునికి ప్రియం చేకూర్చు. సుఖంగా వెళ్ళు' అని పలికి అగస్త్యుడు, ఆకాశగంగ నమస్కార పూజా స్తోత్రాలు చేస్తుండగా పరమేష్ఠి అంతర్ధానం



**కొంతకాలం తరువాత బ్రహ్మ ఆజ్ఞచే అగస్త్య మహర్షి ముని సమూహంతో కూడి శ్రీ వేంకటాచలయాత్రకు బయలుదేరి ఆ పర్వతాన్ని సమీపించాడు. దానికి ప్రదక్షిణం చేసే సంకల్పంతో తూర్పుదిక్కు మొదలుకొని పుణ్య తీర్థాలన్నిటినీ సేవిస్తూ చాలాకాలం ఆ పర్వతంపై సంచరించాడు.**

చెందాడు.

ఆ తరువాత గంగాదేవి అగస్త్య మహర్షి కెదురుగా తన అంశతో పుట్టిన దివ్యమైన తేజోరూపాన్ని చూపించి "ఓ మునివరా! ఈ నా అంశతో పుట్టిన ఈ నది భూమండలానికి వచ్చి నీ కోర్కెను తీర్చగలదు" అని చెప్పి వెడలిన వెంటనే ఆమెచే పంపబడిన నది అగస్త్య మహర్షితో "నేనే మార్గంలో వెళ్ళాలి?" అని అడిగింది. అప్పుడు అగస్త్య మహర్షి ఆమెతో "ఓ కళ్యాణీ! నీ నడకకు తగినట్లు నీకు ముందుగా నేను వెళ్ళి నీకు మార్గాన్ని చూపిస్తాను. నీవు నన్ననుసరించు" అని చెప్పాడు. అప్పుడా శుభప్రదమైన నది "ఓ పుణ్యాత్మా! సంతోషించాను. నీ ఇష్టప్రకారం చేస్తాను" అంది. అగస్త్య మహర్షి నదీరూపం దాల్చిన ఆ గంగాంశను ఆకాశాన్నంటే శిఖరంగల పర్వతం నుండి క్రిందకు దింపి తనకిష్టమైన మార్గాన్ని చూపిస్తూ అపరిమిత సంతోషంతో ముందుకు వెళుతున్నాడు. ఆ నది ఆ విధంగా అగస్త్యమహర్షిని వెంబడించి వెళుతుండగా ఇంద్రాది దేవతలు దివ్య విమానాలలో ఆ మహానదిని అనుసరించారు. మునిశ్రేష్ఠులంతా నూతనంగా అవతరించిన ఆ పుణ్యనదిని చేతులు జోడించి స్తుతిస్తూ వెంబడించి సేవించారు. వేలకొలది సిద్ధులు, గంధర్వులు, చారణులు అక్కడకు విచ్చేసి ఆ నదిని, దాని రాకకు కారణమైన అగస్త్య మహర్షిని మంగళకరమైన స్తోత్రాలతో స్తుతించారు. భూలోక వాసులంతా అమృత సమానం, నిర్మలమైన ఈ జలం మన అదృష్టం చేత లభించిందని ఉత్సాహంతో, సంతోషంతో ఉప్పొంగిపోయారు.

**వేంకటాచల యాత్ర :**

కొంతకాలం తరువాత బ్రహ్మ ఆజ్ఞచే అగస్త్య మహర్షి ముని సమూహంతో కూడి శ్రీ వేంకటాచలయాత్రకు బయలుదేరి ఆ పర్వతాన్ని సమీపించాడు. దానికి ప్రదక్షిణం చేసే సంకల్పంతో తూర్పుదిక్కు మొదలుకొని పుణ్య తీర్థాలన్నిటినీ సేవిస్తూ చాలాకాలం ఆ పర్వతంపై సంచరించాడు. శ్రీహరి దర్శనాసక్తులైన బ్రహ్మ, కుమారస్వామి, దేవేంద్రుడు, రుద్రుడు, విష్వక్సేనాదులను, సనకాది యోగీంద్రులను, నారదాది ప్రముఖ ఋషులను, సిద్ధ – గంధర్వ – అసుర – యక్ష – రాక్షస – పన్నగులను వరుసగా దర్శించి వినయంతో కూడిన ప్రియభాషణలతో వారిచే గౌరవింపబడుతూ ఆ పర్వతం పైనున్న ఆశ్చర్యకరమైన విశేషాలన్నిటినీ దర్శిస్తూ ఆ పర్వతమంతా సంచరించాడు. కుమారధార మొదలైన తీర్థాలలో స్నానమాచరించి జగత్ప్రభువైన గోవిందుని ఆయా ప్రదేశాల్లో ఆరాధించాడు.

ఈ విధంగా సంచరిస్తుండగా వేల సంవత్సరాలు గడిచిపోయాయి. అయినా శ్రీమన్నారాయణుని దర్శనం కాలేదని ఆయన విచారగ్రస్తుడయ్యాడు. ఆ సమయంలో బృహస్పతి, శుక్రాచార్యుడు, ఉపరిచరవసు మహారాజు అగస్త్య మహర్షి వద్దకు వచ్చారు. వారాయనకు నమస్కరించి "ఓ మునిశ్రేష్ఠా! అపర నారాయణుని వలె ఉన్న మిమ్మల్ని దర్శించిన మా జన్మ సఫలమైంది. లోకనాథుడైన బ్రహ్మదేవుడు అచ్యుతుని దర్శించగోరిన మమ్మల్ని ఈ విధంగా ఆజ్ఞాపించాడు. **(సశేషం)**

# మీ ప్రశ్న మా సమాధానం

జిజ్ఞాస కలిగిన ఆధ్యాత్మిక ప్రశ్నలకు సమాధానాలు.
భక్తులు తమ ప్రశ్నలను మా పత్రికకు రాయగలరు.
– ఎడిటర్, శ్రీవేంకటేశం

నిర్వహణ:
డా. మరింగంటి లక్ష్మణాచార్యులు

**1. ప్రశ్న – అయ్యా నాదొక చిక్కు ప్రశ్న. 'అవశ్యమను భోక్తవ్యం కృతకర్మ శుభా శుభమ్' – అంటే చేసిన కర్మకు లభించే ఫలం మంచైనా చెడైనా ఎవరికైనా సరే అనుభవించక తప్పదు అని అంటారు కదా. మరి ఇక పూజలు, పురస్కారాలు, యజ్ఞాలు, గుళ్ళు గోపురాల సందర్శనలెందుకు? పాపఫలం తప్పనిసరిగా అనుభవించవలసిందేనా?**

జవాబు – ఇది చిక్కు ప్రశ్న కాదు. చక్కని ప్రశ్న. మీరన్నట్లుగా కర్మఫలం అవశ్యం అనుభవించవలసిందే. తెలిసో తెలియకో మనిషి తప్పులు, పాపాలు, అపరాధములు చేస్తాడు. ప్రత్యక్షంగానో పరోక్షంగానో కూడా చేస్తాడు. వీటికి ఫలితం అనుభవించక తప్పదు. అయితే తప్పును గ్రహించి, పశ్చాత్తాపపడి గురువుల, పెద్దల, సజ్జనుల మార్గ నిర్దేశంలో 'స'పంచకం (సత్సంగం, సద్గ్రంథ పఠనం, సద్గురు సమాశ్రయణం, సన్మార్గ గమనం, సజ్జన సాధు సేవ) చేస్తూ, సత్కర్మాచరణతో బాటుగా శరణాగతి చేసి, భగవత్, భాగవత సేవ చేస్తే, భజన, ధ్యానం, యోగం ఆచరిస్తే, పుణ్యక్షేత్ర సందర్శన చేస్తూ, మహాత్ముల, సత్పురుషుల ఆశీస్సులు పొందితే – ఆయా దుష్కర్మల తీవ్రత / ప్రభావం తగ్గుతుంది. పెద్ద కష్టం / నష్టం / బాధకు బదులు చిన్నపాటి కష్టం / నష్టం / ఆపదతో పోతుంది అని పెద్దలు చెప్తారు.

**2. ప్రశ్న – మా తెలుగు తల్లికి మల్లెపూల దండ అనే గొప్ప గేయంతో అఖండ కీర్తి ఆర్జించిన స్వర్గీయ శంకరంబాడి సుందరాచారి గారు తన తిరుమల యాత్ర వైభవాలతో రచించిన 'నా స్వామి' అనే అద్భుతమైన చిన్న పుస్తకం గురించి క్లుప్తంగా తెలియచేయండి.**

జవాబు – అలాగే. శంకరంబాడి సుందరాచారి గారు అవిస్మరణీయుడు. ప్రతి తెలుగువాడికి అనుస్మరణీయుడైన కవి. తెలుగుతల్లిని పూలదండతో అలంకరించి తెలుగు దేశానికి జాతీయగీతం అనదగ్గ అమృతోపమానమైన గీతాన్ని అందించారు. ఆయన 1960 ప్రాంతాల్లో 'నా స్వామి' (తిరుమల యాత్ర) అనే శతకం వ్రాశారు. ఈ పుస్తకం ఆ



రోజుల్లోనే ఎందరో మహానుభావుల, సామాన్య వ్యక్తుల ప్రశంసలు పొందింది. తర్వాత చాలాకాలం వరకు ఈ పుస్తకం అదృశ్యమైపోయింది. ఎక్కడా ఎవరికీ దొరకలేదు. తిరిగి తిరుమ తిరుపతి దేవస్థానం వారు శ్రమించి తిరిగి 2009లో ముద్రించి మనకెంతో ఆనందం కలిగించారు. దానిలోని ముఖ్యమైన ఆసక్తికరమైన పద్యాలు కొన్ని :

1. **నీదు చెంత పుట్టి నీ ముందు పెరిగిన**
   **వాడనయ్యు నిన్ను జూడ బుద్ధి**
   **పుట్టి యెరుగనట్టి పొగరుబోతును, కొర**
   **గాని బ్రతుకు నాది శ్రీనివాస**
2. **కష్టములకు నోర్చి కాసులు వెచ్చించి**
   **దూరమనక నిన్ను చేరవచ్చు**
   **వారలెల్ల వెర్రివారలు కారను**
   **చింత నొడమబోదు శ్రీనివాస**

3. సాటి లేని మేరు సముడు మానవుడంచు
చాటి చచ్చిపడిన శక్తులెల్ల
నీదు చలువ లేక నేదియు కొనసాగ
రాని సత్యమెరిగె శ్రీనివాస

4. కల్లగాదు, నిజము కలియుగ వైకుంఠ
మనగజెల్లు, చూడ కనుల విందు
కొలుపుచుండు తన తలపు పూవులు పూచి
తేనియలను కార్చ శ్రీనివాస

5. భవము గడుచు యుక్తి భక్తిలో ననురక్తి
వాంఛలెల్ల దునుమ వలయు శక్తి
వలసినంత తృప్తి కలిగించితే – చాలు
సిరుల సొత్తు వలదు శ్రీనివాస

6. తామరాకు పైన తనరు కంకణమట్లు
పాలరాతి మీది పాదరసము
నదుల, బ్రతుకునంటి యంటక జీవిత
శేష మరుగనిమ్ము శ్రీనివాస

**3.ప్రశ్న – ధ్యానం వలన ముఖ్య ఫలితాలు ఏమిటి?**

జవాబు – ధ్యానం అనేది శరీరం, మనసు ఆత్మల కెంతో మేలు చేసే ప్రక్రియ. ధ్యానం వలన శారీరకంగా గుండె కొట్టుకునే వేగం, రక్తపోటు తగ్గడం, శ్వాస ఉధృతం తగ్గి సమానంగా ఉంటుంది. పరస్పర విరుద్ధమైన ఆలోచనలు, ఉద్వేగభరితమైన ఆలోచనలు ఉండవు. తేజస్సు పెరుగుతుంది. నిగ్రహశక్తి అలవడుతుంది. సృజనాత్మకత పెరిగి జీవనశైలి బాగుపడుతుంది.

# ద్రౌపది ఆలయం

– శ్రీమతి వెలమకన్ని పద్మావతి



చిత్తూరు జిల్లాలోని యానుగాని పల్లెలో ద్రౌపది ఆలయం ఉంది. 5–6 శతాబ్దాలకు పూర్వమే ఈ ఆలయం నిర్మింపబడినట్లు చెప్తారు. ద్రౌపది సమేతంగా పంచపాండవులు కొలువున్న ఈ ఆలయంలో వైశాఖ శుద్ధ పంచమి నుండి బహుళ అష్టమి వరకు 18 రోజులు ధర్మరాజు తిరునాళ్ళు జరుపుతారు. అంకురార్పణతో ప్రారంభమయ్యే ఈ ఉత్సవం తిలక తర్పణంతో అంతమవుతుంది. ఉత్సవాన్ని నిర్వహించే గౌడ బ్రాహ్మణులు ఈ 18 రోజులూ ఆలయంలోనే నివాసం ఉంటారు. ఉత్సవ దినాలలో 12 రోజులు ప్రతి ఉదయం 10 గంటల నుండి సాయంకాలం 5 గంటల వరకు ఉదంక చరిత్రతో ప్రారంభించి ధర్మరాజు పట్టాభిషేకం వరకు మహాభారత పురాణ శ్రవణం జరుగుతుంది. పగటిపూట వినిపించిన కథనే రాత్రి నాటకంగా ప్రదర్శిస్తారు. 9వ రోజు బకాసుర వధ జరుగుతుంది. పది మూటల బియ్యం అన్నం వండి ఒక బండిలో పోసి, బండిని అలంకరించి భీమ వేషధారి దానిపై ఆసీనుడై బకాసుర వేషధారి వద్దకు వెళ్ళి వాడితో పోరాడి అతడిని అంతం చేస్తాడు. బండిలోని అన్నాన్ని గ్రామస్తులంతా ఒకచోట చేరి వేడుకతో భుజిస్తారు. 13వ రోజు ధర్మరాజు రాజసూయ యాగాన్ని ప్రదర్శిస్తారు. యాగాన్ని వీక్షించడానికి వచ్చిన వారందరికీ ఫల, పుష్ప, తాంబూలాలు ఇస్తారు. 14వ రోజున పాశుపతాస్త్రాన్ని సాధించడానికి అర్జునుడు చేసే యాగాన్నే ప్రదర్శిస్తారు. ఆలయం ముందు పొడవాటి తాటిచెట్టును నాటుతారు. అర్జున వేషధారి ఆ చెట్టుని పూజిస్తాడు. ఆ తర్వాత ఉత్తర గోగ్రహణం, శ్రీకృష్ణ రాయబారం కూడా ప్రదర్శిస్తారు. 18వ రోజున దుర్యోధన వధ చాలా అద్భుతంగా ప్రదర్శిస్తారు. అదేరోజు సాయంకాలం పూజారులు ఏడు బావులలో నీటిని తోడుకొని వేపాకు, పసుపు, కుంకుమలతో పూజించిన కుండలతో తెచ్చి అప్పటికే ఏర్పాటు చేసిన అగ్నిగుండంలో పోసి పూజ చేస్తారు. దీనినే గార్గేయ పూజ అంటారు. పూజారి ఒక కుండను నెత్తిన పెట్టుకుని అగ్నికుండం చుట్టూ మైమరచి నృత్యం చేస్తాడు. ఉపవాసం ఉన్న పూజారితో పాటు ఉపవాసమున్న భక్తులు కూడా అగ్నిగుండంలో ప్రవేశించి అగ్నిపై నడుస్తారు. ఈ ఉత్సవం ధర్మరాజు పట్టాభిషేకంతో ముగుస్తుంది. ఇంత వైభవంగా మహాభారత ఉత్సవాలు సంవత్సరానికొకసారి నిర్వహించే ఈ దేవాలయాన్ని దర్శించిన భక్తులు మహాభారత గాథను మరల మరల తలచుకొంటారు. ద్రౌపదికి – పంచపాండవులకు మనసారా నమస్కరించుకుంటారు.

ధారావాహికం



## తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి వారి
# బ్రహ్మోత్సవ వైభవం

కీ॥శే॥ రాఘవాచార్య

(గత సంచిక తరువాయి)

## 14. రథోత్సవం

శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవములలో అత్యంత వైభవమైనది, భక్త జనాకర్షకమైనది రథోత్సవం. ఎనిమిదవ రోజు ఉదయం, ఉదయ సూర్యుని కిరణ కాంతులలో మేరు పర్వతం వంటి రథంలో ఇరువైపులా ఉభయ దేవేరులు – శ్రీదేవి భూదేవులు – మధ్యలో వేంకటేశ్వరస్వామి వేంచేసి యుండగా భక్తులందరు గోవిందనామ స్మరణ చేస్తూ రథం పగ్గాలను లాగుచుండగా తిరుమల నాలుగు మాడవీధులలో రథోత్సవం జరుగుతుంది. ఈ ఉత్సవంలో భక్తులందరు తేరు పగ్గాలను పట్టుకొని లాగుచు స్వయంగా పాల్గొనడం ప్రత్యేకత. విశిష్టత. అందువల్లనే రథోత్సవం అత్యంత వైభవంగా, కోలాహలంగా ఉంటుంది.

''రథస్థం కేశవం దృష్ట్వా పునర్జన్మ న విద్యతే'' రథంలో వేంచేసి యున్న విష్ణుదేవుని దర్శనం జన్మరాహిత్యాన్ని కల్గిస్తుంది అను విశ్వాసంతో భక్తులందరు రథోత్సవంలో స్వయంగా పాల్గొంటారు. రథోత్సవ వైభవాన్ని తాళ్ళపాక అన్నమాచార్యులు –

**దేవదేవుడెక్కినదె దివ్యరథము**
**మావంటి వారికెల్ల మనోరథము** - 5-225
**మిన్ను నేలా నొక్కటైన మేటి తేరు**
**కన్నుల పండువైన శ్రీకాంతుని తేరు** - 6-227
**కన్నుల పండుగలాయ గన్నవారి కందరికి**
**వెన్నుడేగీ నిల్లదివో వీధులను**
**అది యెక్కె దిరుతేరు అసురుల బెదరగ**
**త్రిదశులు చెలగగ దేవ దేవుడు**
**కదలె బండి కండ్లు ఘనమైన మ్రోత తోడ**
**వెదజల్లు గాంతులతో వీధుల వీధులను** - 10-178

అని మనోహరంగా వర్ణించినాడు. రథోత్సవంలో తిరువీధులలో రథం వెళుతున్నప్పుడు భక్తులు కానుకలు చల్లుచూ, ఆగిన చోట హారతులు ఇస్తుంటారు. ఈ పవిత్ర దృశ్యాన్ని అన్నమయ్య

**ఎత్తరే ఆరతులు యియ్యరే కానుకలు**
**యిత్తల నేగి వచ్చెను యిందిరా నాథుడు**
**గరుడ ధ్వజపు తేరు కనక మయపు తేరు**
**సిరులతో వేదముల చేరుల తేరు**

**సురలు మునులు బటంటి సొంపుతోడ దియ్యగాను**
**యిరవుగ నేగి వచ్చె ఇందిరానాథుడు -10-31**
**వీథుల వీథుల విభుడేగీ నిదె**
**మోదము తోడుత మొక్కరో జనులు**
**గరుడ ధ్వజమదె కనక రథం బదె**
**అరదము పై హరి యల వాడె**
**యిరుదెసల నున్నారు ఇందిరయు భువియు**
**పరగ బగ్గములు పట్టరో జనులు -10-286**

అని భక్తజనులకు హెచ్చరికలు చేస్తూ రథోత్సవ వైభవాన్ని వర్ణించాడు.

తరిగొండ వెంగమాంబ రథోత్సవ వైభవాన్ని వేంకటాచల మాహాత్మ్య పద్య కావ్యంలో యిట్లు వర్ణించింది–

**పరమ భాగవతులు భక్తితో బాడుచు**
**నుప్పొంగి యాడుచు నుండగాను**
**గరములు ద్రిప్పి భోగ స్త్రీలు ముందర**
**జతలుగా నృత్యముల్ సలుపగాను**
**గ్రమముగా వంది మాగధ సూత బృందముల్**
**పురుషోత్తమ ఖ్యాతి బొగడగాను**
**శిరముల గలశముల్ జేర్చి కొందరు భక్తు**
**లొక్కెడ బేరణుల్ ద్రొక్కగాను**
**మొనసి కొందరు గోవింద యనుచు భక్తి**
**పరవశత్వముచే మించి పలుక గాను**
**రథముపై దండులము లనురాగ యుక్తి**
**సతులు మేడలపై నుండి చల్లగాను - 2-131**

–శ్రీనివాసుడు దేవేరులతో రథముపై మాడవీథులలో ఊరేగుచుండగా భాగవతోత్తములు భక్తిగీతములను పాడుచు, ఉప్పొంగి ఆడుచుండిరి. రథము ముందు భోగ స్త్రీలు జతలుగా కన్నుల పండువగా చేతులు త్రిప్పుచు నృత్యములు చేయుచుండిరి (విజయనగర చక్రవర్తి కృష్ణదేవరాయల సోదరుడు అయిన అచ్యుతదేవరాయలు (క్రీ.శ.1529-1542) తిరుమలలో వేంకటేశ్వర స్వామి పరిచర్యకు గాను రంజకం కుప్పసాని కుమార్తె ముద్దుకుప్పాయి అను నాట్య కళావిశారదను నియమించినాడని శాసనం 4–11 తేది : 6–6–1531 తెలియజేస్తున్నది. ఆనాడు దేవదాసీలను 'ఎంబెరుమా నడియారు'లని గౌరవించేవారు. దేవదాసీలు ఊరేగింపు ముందు నృత్యము సేయుటను వెంగమాంబ వర్ణించింది. నేడు ఆ స్థానంలో కులస్త్రీలు, యువతులు ప్రవేశించి చిందులు, భజనలు, కోలాటాలు వేస్తూ భక్తులకు వినోదాన్ని ఆనందాన్ని కల్గిస్తున్నారు. వేంకటేశ్వరుని వైభవాన్ని వందిమాగధులు, సూతులు ఎలుగెత్తి పొగుడుచుండిరి. భక్తులు కొందరు తలపై కలశములను పెట్టుకొని పేరణి నృత్యములు చేయుచుండిరి. కొందరు భక్తులు భక్తి పారవశ్యంతో గోవిందా గోవిందా యని గొంతెత్తి పలుకుచుండిరి. కొందరు పేరంటాండ్రు మాడవీధులలో ఉన్న మేడలపై నుండి రథముపై సేసలు (బియ్యము) ప్రీతితో చల్లుచుండిరి. (నేడు భక్తులు రథముపై ఉప్పు, మిరియాలు, చిల్లర నాణెములు చల్లుచున్నారు).

తిరుమల దేవాలయం గోడలపై రథోత్సవానికి సంబంధించిన శాసనాలు చాలా ఉన్నాయి. తాళ్ళపాక పెద్ద తిరుమలాచార్యులు తన పేర ఏర్పాటు చేసిన ఆని బ్రహ్మోత్సవంలోను పెరటాశి బ్రహ్మోత్సవంలోను మూడు రథాలు – బ్రహ్మదేవ, విష్వక్సేన, వేంకటేశ్వరస్వామి – పాల్గొంటుండేవని అతడు వేయించిన ధర్మశాసనం 4–129 తేది : 17–3–1539 వలన తెలియుచున్నది. ఎట్టూరు తిరుమల కుమార తాతాచార్యులు ఏర్పాటు చేసిన అల్పిశి బ్రహ్మోత్సవంలో మూడు రథాల అలంకరణ కోస ఒక రేఖైపొన్ను, రెండు పణాలు కట్టడి చేసి ధర్మశాసనం 6–5 తేది : 25–9–1583 వేయించినాడు.

రథోత్సవం విశిష్టమైన తత్వజ్ఞానాన్ని బోధిస్తున్నది. కఠోపనిషత్తు ఆత్మకు, శరీరానికి ఉండే సంబంధాన్ని రథయాత్రతో పోల్చి చక్కగా వివరించింది.

**"ఆత్మానాం రథినం విద్ధి శరీరం రథ మేవ తు**
**బుద్ధిం తు సారథిం విద్ధి మనః ప్రగ్రహ మేవ చ**
**ఇంద్రియాణి హయా నాహు ర్విషయాం స్తేషు గోచరాన్" 3-34**

–శరీరమే రథం, బుద్ధి సారథి, మనస్సు కళ్ళెం, ఇంద్రియాలు గుర్రాలు, ఇంద్రియ విషయాలు అవి పరుగులు తీసే మార్గాలు. ఆత్మ (అంతర్యామిగా ఉన్న భగవదంశ) రథికుడు. గుర్రాల వంటి ఇంద్రియాలను మనస్సు అనెడి కళ్ళెముతో అదుపు చేసి, రథం వంటి శరీరాన్ని మీ బుద్ధి యను సారథి ద్వారా చక్కని మార్గంలో నడిపించి, రథికుడైన ఆత్మను – నన్ను – గుర్తించి, సేవించి, తరించండని హితబోధ చేస్తున్నాడు వేంకటేశ్వరుడు.

## 15. అశ్వవాహనం

బ్రహ్మోత్సవాలలో ఎనిమిదవ నాటి రాత్రి వేంకటేశ్వరస్వామి ఒక్కడే శిరస్త్రాణాన్ని ధరించి, ఖడ్గం చేతబూని యుద్ధవీరుని వెల కనిపిస్తూ అశ్వవాహనంపై ఊరేగుతాడు. వేగమునకు అశ్వం ప్రతీక. అనాదిగా అశ్వవాహనంపై ఉంది. విడి ప్రయాణములకే గాక

రథములకు అశ్వము లను కట్టి నడిపేవారు. చతురంగ బలములలో అత్యంత ప్రధానమైనది అశ్వబలం. అమృతము కొరకు దేవతలు రాక్షసులు పాలసముద్రాన్ని చిలికినపుడు, పాలసముద్రము నుండి ఉచ్చైఃశ్రవము అను పేరుగల అశ్వరాజము ఉద్భవించింది.

విష్ణుదేవుని అవతారాలు పది ప్రసిద్ధమైనవి గలవు. వాటిలో చివరి అవతారం కల్కి అవతారం. కలియుగాంతంలో విష్ణుదేవుడు కల్కిరూపం ధరించి ఖడ్గము చేతబూని అశ్వవాహనారూఢుడై దుష్టజన సంహారం, శిష్టజన సంరక్షణ చేసి ధర్మాన్ని స్థాపిస్తాడని పురాణాలు కీర్తిస్తున్నాయి.

**''కల్కినం తురగారూఢం కలికల్మషనాశనం**
**కళ్యాణదం కలిఘ్నం చ శ్రీనివాసం భజేஉ నిశమ్''**

–అశ్వమును అధిరోహించినవాడు, భక్తుల కలిదోషమును హరించువాడు, శుభముల నొసంగువాడు, దుష్టుడయిన కలి పురుషుని నాశనం చేయువాడు, కల్కి భగవానుని రూపంలో అవతరించునట్టి శ్రీనివాసుని ఎల్లప్పుడు సేవించెదను అని దేవశర్మ (ఆదిత్యపురాణం 3–33) ప్రస్తుతించినాడు. శుక్ల యజుస్సంహితలో (9–14) అశ్వం రాష్ట్రానికి ప్రతీకగా వర్ణించబడింది.

తాళ్ళపాక అన్నమాచార్యులు స్వామివారు దేవేరితో తిరువీధులలో ఊరేగు విధానాన్ని ఇట్లు వర్ణించినాడు.

**వాగె బలువు దైవపురాయు నీ**
**రాగె జతనము పరాకెచ్చరికె**
**మించుల దురగము మిన్నుల మోవగ**
**నంచల గురచల నాడగను**
**కంచు మించుగా గక్కున దోలితి**
**పంచాస్త్ర గరుడ పాడెచ్చరికె**
**పెక్కున తేజిటు పేరెము వారగ**
**తొక్కని చోట్లు దొక్కగను**
**చుక్కలు మోవగ సొంపుగ దోలితి**
**తొక్కుల దేవ వెచ్చరికె**
**అంకవన్నె పాదాబ్జాము పదిలము**
**వేంకటేశ తిరువీధులను**
**సంకెలేక శ్రీసతి తోజెలగెడి**
**లంకెల జాగు భళా యెచ్చరికె** **11-2-30**

మరొక కీర్తనలో

**దేవ శిఖామణి దివిజులు వొగడగ**
**వేవేల గతుల వెలసీ నాడే**
**వీధుల వీధుల వెస దురగముపై**
**భేరిలు బల్లెము చిరచిర దిప్పుచు**
**మోదము తోడుత మోహన మూరితి**
**యే దిస చూచిన నేగీ నాడె**
**కన్నుల దిప్పుచు కర్ణములు గదల**
**సన్నలరాగెను చౌకళించుచును**
**అన్నిట దేజి యాడగ దేవుడు**
**తిన్నగ వాగేలు దిప్పీ నాడె**
**వలగొన దిరుగుచు వాలము విసరుచు**
**నిలిచి గుర్రమట నేర్పులు చూపగ**
**బలు శ్రీవేంకటపతి యహోబలపు**
**బొలమున సారెకు బొదలీ నాడే** **-2-93**

కలి యుగాంతములో వేంకటేశ్వరస్వామి అశ్వవాహనం మీద కల్కి రూపంలో వచ్చి దుష్టశిక్షణ, శిష్టరక్షణ, ధర్మసంరక్షణ చేస్తాడని చాటి చెప్పడమే అశ్వవాహన ప్రయోజనం. పద్మావతీ శ్రీనివాసుల తొలిచూపుల వేళలో వేంకటేశుడు అశ్వవాహనా రూఢుడై ఉన్నాడు. వేంకటేశ్వర స్వామి పారువేట ఉత్సవంలో కూడ అశ్వవాహనం ఎక్కి వేటకు బయలుదేరుతాడు. విష్ణుదేవుని మరొక అవతారం హయగ్రీవుడు అశ్వముఖుడు. కఠోపనిషత్తు ఇంద్రియాలను గుర్రములుగా వర్ణించింది. కనుక గుర్రము నెక్కి ఊరేగుచున్న వేంకటేశుడు ఇంద్రియ నియామకుడు. స్వామి వలెనె మనం కూడ గుర్రాల వంటి ఇంద్రియాలను అదుపులో పెట్టి, నడిపించి జీవనయాత్ర – ఇంద్రియ నియామకులమై – సాగించాలని వేంకటేశ్వర స్వామి అశ్వవాహనం ద్వారా బోధిస్తున్నాడు.

# చక్రస్నానం

బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా తొమ్మిదవ రోజు ఉదయం పల్లకి ఉత్సవం. తర్వాత శుభఘడియలలో – సుమూహర్తంలో – చక్రస్నాన మహోత్సవం జరుగుతుంది. పల్లకి ఉత్సవాన్ని అన్నమాచార్యులు

**''తనివార దిరువ నందలము సేవ సేదు**
**అనువుగా సేవించరో అమరులు ఋషులు**
**యెదురుగా గూచుండి యిద్దరు నందల మెక్కి**
**కదిసి మీద బన్నాము గట్టించి**
**ముదము మీద నొండొరులు మోములు చూచుకొంటూ**
**యిదివో దేవులు దేవుడేగేరు వీధులు''** **- 15-189**

అని పల్లకిలో వేంకటేశ్వరుడు అలమేలుమంగ ఎదురెదురుగా కూర్చుని ఊరేగుచున్న మనోహర దృశ్యాన్ని రమణీయంగా వర్ణించాడు.

బ్రహ్మోత్సవంలో చివరి ఘట్టం అవభృథము – చక్రస్నానం. ఇది యజ్ఞాంతంలో ఆచరింపబడే అవభృథస్నానమే. యజ్ఞం చివర అవభృథ స్నానం చేయడం సంప్రదాయం. శాస్త్ర విహితం కూడా. బ్రహ్మోత్సవాలు తొమ్మిది రోజుల పాటు ఒక యజ్ఞం వలె శ్రద్ధగా, ఘనంగా, వైభవంగా నిర్వహింపబడతాయి. తొమ్మిదవ రోజు ఉదయం శ్రీవారి అవతార నక్షత్రమైన శ్రవణం నాడు చక్రస్నానం జరుపబడుతుంది. సవం అంటే యజ్ఞం. ఉత్+సవ – ఉత్సవం అంటే ఉత్కృష్టమైన – శ్రేష్ఠమైన – యజ్ఞం అని అర్థం. కనుక బ్రహ్మోత్సవాలలో చివరి అంశంగా అవభృథం (చక్రస్నానం) జరుగుతుంది. అవభృథం ఉత్సవ వైభవాన్ని తరిగొండ వెంగమాంబ యిట్లు వర్ణించింది.

"చక్రత్తాళ్వారులను, హరిని, శ్రీ భూమి నీళలను (ఇప్పుడు శ్రీవారి వెంట నీళాదేవి కనిపించదు. స్వామికి ఇరువైపుల శ్రీదేవి, భూదేవులే ఉన్నారు) దిరుచ యందు (పల్లకి యందు) విమాన ప్రదక్షిణంబుగా స్వామి పుష్కరిణీ తీరంబున వేంచేపు సేయించుకొని వచ్చి వరాహస్వామి ముందరి మంటపంబులో నునిచి, పంచామృత స్నపనంబును (పాలు, పెరుగు, తేనె, కొబ్బరి నీళ్ళు, పసుపులతో అభిషేకం) దిరు మంజనంబును, చక్రస్నాన నైవేద్య క్రమంబులును నాచరించి బ్రహ్మాదులవభృథ స్నానంబులు చేసిరి" – వేంకటాచల మాహాత్మ్యం – 2–132.

వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులైన మలయప్ప స్వామి శ్రీదేవి భూదేవులతో పల్లకిలో వరాహస్వామి ఆలయ ప్రాంగణం చేరుకొంటారు. వీరితో పాటు వేరొక పల్లకిలో చక్రత్తాళ్వారు (సుదర్శన చక్రం) వస్తాడు. పిమ్మట దేవతా మూర్తులకు, చక్రానికి స్నపన తిరుమంజనం జరుగుతుంది. మొదట స్వామివారికి, దేవేరులకు స్నాన వస్త్రాలు ధరింపచేసి అర్ఘ్య పాద్య ఆచమనాలు జరిపి శుద్ధోదకంతో స్నానం జరిపిస్తారు. పిమ్మట ఆవుపాలతో అభిషేకం, శుద్ధ జలంతో అభిషేకం జరుగుతాయి. ధూప, దీప, కర్పూర నీరాజనాలు ఇస్తారు. తర్వాత వరుసగా పెరుగు, తేనె, కొబ్బరి నీళ్ళు, పసుపుతో అభిషేకిస్తారు. వీటితో అభిషేకం చేసిన ప్రతిసారి శుద్ధ జలంతో అభిషేకం చేస్తారు. పిమ్మట దేవతా మూర్తులకు ధూప దీప నివేదన కర్పూర హారతులు జరుగుతాయి. చివరగా దేవతా మూర్తులకు చందనాన్ని అలది, తిలకధారణ చేసి, తులసి మాలలతో అలంకరిస్తారు. ఆచమనాది క్రియల తర్వాత ధూప దీప హారతులు, కుంభ హారతి, నక్షత్ర హారతి సమర్పిస్తారు. చివరగా బంగారు పళ్ళెముతో సహస్ర ధారాభిషేకం జరుగుతుంది. ఇట్లు మలయప్పస్వామికి శ్రీదేవి భూదేవులకు, చక్రత్తాళ్వారుకు స్నపన తిరుమంజనం జరుగుచుండగా వేదపండితులు శ్రీసూక్త, పురుషసూక్త, భూసూక్తములను పఠిస్తారు. అభిషేకం పూర్తికాగానే వేద పఠనం సమాప్తమవుతుంది. పిమ్మట ద్రావిడ పండితులు నీరాట్టం పఠిస్తారు. స్వామివారి అభిషేక జలాన్ని అర్చకులు, 'పూతో భవ' అని ముందుగా తమ మీద చల్లుకొని, పిమ్మట భక్తులందరి మీద చల్లుతారు. తర్వాత దేవతామూర్తులకు వస్త్రాలంకారం చేసి నివేదన చేస్తారు. తర్వాత సుదర్శన చక్రత్తాళ్వారును మాత్రమే స్వామి పుష్కరిణిలో ముంచి పవిత్రస్నానం (చక్రస్నానం) చేయిస్తారు. ఉత్సవం వేంకటేశ్వరస్వామికి (యజమానికి), అవభృథము చక్రత్తాళ్వారుకు (సేవకునకు) జరుగుతుంది). అంతా వైష్ణవ మాయ!

**"అహో హి వైష్ణవో ధర్మః చిత్రో వేంకట భూధరే!"**

–వేంకటాచలమున వైష్ణవ ధర్మము అతి చిత్రము, ఆశ్చర్యావహం. కాని భవిష్యోత్తర పురాణం బ్రహ్మోత్సవాలను వర్ణిస్తూ

**"జపద్భిర్వైదికాన్ మంత్రాన్ సహితశ్చ ద్విజోత్తమైః**
**చకారావభృథ స్నానం భగవానాది పురుషః**
**స్వామి పుష్కరిణీ తీర్థే సర్వలోకైక పావనే**
**అవతారదినే తస్మిన్ నక్షత్రే శ్రవణే ప్రగే" -14-63,64**

శ్రీనివాస భగవానుడే స్వామి పుష్కరిణిలో అవభృథ స్నానం చేసెనని వర్ణించింది. ఆ సమయంలోనే అర్చకులు, భక్తులందరూ పవిత్ర పుష్కరిణిలో స్నానం చేసి పవిత్రులవుతారు. తర్వాత స్వామివారు, దేవేరులు, చక్రత్తాళ్వారు ఊరేగింపుగా వచ్చి ఆలయంలో ప్రవేశిస్తారు.

అవభృథ స్నానానంతరం శ్రీనివాస భగవానుడ

**"శ్రవణంబునందు నా చక్రంబుతో గూడ**
**స్వామి పుష్కరిణిలో స్నానములను**
**సల్పువారలు పూర్వజన్మంబులను జేయు**
**పాపంబులను బాసి భాగ్యవంతు**
**లై యిహపరముల యందు సుఖింతురు**
**నా పల్కు నిజముగా నమ్ముడని"**
**-వేంకటాచల మాహాత్మ్యం – 2-133**

చేయెత్తి శ్రవణా నక్షత్రం నాడు సుదర్శన చక్రముతో కూడ స్వామి పుష్కరిణిలో స్నానము చేసినవారు పూర్వజన్మ పాపములను తొలగించుకొని, భాగ్యవంతులై ఇహ పర లోకములందు సుఖముగా జీవింతురు. నా మాట నిజము. నమ్ముడని శ్రీనివాసుడు భక్తులతో పలికెను.

**(సశేషము)**

# ఉగాదికి స్వాగతం

– కొఠా నిర్మల



**తెలుగు నెలల ప్రకారంగా మొట్టమొదటి పండుగ ఉగాది. చైత్రమాసం, శుక్లపక్షం, పాడ్యమి రోజున ఈ పండుగను జరుపుకుంటారు. ఉగాది పండుగ విశిష్టత ఏమిటంటే బ్రహ్మదేవుడు ఈరోజే సృష్టిని ఆరంభించాడని పురాణాలు తెలిపాయి. శ్రీమహావిష్ణువు మత్స్యావతారాన్ని ధరించి, సముద్ర గర్భంలోకి వెళ్ళి సోమకాసురుడనే రాక్షసుడు అపహరించిన వేదాలను తెచ్చి, బ్రహ్మదేవునికి ఇచ్చినది ఈరోజే. ఉగాది రోజున వరాహ మిహిరుడు పంచాగ్నిని రూపొందించాడట. ద్వాపర యుగంలో శ్రీకృష్ణుని అవతారం సమాప్తి చెందిన మర్నాటి నుంచే కలియుగం ఆరంభమయిందని నారద పురాణం వెల్లడించింది. అదే కలియుగానికి ప్రథమ దినం. శాలివాహనుడు చక్రవర్తిగా సింహాసనాన్ని అధిష్ఠించినది ఈరోజే నని చరిత్ర ఆధారాల ద్వారా తెలుస్తోంది. అప్పటినుంచే విక్రమార్క శకం ఆరంభమయిందని చరిత్ర స్పష్టం చేసింది.**

చాంద్రమాన ప్ర కారంగా కాలం 60 సంవత్సరాలుగ విభజింపబడింది. ఒక్కొక్క సంవత్సరానికి ఒక్కొక్క పేరు నిర్ణయింపబడింది. ఒక్క సంవత్సర కాలంలో 12 నెలలు ఉంటాయి. ఒక సంవత్సరం పూర్తవగానే మరో పేరుతో మరో సంవత్సరం ఆరంభమయ్యే మొదటి నెల, మొదటి పక్షం, మొదటి తిథి నాడు ఉగాది పండుగను జరుపుతారు. దీన్ని సంవత్సరాది అని కూడా అంటారు. సంవత్సరానికి ఆది రోజు కనుక ఆ పేరు వచ్చింది. ఆ రోజున బ్రహ్మముహూర్త కాలంలో తలకు నువ్వుల నూనెను పట్టించి, శరీరానికి నువ్వుల నూనెతో మృదువుగా మసాజ్ చేసి, సున్నిపిండితో నలుగు పెట్టుకుని తైలాభ్యంగనం చేయాలి. తాము తలస్నానం చేసే నీటిలో పుణ్యనదుల జలం ఉన్నట్లుగా, ''గంగేచ యమునేచైవ'' అన్న శ్లోకాన్ని పఠిస్తూ స్నానమాచరించాలి. నువ్వులనూనెతో అభ్యంగనస్నానం చేసినందువల్ల దారిద్ర్యం తొలగిపోయి, లక్ష్మీ కటాక్షాన్ని పొందుతారు.

అభ్యంగన స్నానం తరువాత నూతన వస్త్రాలను ధరించి, భగవంతునికి నమస్కరించాలి. గుమ్మాలకు మామిడి తోరణాలను కట్టి గడపను కడిగి, పసుపు కుంకుమలతో అలంకరించాలి. ఇంటి ప్రాంగణాన రంగవల్లులను తీర్చి దిద్దినట్లయితే అది లక్ష్మీదేవికి స్వాగత సందేశమవుతుంది. ఆ తర్వాత యథావిధిగా నిత్యపూజను ఆచరించి ఉగాది పచ్చడిని, ఫలాలను నైవేద్యంగా సమర్పించి ఆ తర్వాత ఇంటిల్లిపాది ఆ ఉగాది పచ్చడిని ప్రసాదంగా స్వీకరించాలి. ఉగాది పచ్చడి షడ్రుచులతో కూడి ఉంటుంది. తీపి, చేదు, పులుపు, కారం, వగరు, ఉప్పు కలిపి చేసేదే ఉగాది పచ్చడి. కొత్త చింతపండును నానేసి పిసికిన గుజ్జులో వేపపువ్వు, బెల్లంపొడి, సన్నగా తరిగిన మామిడి ముక్కలు, ఉప్పు, మిరియాలపొడి కలపాలి. కొంతమంది సన్నగా తరిగిన అరటిపండు ముక్కలు, ఇంకొందరు చెరుకుముక్కలు, కిస్‌మిస్ లాంటివి కలుపుతారు. అయితే ఉగాది పచ్చడిలో వీటి ప్రాధాన్యత లేదు. అదనపు రుచికోసం మాత్రమే ఉగాది పచ్చడిలో వీటిని కలుపుతారు. జీవితంలోని కష్ట సుఖాలను, చేదు అనుభవాలను ఉగాది పచ్చడితో పోలుస్తారు.

ఉగాది పచ్చడిలో కలిపే పదార్థాలలో ఔషధ గుణాలు ఉన్నాయి. కొత్త చింతపండు కఫాన్నీ, వాతాన్నీ పోగొడుతుంది. కొత్తబెల్లం ఆకలిని వృద్ధి చేస్తుంది. వేపపువ్వు ఉదరంలోని క్రిములను నిర్మూలిస్తుంది. రోగ నిరోధక శక్తిని పెంపొందిస్తుంది. మామిడి ముక్కలు లాలాజలం ఊరేలా

చేస్తాయి. జీర్ణక్రియ సవ్యంగా జరిగేలా చేస్తాయి. మిరియాల పొడి కఫాన్ని కరిగించి, శ్లేష్మాన్ని తొలగిస్తుంది. ఉప్పు ఎ ముకలకు బలాన్ని చేకూరుస్తుంది. అరటిపండు తక్షణ శక్తిని ప్రసాదిస్తుంది. ఈ విధంగా ఉగాది పచ్చడిలో కలిపే పదార్థాలన్నీ ఆరోగ్యానికి మేలు చేకూరుస్తాయి. ఉగాది పండుగనాడు సాధారణంగా బొబ్బట్లు, మామిడికాయతో చేసిన పులిహోరలను పిండివంటలుగా చేస్తారు. వారివారి ఇష్టాలను బట్టి గారెలు, బజ్జీలు, దధ్యోధనం, ఆలూబోండాలు లాంటివి చేస్తారు. కుటుంబ సభ్యులతో కలిసి విందుభోజనం చేయడం ఒక మంచి అనుభూతి. మిగిలిన రోజుల్లో వారి వారి ఉద్యోగ సమయాలకు అనుగుణంగా, వంటరిగా భోజనం చేయవలసి వస్తుంది.

ఉగాది రోజున పంచాంగం వినడం విధాయకం. పంచాంగం అంటే అయిదు అంగములు. తిథి, వారం, నక్షత్రం, యోగం, కరణం అనే అయిదు అంగముల కలయికే పంచాంగం. వాటి నన్నిటిని తెలియజేస్తుంది పంచాంగం. ఉగాది నాడు పంచాంగానికి పూజ చేస్తారు. ఆ సంవత్సరంలో జరిగే సంఘటనలు, వాతావరణ పరిస్థితులు, శుభకార్య ముహూర్తాలు, గ్రహణాలు, పాపపరిహారాలు లాంటి ఎన్నెన్నో విషయాలు పంచాంగంలో లిఖించబడి ఉంటాయి. వేదపండితులు దేవాలయాల్లో పంచాంగాన్ని ఉగాదినాడు భక్తులకు వినిపిస్తారు. రేడియోలో, టెలివిజన్ లో కూడా పంచాంగాన్ని వినిపిస్తున్నారు. ఏ రాశి వారికి ఆ సంవత్సరమంతా ఏ విధంగా ఉంటుందో ఏయే ఫలితాలు లభిస్తాయో కూడా పండితులు తెలియజేస్తారు. 'సర్వేజనా సుఖినోభవంతు' అని అందరినీ దీవిస్తారు.

# ఉగాది పచ్చడి - ఆయుర్వేదం

- అయ్యల సోమయాజుల సుబ్రహ్మణ్యం

సంవత్సరం మొదటి రోజున పొద్దున్నే వేపపూవు, బెల్లం, మామిడిపిందెలు, మిరియాలు, లవణము, కొంచెం నెయ్యి కలిపిన ప్రసాదాన్ని తింటే ఆ ఏడాదంతా సౌఖ్యదాయకంగా ఉంటుంది. ఇది పెద్దలు చెప్పిన మాటలు.

ఆధునిక వైద్యశాస్త్రం విటమిన్లు, ఖనిజాలు, లవణాల్లాంటి పోషకాల తూకాన్ని బట్టి ఆహార ద్రవ్యాల పోషక విలువలని లెక్క కడుతుంది. ఇది ఒక పద్ధతి. ఆరు రుచులసిద్ధాంతాన్నిఅనుసరించిఆయుర్వేదశాస్త్రం (భైషజ్య రత్నావళి) తీపి, పులుపు, ఉప్పు, కారం, వగరు, చేదు ఈ ఆరు రుచులూ ఉంటేనే అతి పోషక ఆహారమవుతుందని చెబుతుంది. ఈ వైద్యరహస్యాన్ని "ఉగాది ప్రసాదం" గుర్తు చేస్తోంది. ఆంగ్లేయ విధానంలో పోషకాల కొలతలు, ఆయుర్వేదీయ విధానంలో ఆరు రుచుల కొలతలని పోల్చి చూస్తే రెండూ సమానమే. శాకాహార పదార్థాలలో కార్బొహైడ్రేట్లు తీపి రుచిని అందిస్తాయి. అలాగే ఇతర రుచులకు వాటిలోని విటమిన్లు, ఖనిజాలు, లవణాలు వగైరా ఆయా ద్రవ్యాలకు ఆ రుచులని ఇస్తున్నాయి. మన భోజనంలోనూ, భోజన పదార్థాలలోనూ ఆరు రుచులూ ఉండేలా చూసుకుంటేనే మనం షడ్రసోపేతమైన ధనిక పోషక భోజనం చేసినవారమవుతాం.

ఆరు రుచులు తగు నిష్పత్తిలో ఉంటేనే అది షడ్రసోపేతమైన భోజనం. పులిహోరనే తీసుకోండి. అందులో కేవలం పులుపు, ఉప్పు, కారం మాత్రమే కలిపితే అది ఆరోగ్యానికి చెడు చేస్తుంది. వగరు చేదు రుచుల కోసం కొద్దిగా ఆవపిండిని, మెంతిపిండిని, తీపి కోసం బెల్లాన్ని కలిపితే ఆ పులిహోర రుచి పెరగటమే కాక ఆరోగ్యాన్నిచ్చేదిలా ఉంటుంది. ఆరు రుచులు లేకుండా కేవలం కారం, కేవలం పులుపు, కేవలం తీపి ఇలా తినవద్దని ఉగాది ప్రసాదం మనకు సూచిస్తోంది.

అసలు మన వంటిల్లు తీసుకుంటే అందులో మన ఆడవాళ్ళు ప్రతిరోజూ వాడే "పోపుల డబ్బా" మహా మహా ఔషధాల గని. మెంతులు, ఆవాలు, వాము, జీలకర్ర, మిరియాలు ప్రత్యేక ఔషధాల విలువలు గలవి. వెల్లుల్లి, అల్లం లేదా శొంఠి, పసుపు ఇవన్నీ విరివిగా ఆయుర్వేద ఔషధాల మూలకాలు. ముడిపదార్థాలు. ఇక నెయ్యి. సోరియాసిస్ మొదలగు కఠిన రోగాలకు చక్కటి ఔషధము.

ఏడాది పొడవునా వేపపూలను అన్నంతో తినటానికి ప్రభావంతమైన ఒక ఔషధము ఉంది. దానిని మనమే ఇంటిలో తయారు చేసుకోవచ్చు. 1 చెంచా ఇంగువ 2 చెంచాల అల్లం 4 చెంచాల మిరియాల పొడి 8 చెంచాల జీలకర్ర 16 చెంచాల పసుపు 32 చెంచాల ధనియాల పొడి అంతే కొలతతో వేపపొడి (ఎండబెట్టినది తీసుకోవాలి) వీటికి తగినంత ఉప్పు చేర్చిన కారము. రుచిగా ఉంటుంది. శరీరంలో విషదోషాలను పోగొడుతుంది. జఠరాగ్నిని అభివృద్ధి చేయును. శక్తిదాయకంగా ఉంటుంది. చేదురుచి ప్రాధాన్యతని గుర్తించగలిగితే ఉగాదులన్నీ ఉషస్సులే.

# త్రివక్రం

**- సంపత్**

మనసులో అనుకునేది ఒకటి...!

నోటితో చెప్పేది ఒకటి...!!

శరీరంతో చేసేది మరొకటి....!!!

ఈ మూడు వంకరలు తీసివేయడమే కుబ్జతనాన్ని తొలగించడం.

ఇవి పోయి ఏకత్వం వచ్చేసి, ఈశ్వర స్పర్శ కలిగినవాడు అప్పటి నుంచి ఇక ఎప్పుడూ ఈశ్వర సేవే కావాలని కోరుకుంటాడు. అంతరంగం, ఆలోచన, ప్రవర్తనల్లో ఏదో ఒకదానిలో మనుషులు ఎప్పుడూ పొట్టివారే.

ఏదో ఒక లోపం లేకుండా సాధారణంగా ఏ మనిషీ ఉండడు. అలాంటి మరుగుజ్జుతనాన్ని కుబ్జత్వం అంటారు.

ఆధ్యాత్మికత, జ్ఞానవృద్ధి, గురుకృప, భగవదనుగ్రహం తదితరాల ఆలంబనతో మనిషి వాటిని దాటి త్రివిక్రముడవుతాడు. వాటిలో ఏది కావాలన్నా తపన, తాదాత్మ్యత, నిర్మల భక్తి, నిబద్ధత కలిగిఉండాలి. ఈ విషయాన్ని వివరించేదే భాగవతంలోని 'కుబ్జ' కథ.

కపటబుద్ధితో ధనుర్యాగానికి బలరామ కృష్ణులను ఆహ్వానించాడు కంసుడు. మధురకు బయలుదేరారు అన్నదమ్ములు. దారిలో వారికి ఒక దివ్యాంగురాలు ఎదురైంది. ఆమెకు కృష్ణుణ్ని నఖశిఖ పర్యంతం చూడాలని కోరిక. ఆయన మనోహరమైన చిరునవ్వులొలికే మోమును చూడాలని, వీలైతే తాను సిద్ధం చేసిన శ్రీగంధాన్ని ఆయన మేనుకు అద్ది ఆ మోహనరూపాన్ని చూడాలని కోరిక. కానీ శరీరం సహకరించని పరిస్థితి ఆమెది. అదీకాక ఆమె కంసుడికి దాసి. ఆశ నిరాశల మధ్య ఊగిసలాడుతూ కృష్ణుడు వచ్చే దారిలో కనీ కనిపించకుండా తచ్చాడుతోంది. గమనించిన కృష్ణుడు ఆమెమీద జాలిపడ్డాడు. కరుణాసముద్రుడయ్యాడు. 'సుందరీ' అని సంబోధించాడు.

ఆ పిలుపు విన్న ఆమె ఆశ్చర్యపోయింది.

కళ్ల వెంట అశ్రుధారలు కారుతుండగా...గద్గద స్వరంతో 'స్వామీ! నువ్వు కూడా నన్ను హేళన చేస్తున్నావా?' అని అడిగింది.

'నేను గంధపు చెక్కలమీద గంధం తీసి, పరిమళ ద్రవ్యాలు అద్ది కంసమహారాజుకు ఇస్తూ ఉంటాను. అసలు అందం అంటే ఏమిటో ఇవాళ నీలో చూశాను. నీవు ఈ గంధాన్ని రాసుకుంటే ఈ గంధానికే అందం వస్తుంది. ఈశ్వరా, కొద్దిగా ఈ గంధం రాసుకుంటావా? నువ్వు నన్ను పిలిచిన పిలుపుతో వచ్చిన ధైర్యంతో ఇలా అడుగుతున్నాను' అంది.

ఆమె కోరికను మన్నించాడు కృష్ణుడు. ప్రతిగా ఆమె పాదాలను తన కుడిపాదంతో తొక్కి, తనచేతి రెండు వేళ్లను కుబ్జ గడ్డం కింద పెట్టి పైకి ఎత్తాడు. ఆ చర్యతో ఆమె వంకరలు తొలగిపోయి సౌందర్యరాశిగా మారిపోయింది.

అప్పుడు ఆమె కృష్ణుడితో 'నాకు ఇంత సౌందర్యాన్నిచ్చావు. నేను నీకు ఇచ్చే ఆనంద సౌఖ్యాలను అనుభవించి నన్ను తరింపజెయ్యి. అందుకోసం నీవు ఒకసారి మా ఇంటికి రా' అని అడుగుతూ ఆయన ఉత్తరీయం పట్టుకొని లాగింది.

అప్పుడు కృష్ణపరమాత్మ 'నేను పాంథుడిని. ఎప్పుడైనా, ఎక్కడికైనా వెళ్ళగలను. కాబట్టి తప్పకుండా నేను మీ ఇంటికి వస్తాను. కాని ఇప్పుడు కాదు. కంస సంహారం అయిన తరవాత' అన్నాడు.

త్రివక్రం అంటే... మనసులో అనుకున్నది ఒకటి, నోటితో చెప్పేది ఒకటి, శరీరంతో చేసేది మరొకటి. ఈ మూడు వంకరలు తీసివేయడమే కుబ్జతనాన్ని తొలగించడం.

అవి పోయి ఏకత్వం వచ్చేసి, ఈశ్వర స్పర్శ కలిగినవాడు అప్పటి నుంచి ఇక ఎప్పుడూ ఈశ్వర సేవే కావాలని కోరుకుంటాడు. త్రివక్రకు తన వంకరలు పోగానే ఆవిడ ఈశ్వరుడి కైంకర్యం (సేవ) చేయాలని కలిగిన కోరికతోనే అలా అడిగింది. అందుకోసం తన ఇంటికి రమ్మంటోంది.

పరమాత్మ కంసవధ అయిన తరవాత వస్తానంటున్నాడు. అంటే అజ్ఞాన సంహారం పూర్తయిపోవాలి. ఇంకా నీలో అజ్ఞానం ఏమైనా మిగిలిఉంటే అది సమసిపోవాలి' అని ఆ మాటకు అర్థం.

ఆయన 'నేను పాంథుడిని' అనడంలోనూ అంతరార్థముంది. పాంథుడు (బాటసారి) అంటే ఇల్లులేని వాడని అర్థం. దాని భావం 'ఆత్మ స్వరూపుణ్ని' అని. ఆత్మకు ఇల్లేమిటి? అది అంతటా పరివ్యాప్తమై ఉంటుంది. అది అప్పుడప్పుడు ఏదో ఒక ఇంట్లోకి (శరీరంలోకి) వచ్చి వెళ్ళిపోతూ ఉంటుంది అని భావం.

ఆ ఆత్మ స్వరూపుడితో తాదాత్మ్యం చెందాలంటే మానసిక వికృతి పోవాలి. ఇక్కడ జరిగింది అదే. కుబ్జ సౌందర్యవతిగా మారడం అంటే...పరమాత్మ సంపర్కంతో మానవాళి స్వస్వరూపాన్ని పొందడమేనని ఇందులోని అంతరార్థం.

(గత సంచిక తరువాయి)




## 105. ఓం సువర్ణముఖరీ స్నాత మనుజాభీష్ట దాయినే నమః

**సువర్ణముఖి నదిలో స్నానము చేసిన వారికి అభీష్టములను అనుగ్రహించు వేంకటేశునకు నమస్కారము.**

దక్షిణ దేశమున అగస్త్య పర్వతమున తన ఆశ్రమమున నివసించుచున్న అగస్త్యుని ఆకాశవాణి నది లేని దేశమున లోకహితము కోరి ఒక మహానదిని అవతరింప చేయమని పలికింది. అంతట అగస్త్యమహర్షి నదిని అవతరింపజేయుటకై తీవ్రమైన తపస్సు చేశాడు. అతని తపస్సునకు సంతుష్టుడైన బ్రహ్మదేవుడు ఎదుట ప్రత్యక్షమై వరము కోరుకొమ్మని పలికినాడు. అగస్త్యుడు లేచి బ్రహ్మకు నమస్కరించి దేవా! ఈ దేశమున భూమిని పవిత్రమొనరించుటకు, ప్రజలను రక్షించుటకు సమర్థమైన మహానదిని అనుగ్రహింపుమని కోరినాడు. అంత బ్రహ్మదేవుడు ఆకాశగంగను పిలిచి లోకోపకారమునకై ఈ దేశమున నీ అంశచే నదిని అవతరింపజేయుము. ఈ అగస్త్య పర్వతము నుండి అగస్త్యుడు చూపు మార్గమున వెళ్ళుము అని పలికి అంతర్హితుడైనాడు.

పిమ్మట ఆకాశగంగ మునివరా! నా అంశమున పుట్టిన ఈ నది ఏ మార్గమున వెళ్ళవలెనని అడిగింది. అందుకు అగస్త్యుడు కళ్యాణీ! నీ నడకకు తగినట్లు నీకు ముందుగా వెళ్ళుచు నీకు మార్గమును చూపించెదను. నీవు నన్ను అనుసరించుమని చెప్పి నదికి మార్గము చూపిస్తూ ముందు నడుచుచున్నాడు. నది అట్లు అగస్త్యుని వెంబడించి వెళ్ళుచుండగా దేవతలు, ప్రజలు సంతోషించారు. అగస్త్యుని కీర్తించారు. అప్పుడు వాయుదేవుడు ఈ నది లోకుల అదృష్టముచే దిగంతరాళములను ప్రతిధ్వనింప జేయుచు బంగారము వలె అగస్త్యునిచే కొనిరాబడుటచే సువర్ణముఖరీ అను పేరుతో ప్రసిద్ధమగును. ఈ నది సకల నదులలో శ్రేష్ఠమైనది. అందరిచే సేవింప దగినది. ఇది బ్రహ్మదేవుని ఆజ్ఞ యని వెల్లడించాడు.

నిజానికి ఈ నది యందలి ఇసుక బంగారము వలె ఉండుటచే నదికి ఇరువైపులా నున్న గట్ల మీద మొగలి పొదలు ఉండుటచే, మొగలి రేకులు బంగారు రేకుల వలె నుండుటచే తెలుగులో ఈ నదికి మొగిలేరు అనే పేరు కలిగింది. దాని సంస్కృతీకరణమే సువర్ణముఖరి.

సువర్ణముఖి నది శ్రీకాళహస్తి దగ్గర ఉత్తర వాహినియై, పిమ్మట తూర్పుగా ప్రవహించి పూర్వసముద్రములో — బంగాళాఖాతములో కలిసింది.

శంఖరాజు చేయు తపస్సుకు సంప్రీతుడైన నారాయణుడు వేంకటాచలమున స్వామిపుష్కరిణీ తీరమున ప్రత్యక్షమగునని తెలిసికొని అగస్త్య మహర్షి వేంకటాద్రికి చేరినాడు. ఒక శుభదినమున శ్రీమన్నారాయణుడు ప్రత్యక్షమైనాడు. భగవంతుని దర్శించుటకు బ్రహ్మ, శంకరాది దేవతలు, సనకాది యోగులు మొదలగువారు స్వామిపుష్కరిణీ తీరము చేరినారు. అగస్త్యాదులు భగవంతుని దర్శించి స్తోత్రము చేశారు. అంత బ్రహ్మ, శంకరుల కోరికలను అనుగ్రహించిన తర్వాత నారాయణుడు అగస్త్యుని చూచి మహర్షీ నీ తపస్సుకు లోకహిత కార్యములకు ప్రీతుడనైనాను. నీ కోరిక ఏమి? అని అడిగినాడు. అంతట అగస్త్యుడు నీ అనుగ్రహముచే నా కోరికలన్నియు ఈడేరినవి. అయినను నేను లోక హితము కోరి అవతరింప చేసిన సువర్ణముఖి నది వేంకటాద్రి

సమీపముననే ప్రవహించుచున్నది. కనుక సువర్ణముఖరీ నదిలో స్నానము చేసి, వేంకటాచలమున నున్న నిన్ను సేవించు వారికి ఇహ పర సుఖములను అనుగ్రహించుము. ఈ పర్వతమున సదా నివసించియుండి నిన్ను ప్రార్థించు వారి అభీష్టములను నెరవేర్చుచుండుము. ఇదియే నా కోరిక అని చెప్పినాడు. అందుకు శ్రీమన్నారాయణుడు నీవు కోరినదంతయు సఫలమగును అని చెప్పినాడు. అందుకు శ్రీమన్నారాయణుడు నీవు కోరిన దంతయు విఫలమగును అని పలికి బ్రహ్మాది దేవతలను, అగస్త్య శంఖ రాజులను వీడి వారిచే స్తుతింపబడుచుండగా అంతర్ధానం పొందినాడు.

ఇట్లు అగస్త్య మహర్షి తను అవతరింపజేసిన సువర్ణముఖి నదిలో స్నానము చేసి, వేంకటాచలపతిని సేవించినవారు ఇహ పర సుఖములను, అభీష్టములను పొందునట్లు శ్రీమన్నారాయణుని నుండి వరమును పొంది చరితార్థుడైనాడు. అగస్త్య మహర్షి చేసిన కార్యములన్నీ లోక జనహితము కోరి చేసినవే. ఈ పరోపకార గుణము ఆదర్శప్రాయము గదా.

## 106. ఓం హలాయుధ జగత్తీర్థ సమస్త ఫలదాయినే నమః

**హలాయుధ తీర్థములో స్నానము చేసినవారికి జగత్తులోని సమస్త తీర్థములందు స్నానము చేయుటచే గలుగు ఫలమును అనుగ్రహించు వేంకటేశునకు నమస్కారము.**

హలాయుధుడు (నాగలి ఆయుధముగా కలవాడు) అనబడు బలరాముడు తీర్థయాత్రలు చేయుచు వచ్చి స్వామిపుష్కరిణిలో స్నానము చేసి వేంకటేశుని దర్శించి స్తుతించినాడు. ఆ సమయమున బలరామునికి వేంకటేశుడు జగత్తులోని సమస్త తీర్థములందు స్నానము చేయుటచే లభించు ఫలమును అనుగ్రహించినాడని అర్థము చెప్పవచ్చును.

తిరుమలలో గల భక్తి వైరాగ్యప్రదములగు పుణ్యతీర్థములలో హలాయుధ తీర్థము ఒకటి ఉంది. బలరాముడు తీర్థయాత్రలు చేయుచు వేంకటాద్రికి వచ్చి ఒక పుణ్యతీర్థమున స్నానము చేసి పవిత్రుడై వేంకటేశుని దర్శించి, స్తుతించి అభీష్టములను పొందినాడు. బలరాముడు స్నానము చేసిన తీర్థమునకు హలాయుధ తీర్థమను పేరు కలిగింది. ఆ తీర్థములో స్నానము చేసిన వారికి వేంకటేశుడు ప్రపంచములోని సర్వ పుణ్య తీర్థములలో స్నానము చేసిన కలుగు ఫలమును అనుగ్రహించుచున్నాడు.



శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం సంకల్పించిన మొత్తం 111 శ్రీనివాస కళ్యాణాలలో భాగంగా గత నెలలో నిర్వహించిన కళ్యాణం

## 18వ కళ్యాణం

**13-03-2022 ఆదివారం రోజున ఎర్రవెల్లి గ్రామం, మార్కూర్ మండలం, సిద్దిపేట జిల్లాలో శ్రీమాన్ అమ్మన అశోక్ రెడ్డి మరియు విజయలక్ష్మి దంపతుల ఆధ్వర్యములో అంగరంగ వైభోగంగా జరిగింది. వైఖానస బ్రాహ్మణోత్తములచే వైఖానసాగమోక్తంగా అత్యంత రమణీయంగా జరిగింది.**

(మేము రెండున్నర నెలలు అంటే 18-06-2022 వరకు అమెరికా వెళుచున్న కారణంగా అంతవరకు కళ్యాణాలు ఉండవు)

**శ్రీ వేంకటేశ్వర పాదసేవకుడు**
**పుల్లగూర్ల సాయిరెడ్డి**
**(గోవింద దాసు)**



# సారంగపాణి ఆలయం – కుంభకోణం

- ఇలపావులూరి వేంకటేశ్వర్లు

ఆలయాల రాష్ట్రంలో ఆలయాల నగరంగా పేరొందినది కుంభకో ణం . ఎన్నో ప్రాచీన, ప్రసిద్ధ, పవిత్ర, అద్భుత ఆలయా లు  ఉన్నాయి. కుంభకోణం లోను చుట్టుపక్కల వామ న  పురాణం, భవిష్యోత్తర పురాణం, కుంభకోణ మహత్త్వాలలో కుంభకోణం గురించి సవివరంగా తె లు పబడినది. కావేరి మరియు అరసలార్ నదుల మధ్య ఉన్న కుంభకోణాన్ని పెరుమాళ్ యొక్క మధ్య విశ్రాంతి స్థలం గా పేర్కొంటారు. పైన ఉన్న శ్రీరంగం ప్రధాన విశ్రాంతి క్షేత్రంగాను, క్రింద ఉన్న తిరుకన్నాపురం మరో విశ్రాంతి క్షేత్రంగాను పిలవబడుతున్నాయి. కుంభకోణాన్ని పంచ క్రోశ యాత్రా స్థలం అని కూడా అంటారు.

ఎందుకనే దానికి సంభందించిన పురాణ గాథ భవిష్యోత్తర పురాణం ఇలా వివరిస్తోంది.

జలప్రళయం సంభవిస్తోందని తెలుసుకొన్న విధాత పునః సృష్టికి ఏర్పాట్లు మొదలుపెట్టారు.

అన్ని పవిత్ర ప్రదేశాలనుండి మట్టిని సేకరించి దానికి అమృతం కలిపి ఒక కుంభాన్ని తయారుచేసి అందులో అమృతాన్ని పోసి మేరు పర్వతం పైన ఉంచారు. జల ప్రవాహ వేగానికి ఆ కుండ నీటిలో తేలుతూ ఈ ప్రాంతానికి వచ్చేసరికి కొద్దిగా కదిలినది.

ఆ కదలిక వలన కొంత అమృతం తొణికి చుట్టుపక్కల పడినది. కుంభం మూతి నుండి అమృతం వొలొకిన ప్రదేశంగా కుంభకోణం అన్న పేరొచ్చినది. అలా పడిన ప్రతి ప్రదేశం ఒక దివ్య ధామంగా రూపుదిద్దుకొన్నది.

వాటిల్లో శైవ వైష్ణవ ఆలయాలు రెండూ ఉండటం వలన పంచ క్రోశ యాత్రా స్థలంగా ప్రఖ్యాతి పొందినది. అదే విధంగా కావేరీ నదీ తీరంలోని పంచ రంగ క్షేత్రాలలో ఈ ఆలయాన్ని ఒకటిగా పేర్కొంటారు.

ప్రత్యక్ష నారాయణుడు శ్రీ మహా విష్ణు దర్శనం కొరకు తపమాచరించినందున కుంభకోణం భాస్కర క్షేత్రం.

అదే విధంగా హేమ మహర్షి తపో దీక్షకు సంతసించిన నారాయణుడు సాక్షాత్కరించి ఆయనకు ఇక్కడ తన సేవా భాగ్యం ప్రసాదించడమే కాకుండా ఆయన కుమార్తె మహాలక్ష్మి అవతారమైన కోమలవల్లి ని వివాహమాడారు. శ్రీ హేమ ఋషి ప్రాంగణంలోని ఉపాలయంలో కొలువై దర్శనమిస్తారు. ఆ కారణంగా కుంభకోణం కళ్యాణపురం కూడా !

ఊరి మధ్యలో సువిశాల ప్రాంగణంలో ఉన్నఆలయం అద్భుత శిల్పాలకు నిలయం.

నూట నలభై ఏడు అడుగుల ఎత్తు గల పదకొండు అంతస్థుల రాజ గోపురం రామాయణ, భాగవత గాధలకు సంభందించిన సుందర శిల్పాలతో నిండివుంటుంది. గర్భాలయం ఏనుగుల చేత లాగబడుతున్న రధం ఆకారంలో ఉంటుంది.మరో ప్రత్యేకత ఏమిటంటే ఆలయం లోనికి ప్రవేశించడానికి రెండు ద్వారాలుంటాయి. ఒకటిఉత్తరాయణానికి రెండవది దక్షిణాయనానికి తెరుస్తారు. గర్భాలయంలో మూలవిరాట్టు శ్రీ అరవముదన్ పెరుమాళ్ సగం శయనించిన భంగిమలో కొలువైవుంటారు. మూలవిరాట్ నుదుటన త్రినేత్రునికి ఉన్నట్లు మూడో నేత్రం ఉండటం విశేషంగా చెప్పుకోవాలి.

పన్నెండు అడుగుల దివ్యాలంకరణ మూర్తి కన్నుల పండుగగా ఐదు తలల ఆదిశేషువు పడగల క్రింద దర్శనమిస్తారు.

గర్భాలయంలో స్వామి వారికి మొక్కుతున్న ఎందరో దేవీ దేవతల, మహర్షుల మూర్తులు కూడా కనపడతాయి.

అమ్మవారు శ్రీ కోమలవల్లి తాయారు విడిగా సన్నిధిలో కొలువుతీరి వుంటారు.

ప్రతి నిత్యం ఎన్నో సేవలు నియమంగా జరుగుతాయి. నియమంగా ఆరు పూజలు రోజులో నిర్వహిస్తారు. సంవత్సరంలో పన్నెండు ఉత్సవాలు అనగా నెలకి ఒకటి చొప్పున జరుపుతారు. చైత్ర మాసంలో ఇక్కడ జరిగే రధోత్సవం చాలా ప్రసిద్ధి.



ముఖ్యంగా కేతు గ్రహ దోషం కలిగి ఉన్నవారు విద్యాభివృద్ధి, సంతానాభివృద్ధి, ఆర్ధికాభివృద్ధి కొరకు శ్రీ సారంగపాణి పెరుమాళ్ ని ఆరాధిస్తారు. చోళ, పాండ్య, విజయనగర, నాయక రాజ వంశాల వారు ఆలయ అభ్యున్నతికి తమ వంతు సేవ చేసారని తెలుస్తోంది.

నూట ఎనిమిది శ్రీ వైష్ణవ దివ్య దేశాలలో ఒకటిగా పేరొందిన ఈ ఆలయంలోని మూల విరాట్టు శ్రీ అరవముదన్ పెరుమాళ్ మీద అలానే ఉత్సవ మూర్తి శ్రీ సారంగ పాణి మీద శ్రీ పెరియాళ్వార్, శ్రీ భోతత్తి ఆళ్వార్, శ్రీ తిరుమలై సాయి ఆళ్వార్, శ్రీ పై ఆళ్వార్, శ్రీ నమ్మాళ్వార్, శ్రీ తిరుమంగై ఆళ్వార్ మరియు శ్రీ ఆండాళ్ కలిసి యాభై ఒక్క పాశురాలు గానం చేసారు.

ఇక్కడి కోనేరు, రధం, ఆలయం, శ్రీ వారు ప్రతి ఒక్కటి ఒక విశేషమే!

కుంభకోణానికి చెన్నై నుండి నేరుగా రైలు మరియు బస్సులు లభిస్తాయి. తంజావూరు, తిరుచ్చి, మదురై పట్టణాల నుండి కూడా సులభంగా చేరుకోవచ్చును. స్థానికంగా ఎన్నో ప్రసిద్ధ ఆలయాలున్నాయి. అన్నీ దర్శనీయాలే ! నగరంలోని మహామాగం పుష్కరిణికి పన్నెండు సంవత్సరాలకు ఒకసారి జీవ నదులకు నిర్వహించే మాదిరి పుష్కరాలను నిర్వహిస్తారు. కాకపోతే అవి ఒక రోజు మాత్రమే ! స్థానికంగా అన్ని సౌకర్యాలు యాత్రీకులకు అందుబాటు ధరలలో లభ్యం అవుతాయి.

**!! జై శ్రీ మన్నారాయణ !!**

# శబరి

- శ్రీమాన్ ఫణిహారము రంగనాథ్

**భౌగోళికంగా శబరి అంటే గోదావరికి ఉపనది. ఆధ్యాత్మికంగా మాత్రం శబరి అంటే మనకు అనన్య సామాన్య ఆచార్య కైంకర్యనిష్ఠురాలిగా సుపరిచితం.**

రా మాయణంలోని శబరి పాత్ర చిన్నదే అయినా చాలా ప్రాముఖ్యత కలిగినది. అంతే కాకుండా ఎంతో ప్రాచుర్యం కూడా పొందింది. శబరి ఒక గిరిజన మహిళ. ఆమె మాతంగముని శిష్యురాలు ఆచార్యసేవ చేసుకుంటూ ఆశ్రమంలో ఉండేది. శబరి చిన్నప్పటి నుండి పంపానది సమీపంలో ఉండే మతంగ ముని ఆశ్రమంలోనే ఉండేది. ఆ ఆశ్రమం తప్ప ఆమెకు మరో లోకం తెలియదు. ఆచార్యుల ముఖతః రామావతారం విషయము, సీతా కల్యాణ విషయము, రామవనవాసకథనము విన్నది. రాములవారిని సేవించాలని మతంగమహర్షి ఆశపడ్డారు. కానీ వారి ఆయుస్సు తీరి వారు ఈ లోకాన్ని వీడే సమయం ఆసన్నమైందని వారికి తెలిసిపోయింది. ఆ కారణం చేత వారు తమ శిష్యురాలైన శబరికి రాములవారికి ఆతిథ్యమిచ్చే కార్యం ఒప్పగించి వారు ఈ లోకాన్ని విడిచిపెట్టారు. అప్పటినుండి శబరి రాములవారి రాక కోసం ఎదురుచూస్తూ కాలం గడుపుతోంది.

తన ఆచార్యులైన మాతంగ ముని ఆజ్ఞమేరకు ఎప్పటికైనా రాములవారు వస్తే ఆతిథ్యమీయాలని రాములవారి రాకకై వేచి చూసింది. ప్రతిరోజు వేకువ ఝామునే లేచి ఆశ్రమ పరిసరాలను శుభ్రం చేసేది. అలికి ముగ్గులతో అలంకరించేది. నదిలో స్నానం చేసి రాములవారి పాదాలు కడగడానికి కడవతో నీళ్ళు తెచ్చేది. పాదపూజ కోసం పూలు , రాములవారు ఆరగించడానికి పళ్లు సేకరించి తెచ్చేది. ఇలా ప్రతి రోజు చేస్తూనే ఉండేది. ప్రతిరోజూ రాములవారొస్తున్నట్లు ఎదురు చూసేది. రోజులూ నెలలూ సంవత్సరాలూ విసుగూ విరామం లేకుండా అలా ఎదురు చూపులతోనే గడిపింది.

అలా శబరి రాములవారి కోసం దాదాపు పదమూడేళ్ల పాటు ఎదురు చూస్తుంది. కబంధుడి ద్వారా రాములవారికి శబరి గురించి తెలిసింది. శబరిని కలవాలని బయల్దేరాడు. ఆశ్రమానికి వచ్చిన శ్రీరామచంద్రమూర్తికి శబరి తన ఆచార్యుని రామానుజ ప్రకారం అర్ఘ్యపాద్యాదులు సమర్పించి మంచి రుచికరమైన పళ్ళను నివేదించింది. ఇక్కడ ఒక విషయం వివరణ అవసరం.



పళ్లను రుచి చూసి రామునికిచ్చింది. ఆ పళ్లను రాముడు ప్రేమగా సేవించాడు.

ఇది అందరికీ తెలిసిన కథ. వాల్మీకి రామాయణంలో శబరి ఎంగిలి పళ్లను రాముడు తిన్నట్లు రాయలేదని అనేకమంది పండితుల భావిస్తున్నారు.

ఒక్కో చెట్టు పళ్లు ఎలా ఉన్నాయో రుచి చూసి పుల్లగా లేని , మధురంగా ఉన్న చెట్ల పళ్లనే రామునికిచ్చింది. కానీ , ఎంగిలి పళ్లు కాదని పురాణ కథనం.

కానీ రాముడు ఎంగిలి పళ్లు తిన్నట్లుగానే జానపదులు ఇప్పటికీ అనుకోవడం, సినిమాల్లో, టి.విల్లో కూడా ఆ విధంగానే చిత్రీకరించడం వలన ఎంగిలి పళ్ల విషయం మిక్కిలిగా ప్రచారం అయింది.

శబరి ఒక ప్రత్యేక వ్యక్తి. మన సంప్రదాయంలో చెప్పుకునే మధురకవినిష్టకు ఆద్యురాలు ఆమె. మతంగమహర్షి రామదర్శనానికై అనేక వేల సంవత్సరాలు ఎదురుచూశారు. కానీ వారికి భూమిపై కాలం ఆసన్నమైనందున రామసందర్శనం చేయలేమని, రాములవారికి ఆతిథ్యమీయలేమని, తెలుసుకుని ఆ బృహత్కార్యాన్ని తమ శిష్యురాలైన శబరజాతి వనిత – శబరికి అప్పగించారు. ఆమె రామసందర్శనార్థం తన ఆచార్యాజ్ఞగా 13 సంవత్సరాలు ఎదురుచూసింది. రామచంద్రుడు లక్ష్మణస్వామితో కూడి వేంచేసి నప్పుడు ఆమె తన ఆచార్యకైంకర్యంగా ఆ పరంధామునికి ఆతిథ్యమిచ్చి తాను ప్రతిరోజు సేకరించే రుచికరమైన పళ్ళను వారికి నివేదించింది. అవి ఆమె కొరికి ఎంగిలిచేసిన పళ్ళు కాదు. ఆమె ఆయా చెట్లు ఫలాలు రుచికరంగా వుంటాయని గుర్తించి ఆయా చెట్లు ఫలాలను

ప్రతిరోజు సేకరించి ఏ క్షణానైనా రామచంద్రుడు వేంచేస్తే వారికి తమ ఆచార్యుల ఆజ్ఞ మేరకు ఆతిథ్యం లో లోపం రాకుండా ఉండేవిధంగా ఏర్పాటుచేసింది. పరంధాముడైన రామచంద్రుని ప్రభావం బాగుగా తెలిసినదైనప్పటికీ ఆయనను సేవించి ఏదీ కోరని ఆచార్యనిష్ఠురాలు ఆమె. మధురకవులు..తేవుమత్తరియేన్ కురుగూర్నమ్బి....అని తమ ఆచార్యులు తప్ప వేరు దైవము నెరుగమని చెప్పుకున్నప్పటికీ ఆచార్యముఖోల్లాసానికై తమ ఆచార్యులకిష్టమైన ఉలూఖలబంధన వృత్తాంతాన్ని తమ ప్రబంధంలో మొట్టమొదట 'శిఱుత్తాంబినాల్' 'కట్టుణ్ణప్పణ్ణియ పెరుమాయన్ ఎన్నప్పన్' అంటూ సేవించి, వెంటనే నడకమార్చి...'ఎన్నప్పనిల్ నణ్ణితెన్కురుగూర్ నమ్బి ఎన్నక్కాల్ అణ్ణిక్కుమ్ అముదూరుమ్ ఎన్నావుక్కే' అని తమ ఆచార్యుల నామమే వారి ఆరాధ్యదైవం నామం కన్నా మధురమనిచెప్పి సార్థకనామధేయులైనారు. వారి ఆచార్య నిష్టకు సంతోషించిన పెరుమాళ్ వారు ఇక తమను పాడరని తెలిసికూడా అటువంటి ఆచార్యనిష్టులనోట తమ నామం నానితే సార్థకమౌతుందనుకున్నారో ఏమో! మూడవపాశురంలోకి తామే ప్రవేశించి... 'కఱియకోలత్తిరువురు' అని తమను ప్రకటించుకున్నారు. అంతటి వైభవం మధురకవులది. శబరి తమ ఆచార్య నియమనానుసారం రామచంద్రునికి ఆతిథ్యమిచ్చి ఆశ్రమంలోని విశేషాలన్నింటినీ వారికి సేవింప జేసి వారు సంతృప్తులైనారా అని అడిగి తెలుసుకుని, వారికి ధర్మాత్ముడైన సుగ్రీవుని కలవమని తెలిపి వారి ఆజ్ఞతీసుకుని తన ఆచార్యులతిరువడి స్మరిస్తూ యోగాగ్నిలో తన తనువుచాలించి, ఆచార్యకటాక్షంచేత దివ్యదేహధారిణియై తన ఆచార్యతిరువడిని చేరిన మహనీయురాలు. రామచంద్రుడు ఆమెకు చేసిన ఉపకారమేదైనా ఉంటే అది ఆమె ఆచార్యుల కాజ్ఞితాన్ని నెరవేర్చి ఆమెకు ఆచార్యవిశ్లేషణం పోగొట్టటమే. అంతే తప్ప రామచంద్రుడు ఆమెకు స్వర్గప్రాప్తి కలిగించలేదు. మోక్షం అనుగ్రహించనూ లేదు.

మన సంప్రదాయంలో శబరిని ఆచార్య నిష్ఠకు ప్రతీకగా చెపుతారు. ఉపదేశ రత్నమాల ప్రకారం(జ్ఞాన మనుట్టానమివై...) ఆచార్యులను ఆశ్రయించి వుంటే, పెరుమాళ్ తనంత తానే వైకుంఠాన్ని యిస్తారు అని చెప్పబడినది.

ఇక్కడ శబరి తనంత తానే శరీరాన్ని వదిలి వెళ్ళినది అంటున్నారు.ఇది ఆచార్య అభిమానం అనే మన మార్గం నకు సరి పోదు కదా !

మతంగమహర్షి జ్ఞానానుష్టానాలు అధికంగా వున్నందున వారు మోక్షాన్ని పొందారనే అనుకోవచ్చు. ఇక శబరిది ఆచార్యనిష్ఠ. అందుచేత తన ఆచార్యాజ్ఞను పాటించి రాములవారికి ఆతిథ్యమిచ్చిన శబరి వారి అనుజ్ఞ తీసుకొని తన ఆచార్యశుశ్రూషకొరకు ఆచార్యుని తిరువడి చేరుతానని రాములవారి కి తెలిపి తన ఆచార్యతిరువడి ధ్యానిస్తూ యోగాగ్నిలో ప్రవేశించి తన ఆచార్యుని చేరిందని శ్రీరామాయణం చెప్పింది. అక్కడ రాములవారు అనుగ్రహించినదేమీ లేదు. వారు కేవలం శబరి తన ఆచార్యతిరువడికి చేరటానికి( అదే శిష్యులకు మోక్షప్రదమని మన సంప్రదాయం) సాక్షీభూతులై నిలిచారు. ఈ విషయాన్ని వేదాంతదేశికుల వారు రఘువీరగద్యలో మూడవ చూర్ణిక చివరలో 'శబరీమోక్షసాక్షీభూత!' అని వర్ణించారు. మన సంప్రదాయమే ఇంతకుముందు చెప్పుకున్నట్లు ఆచార్యనిష్టుల సంప్రదాయం. శబరి తన ఆచార్యనిష్టానుష్టానం చేత పరమపదం పొందింది. దానికి పరంధాముడు కూడా ఆశ్చర్యానందాలతో సాక్షీభూతుడై నిలిచాడు. ఈనాడు జ్ఞానానుష్టానాలు కొరవడినందున మనకు ఆచార్యనిష్ఠ అనగానే కేవలం మన ఆచార్యులయందు మాత్రమే భక్తి అనే అపప్రధ కలిగి ప్రవర్తిస్తున్నాము. కలిలో ఆచార్యులయందు కూడా అనేక లోపాలు సంభవించవచ్చు. ఆకారణం చేతనే వారికి – జగదాచార్యులైన రామానుజులవారి సంబంధంచేతనే – మోక్షము, ఆ సంబంధకారణం చేతనే వారికి ఆచార్యత్వము సిద్ధిస్తున్నాయి. అందుచేత మనం ఆచార్యనిష్ఠ అనేది భగవద్రామానుజులవారి తిరువడిలో పర్యవసించి మన ఆచార్యులను రామానుజుల వారి తిరువడిగా భావించి రామానుజ నామస్మరణ మాత్రం చేతనే మోక్షార్హులమౌతాము. ఉభయవిభూతినాథులైన రామానుజుల వారి కటాక్షం చేత భగవంతుడు మనకు మోక్షాన్ననుగ్రహిస్తాడు. ఇదే మన సంప్రదాయం. ఇదే శబరి ఆచార్యతిరువడి, చేరటంలోని అంతరార్థం.

రామానుజ సంబంధం, పూర్వాచార్యనిర్వాహం పాటించి ప్రవర్తించటం మనకు ప్రధానసూత్రాలు. భాగవతులందరూ బంధుగణం. ఈ అధ్యవసాయం కొంచెం కష్టమైనా అలవరచుకోగలిగితే, ఇక్కడే పరమపదం లభించటం తథ్యం.

స్వాచార్యులను రామానుజులవారి వారితిరువడిగా భావించాలి. రామానూజులవారిని సేవించేటప్పుడు వారి తిరువడినే కదా పట్టేది! అదేవిధంగా రామానుజ సంబంధం చేత స్వాచార్యులు ధ్యేయులు. రామానుజులవారు సైతం ఆళవన్దార్ తిరువడి మనసులోనుంచుకొని పెరియనంబివారి తిరువడి సేవించేవారని పెద్దలంటారు!



# శ్రీకృష్ణ పరమాత్మ ఇచ్చిన చివ్వరి సందేశం

- సాయినాథ్

**ద్వాపరయుగం ఇంకా కొద్ది రోజులలో ముగిసి పోయి కలియుగం రాబోతుందనగా ఒకరోజు... శ్రీ కృష్ణుడు బలరాముడితో "అవతార పరిసమాప్తి జరిగిపోతుంది. యదుకుల నాశనం అయిపోతుంది. మీరు తొందరగా ద్వారకా నగరమునువిడిచి పెట్టెయ్యండి" అని చెప్పడాన్ని ఉద్ధవుడు విన్నాడు. ఇతడు శ్రీకృష్ణ భగవానుడికి అత్యంత ముఖ్య సఖుడు మరియు పరమ ఆంతరంగిక విశేష భక్తుడు.**

ఆయన కృష్ణుడి దగ్గరకు వెళ్లి "కృష్ణా! మేము నీతో కలిసి ఆడుకున్నాము, పాడు కున్నాము, అన్నం తిన్నాము, సంతోషంగా గడిపాము. ఇలాంటి కృష్ణావతారం ముగిసి పోతుంది అంటే విని నేను తట్టుకోలేక పోతున్నాను. నిన్ను విడిచి నేను ఉండలేను. కాబట్టి నా మనసు శాంతించేటట్లు నిరంతరమూ నీతో ఉండేటట్లు నాకేదయినా ఉపదేశం చెయ్యి" అన్నాడు.

అప్పుడు కృష్ణ పరమాత్మ కొన్ని అద్భుత మయిన విషయములను ఉద్ధవుడితో ప్రస్తావన చేసాడు.

ఇది మనం అందరం కూడా తెలుసుకుని జీవితంలో పాటించవలసిన శ్రీకృష్ణ పరమాత్మ చిట్టచివరి ప్రసంగం.

దీని తర్వాత యింక కృష్ణుడు లోకోపకారం కోసం ఏమీ మాట్లాడలేదు. ఇది లోకమును ఉద్ధరించ దానికి ఉద్ధవుడిని అడ్డుపెట్టి చెప్పాడు.

"ఉద్ధవా! నేటికి ఏడవరాత్రి కలియుగ ప్రవేశం జరుగుతుంది. ఏడవరాత్రి లోపల ద్వారకా పట్టణమును

సముద్రం ముంచెత్తుతుంది. సముద్ర గర్భంలోకి ద్వారక వెళ్ళిపోతుంది. ద్వారకలో ఉన్న వారందరూ మరణిస్తారు. తదనంతరం కలియుగం ప్రవేశిస్తుంది.

కలియుగం ప్రవేశించగానే మనుష్యుల యందు రెండు లక్షణములు బయలు దేరతాయి. ఒకటి అపారమయిన కోర్కెలు. రెండు విపరీతమైన కోపం.

ఎవ్వరూ కూడా తన తప్పు తాను తెలుసుకునే ప్రయత్నం కలియుగంలో చెయ్యరు.

**కలియుగంలో గాని ఏ యుగంలోగాని నీ శ్వాసను గట్టిగా పట్టుకోవడం నేర్చుకో. ధ్యానం చేయడం విడిచిపెట్టకు. నీదారి శ్వాస దారి కావాలి.శ్వాస దారియే నా దగ్గరికి నిన్ను చేరుస్తుంది. నువ్వు చేసే ప్రతి శ్వాస క్రియ లోనూ నేను వున్నాను. వుంటాను. ఇది విశ్వసించు ఉద్ధవా.**

కోర్కెలచేత అపారమయిన కోపముచేత తమ ఆయుర్ధాయమును తాము తగ్గించు కుంటారు. కోపము చేతను, అపారమయిన కోర్కెల చేతను తిరగడం వలన వ్యాధులు వస్తాయి. వీళ్ళకు వ్యాధులు పొటమరించి ఆయుర్ధాయమును తగ్గించి వేస్తాయి.

కలియుగంలో ఉండే మనుష్యులకు రాను రాను వేదము ప్రమాణము కాదు. కోట్ల జన్మల అదృష్టము చేత వేదము ప్రమాణమని అంగీకరించగల స్థితిలో పుట్టిన వాళ్ళు కూడా వేదమును వదిలిపెట్టేసి తమంత తాముగా పాషండ మతములను కౌగలించుకుని అభ్యున్నతిని విడిచిపెట్టి వేరు మార్గములలో వెళ్ళిపోతారు.

అల్పాయుర్ధాయంతో జీవిస్తారు. రాజ యోగం చేయడం మరచి పోతారు.తద్వారా బ్రహ్మ యోగం అనబడే క్రియా యోగం లేదా నేనున్నా స్థితికి చేర్చే లయ యోగం ఒకటి ఉందనేది తెలుసుకోరే ప్రయత్నం చేయరు.ఆడంబరాలకు ప్రాధాన్యత నిస్తారు. ఉపవాసములు తమ మనసును సంస్కరించు కోవడానికి, ఆచారమును తమంత తాము పాటించడానికి వచ్చాయి. రానురాను కలియుగంలో ఏమవుతుందంటే ఆచారములను విడిచి పెట్టేయడానికి ప్రజలు ఇష్టపడతారు.

ఆచారం అక్కర్లేదనే పూజలు ఏమి ఉంటాయో వాటియందు మక్కువ చూపిస్తారు. వాటి వలన ప్రమాదము కొని తెచ్చుకుంటున్నామని తెలుసుకోరు. అంతశ్శుద్ధి ఉండదు. చిత్తశుద్ధి ఏర్పడదు.

మంచి ఆచారములు మనస్సును సంస్కరిస్తాయి అని తెలుసుకోవడం మానివేసి ఏ పూజచేస్తే, ఏ రూపమును ఆశ్రయిస్తే ఆచారం అక్కర్లేదని ప్రచారం ఉంటుందో అటువైపుకే తొందరగా అడుగువేస్తారు. కానీ దానివలన తాము పొందవలసిన స్థితిని పొందలేము అని తెలుసుకోలేకపోతారు.

ఇంద్రియములకు వశులు అయిపోతారు. రాజులే ప్రజల సొమ్ము దోచుకుంటారు. ప్రజలు రాజుల మీద తిరగబడతారు.

ఎవడికీ పాండిత్యమును బట్టి, యోగ్యతను బట్టి గౌరవం ఉండదు.

కలియుగంలో ఏ రకంగా ఆర్జించా డన్నది ప్రధానం అవదు. ఎంత ఆర్జించా డన్నది ప్రధానం అవుతుంది.

ఎవడికి ఐశ్వర్యం ఉన్నదో వాడే పండితుడు. భగవంతుని పాదములను గట్టిగా పట్టుకుని తరించిన మహాపురుషులు ఎందరో ఉంటారు. అటువంటి మహా పురుషులు తిరుగాడిన ఆశ్రమములు ఎన్నో ఉంటాయి.

కలియుగంలో ప్రజలు అందరూ గుళ్ళ చుట్టూ తిరిగే వాళ్ళే కానీ, అటువంటి మహాపురుషులు తిరుగాడిన ఆశ్రమాల సందర్శనం చేయడానికి అంత ఉత్సాహమును చూపరు. అటువంటి ఆశ్రమములలో కాలు పెట్టాలి. అటువంటి మహా పురుషుల మూర్తులను సేవించాలి.

కానీ అక్కడకు వెళ్ళకుండా హీనమయిన భక్తితో ఎవరిని పట్టుకుంటే తమ కోర్కెలు సులువుగా తీరగలవు అని ఆలోచన చేస్తారు. ఈశ్వరుని యందు భేదమును చూస్తారు.

కాబట్టి నీకు ఒకమాట చెపుతాను. ఈ వాక్యమును నీవు బాగా జ్ఞాపకం పెట్టుకో. 'యింద్రియముల చేత ఏది సుఖమును యిస్తున్నదో అది అంతా డొల్ల. అది నీ మనుష్య జన్మను పాడు చేయడానికి వచ్చినదని గుర్తు పెట్టుకో. దీనినుంచి దాటాలని నీవు అనుకున్నట్లయితే ఇక్కడి నుండి బదరికాశ్రమమునకు? వెళ్ళిపో'

కలియుగంలో గాని ఏ యుగంలోగాని నీ శ్వాసను గట్టిగా పట్టుకోవడం నేర్చుకో. ధ్యానం చేయడం విడిచిపెట్టకు. నీదారి శ్వాస దారి కావాలి.శ్వాస దారియే నా దగ్గరికి నిన్ను చేరుస్తుంది. నువ్వు చేసే ప్రతి శ్వాస క్రియ లోనూ నేను వున్నాను. వుంటాను. ఇది విశ్వసించు ఉద్ధవా.ప్రయత్నపూర్వకంగా కొంతసేపు మౌనంగా ఉండడానికి ప్రయత్నించు. మౌనము ధ్యానం, యింద్రియ నిగ్రహము, చేయుట, నోటిలోని మౌనం మనసులోని మౌనంతో ధ్యానంలో కూర్చొనుట, ఈశ్వరుని సేవించుట మొదలగు పనులను ఎవరు పాటించడం మొదలు పెట్టారో వారు మెట్లెక్కడం మొదలుపెడతారు.

ఇది శ్రీకృష్ణ పరమాత్మ ఉద్ధవుడికి ఇచ్చిన చివ్వరి సందేశం...

ఈ సందేశం ఉద్ధవుడికే అనుకుంటే పొరపాటు. ఇది మనందరికోసం పరమాత్మ చెప్పిన సత్యం.

# మయూరధ్వజుడు

- రమేష్

పంచమవేదంగా ఖ్యాతిగాంచిన మహాభారతం .. నేటి మానవ జీవన విధానానికి సోపానం. రామాయణం మనిషి ఎలా జీవించాలో నేర్పిస్తే.. మహాభారతం ఎలా జీవించకూడదో తెలుపుతుంది.

**మహాభారతంలోని శ్రీకృష్ణుడు, పాండవులు, కౌరవులు, కర్ణుడు, భీష్ముడు, శకుని, ద్రౌపది, కుంతి ఇలా అనేకమంది ఉన్నారు. స్త్రీ, పురుషుల జీవితాలను తరచి చూస్తే మనకు జీవితంలోని మంచి చెడులు అర్థమవుతాయి. ఈరోజు మహాభారతంలోని గొప్ప వ్యక్తి మయూరధ్వజుడు గురించి అతని త్యాగ నిరతి గొప్పదనం గురించి తెలుసుకుందాం..**

ధర్మరాజు అశ్వమేధయాగం చేస్తూ.. యాగాశ్వాన్నివిడిచాడు. ఆ యావశ్వాన్ని వీర ధర్మం పాటిస్తూ పట్టుకున్నాడు మయూరధ్వజుడనే రాజు. అతడు ధర్మాత్ముడు అమిత పరాక్రమవంతుడు శ్రీ కృష్ణుని పరమ భక్తుడు. యాగాశ్వం విడిపించడానికి మయూరధ్వజునితో యుద్ధం చేయటానికి శ్రీ కృష్ణార్జునులు వచ్చారు. శ్రీ కృష్ణుడు.. అర్జునుని ప్రార్థనపై మయూరధ్వజుడుతో యుద్ధం చేశాడు. భగవంతునితో యుద్ధం చేయకూడదని ఉన్నా యుద్ధనీతి పాటించి ప్రతి బాణం వేసే ముందు శ్రీ కృష్ణ నామ స్మరణ చేస్తూ యుద్ధం చేశాడు మయూరధ్వజుడు. భక్తులచేతిలో ఓడిపోవటం భగవంతునికి పరిపాటి. అందుకే శ్రీకృష్ణారుజునులు మయూరధ్వజుని గెలవలేకపోయారు.


దీంతో అర్జునుడు యాగాశ్వం సంపాదించడానికి .. మయూరధ్వజుడిని ఎలా సంహరించాలి అని అడిగాడు. అప్పుడు కృష్ణుడు "ఫల్గుణా.. నీ గాండీవం కాని నా సుదర్శన చక్రం కాని ఈ పరమభక్తుని మీద పని చేయవు. అతని ధర్మబుద్ధి నీకు చెబుతా విను అంటూ చెప్పడం ప్రారంభించాడు శ్రీ కృష్ణుడు.

మర్నాడు శ్రీ కృష్ణార్జునులు బ్రాహ్మణుల వేషంలో మయూరధ్వజుని వద్దకు అతిథులుగా వెళ్లారు. అతిథులకు తగు మర్యాద చేసి మయూరధ్వజుడు తన ఇంట ఆతిథ్యం స్వీకరించమని ప్రార్థించాడు. అది విన్న శ్రీకృష్ణుడు "రాజా! నీ ఇంట భుజించుటకు వ్యవధి లేదు. మాకొక చిక్కు వచ్చింది. అది తీరిన తరువాతే మేము ఇంకొక విషయం పై దృష్టిపెడతాం అని అన్నాడు. దీంతో మయూరధ్వజుడు మీ కష్టం ఏమిటి చెప్పండి.. నాకు చేతనైన సాయం చేస్తా అని అడిగాడు. దీంతో "రాజా.. మేము అడవిలో ప్రయాణిస్తున్నప్పుడు నా కుమారుని ఓ పెద్దపులి పట్టుకుంది. ఆ పసివాడి శరీరాన్ని సగం తిన్న తరువాత ఒక అశరీరవాణి ఇలా పలికింది "మయూరధ్వజుని శరీరంలో సగభాగం ఈ పులికి అర్పిస్తే నీ పుత్రుడు సజీవుడు అవుతాడు". నాకు పుత్రభిక్ష పెట్టమని నిన్ను ప్రార్థిస్తున్నాను" అని మారు వేషంలో ఉన్న శ్రీ కృష్ణుడు చెప్పాడు.

దీంతో మయూరధ్వజు "ఆహా.. ఈరోజు కదా ఈ దేహానికి సార్థకత ఏర్పడింది. ఒక పసివాడి ప్రాణాలు కాపాడటానికి ఉపయోగపడుతోంది. నిస్సందేహంగా నా శరీరములోని అర్థభాగమును తీసుకుని ఆ వ్యాఘ్రేశ్వరునికి సమర్పించండి" అని అర్థించాడు మయూరధ్వజుడు. వెంటనే తన భార్యాబిడ్డలను పిలిచి తన శరీరాన్ని రెండుగా చేసి అతిథులకు ఇవ్వమని చెప్పాడు. అతని అర్థాంగి తన భర్త ఇలా చేయమన్నాడు అంటే.. ఏ పరమధర్మ సంరక్షణార్థమో ఏ మహత్తర కార్యానికో చేయమని వుంటాడని గ్రహించి తన బాధను దిగమింగుకుంది. వెంటనే మయూరధ్వజుని శరీరాన్ని ఛేదించడం మెదలుపెట్టారు. అప్పుడు శ్రీకృష్ణార్జులకు ఒక దృశ్యం కనిపించింది.

మయూరధ్వజుని ఎడమ కన్ను నుండి కన్నీరు కారుతుంది. దీంతో శ్రీ కృష్ణుడు రాజా "రాజా! బాధపడుతూ దానం ఇవ్వకూడదు. సంతోషంగా, మనస్పూర్తిగా చేస్తేనే అది త్యాగమవుతుంది. ఎదుటి వాడి కష్టాలు చూసి బాధపడటం దివ్యత్వమని చెప్పాడు. విప్రుడు మాటలకు మయూరధ్వజుడు స్పందిస్తూ.. అయ్యా .. నా శరీరం మనస్ఫూర్తిగానే మీకు సమర్పించాను. కాని నా శరీరము యొక్క కుడి భాగమే పరోపకారార్థం వినియోగపడుతుంది. ఎడమ భాగ శరీరం "నాకా అదృష్టం లేదే" అని విచారిస్తూ కన్నీరు కారుస్తోంది. మిగిలిన శరీరం దేనికీ ఉపయోగపడకుండానే నాశనమవుతున్నదనే నా బాధ" అని అమృతవాక్కులు పలికాడు మయూరధ్వజుడు. ఆ రాజు పరోపకార బుద్ధికి సంతోషించి శ్రీ కృష్ణుడు తన నిజరూపం దర్శనం ఇచ్చి మయూరధ్వజునికి యథా రూపం కల్పించి దీవించాడు. మయూరధ్వజుడు నరనారాయణులకు మ్రొక్కి యాగాశ్వాన్ని సమర్పించి కృతార్థుడయ్యాడు.

**ఈ కథలోని నీతి:** మయూరధ్వజుని పరోపకారబుద్ధి అనన్యం అసామాన్యం. శ్రీ కృష్ణుడు అడిగినదే తడవుగా సంతోషంగా బాలుని ప్రాణ రక్షణ కోసం తన శరీరాన్ని త్యాగంచేయటానికి సిద్ధపడ్డాడు. అంతేకాక అర్ధ శరీరమే ఉపకరిస్తున్నది మిగిలిన శరీరం వ్యర్థమవుతున్నదని చింతించాడు. అతని త్యాగనిరతితో గొప్ప వ్యక్తిగా నిలిచిపోయాడు.



# హృదయార్పణం

**ఒక మంచి విషయం..... దయచేసి ఒకసారి ఈ వ్యాసం చదవండి! మనిషి తనకు మానవజన్మ ప్రసాదించిన భగవంతుడికి అనేక విధాలుగా పూజలు చేస్తుంటాడు.... పూజా సమయంలో యథాశక్తి తనకు ఉన్నంతలో పత్రమో, పుష్పమో, ఫలమో, జలమో సమర్పించుకుంటూ ఉంటాడు.**

ఈ విధం గా సమర్పించడం కృతజ్ఞతా సూచకం అయితే కావచ్చునేమోగానీ, అసలు మనిషి భగవంతుడికి సమర్పించగల శక్తిమంతుడేనా?

ఇలా ఆలోచిస్తే, ఎంతమాత్రం కాదని చెప్పవచ్చు.

భగవంతుడిదే ఆ యావత్సృష్టి. అలాంటివాడికి భక్తుడు ఇచ్చే కానుకలు అత్యల్పమైనవే.

కానీ ఏదో ఒకటి సమర్పించకపోతే భక్తుడి మనసు ఊరుకోదు.

పూర్వం ఒక యోగి భగవంతుణ్ని అర్చించడానికి సిద్ధమయ్యాడు.

అప్పుడు అతడిలో వివేకం ఉదయించింది.

పూజలో ఒక్కొక్క ఉపచారాన్నీ చేస్తూ భగవంతుడితో ఇలా విన్నవించుకున్నాడు– 'పరమేశ్వరా!

నీవు బ్రహ్మాండమంతా నిండి ఉన్నావు. కనుక నిన్ను ఎలా ఆవాహన చేయాలి?

అన్నింటికీ ఆధారమై నీవు ఉండగా నీకు ఆసనం ఎక్కడ వేయాలి?

నిరంతరం స్వచ్ఛంగా ఉండే నీకు కాళ్లు కడుక్కోవడానికి నీళ్లెందుకు?

పరిశుద్ధుడవైన నీకు ఆచమనం అవసరమా?

నిత్యనిర్మలుడవైన నీకు స్నానం ఎలా చేయించాలి?

ప్రపంచమంతా నీలోనే ఉండగా నీకు వస్త్రం ఎలా

ధరింపజేయాలి?

గోత్ర వర్ణాలకు అతీతుడవైన నీకు యజ్ఞోపవీతం అవసరమా?

ఏ లేపనాలూ అవసరం లేని నీకు గంధం ఎలా పూయాలి?

నిత్య పరిమళుడవైన నీకు పూలు పెట్టడం ఎందుకు?

మహిమతోనే వెలిగిపోయే నీకు ఆభరణాలు తొడగాలా?

నిరంజనుడవైన నీకు ధూపం వేయడం సరి అయినదేనా?

జగత్తుకే సాక్షిగా నిలిచిన నీకు దీపం అవసరమా?

నిజమైన ఆనందంతో నిలిచే నీకు నైవేద్యం ఎందుకు?

విశ్వానికే ఆనందాన్ని అందించే నీకు తాంబూలాన్ని అర్పించి సంతృప్తిపరచగలనా?

అంతమే లేకుండా అంతటా వ్యాపించిన నీకు ప్రదక్షిణం ఎలా చేయాలి?

అద్వయుడవైన నీకు నమస్కారం ఎలా చేయాలి?

వేదాలే నిన్ను స్తుతించడానికి శక్తి చాలనివి అవుతుంటే నేను నిన్ను ఎలా స్తుతించాలి?'

ఈ పలుకుల్లో నిజం లేకపోలేదు.

భగవంతుడి ముందు ఎంతటి మానవోత్తముడైనా అత్యల్పుడే.

వీడి శక్తి భగవంతుడి ముందు పరిగణనలోకి రానే రాదు.

అయినా భగవంతుడు మనిషి చేసే పూజలను స్వీకరిస్తున్నాడంటే ఆయన అపార కారుణ్యం వర్ణించలేనిది.

నిజంగా భగవంతుడు మనిషి నుంచి కోరేవి సంపదలు కావు. వస్తువులు అంతకన్నా కావు.

ఆయన మనిషి నుంచి హృదయార్పణను కోరతాడు.

భక్తితో స్మరిస్తే చాలునంటాడు. కానీ మనిషి మనసు చంచలం. చపలం. స్థిరంగా ఒకచోట ఉండదు. లౌకిక లంపటాల వల్ల భగవంతుడిపై లగ్నం కాదు.

అందుకే....... శంకరభగవత్పాదులు–

'ఓ పరమేశ్వరా! నా మనసు ఒక కోతి వంటిది. అది ఎప్పుడూ సంసారవాంఛ అనే అడవిలో తిరుగుతూ ఉంటుంది. భార్యాపుత్రుల ప్రేమ అనే చెట్టుకొమ్మను పట్టుకొని వేలాడుతూ ఉంటుంది. క్షణం తీరిక లేకుండా అటూ ఇటూ పరుగులు తీస్తుంటుంది. అందువల్ల నా మనసు అనే కోతిని నీకు అర్పిస్తున్నాను. దాన్ని తాడుతో గట్టిగా కట్టి నీ అధీనంలో ఉంచుకో' అని ప్రార్థిస్తారు.

సామాన్య భక్తులను తరింపజేయడానికి ఆయన చేసిన విన్నపం ఇది.



'ఓ పరమేశ్వరా! బంగారుకొండ మేరుపర్వతమే నీ చేతిలో ఉంది. అపార ధనవంతుడైన కుబేరుడు నీ పాదదాసుడై ఉన్నాడు. కల్పవృక్షం, కామధేనువు, చింతామణి నీ ఇంటిలోనే ఉన్నాయి. షోడశ కళలను కురిపించే చంద్రుడు అమృతాన్ని వర్షిస్తూ నీ తలపైనే ఉన్నాడు. సమస్త మంగళాలనూ కలిగించే పార్వతీదేవి సర్వమంగళయై నీ పక్కనే ఉంది. కనుక నీకు నేనేమీ ఇవ్వలేను. నా దగ్గర ఉన్నది ఒక్క మనసే. అది నీకు సమర్పిస్తున్నాను!' అని హృదయాన్ని అర్పిస్తే భగవంతుడు ఎంతో ఇష్టపడతాడు.

అచంచల విశ్వాసం, అకుంఠిత భక్తి, అన్నింటినీ నివేదించగల మనసు ఉంటే చాలు.

భగవంతుడు ఏ రూపంలో ఉన్నా పూజల్ని అందుకుంటాడు.

అట్టహాసాలు, ఆర్భాటాలు నిజమైన పూజలు కావు.

హృదయార్పణమే పూజ.

నిశ్చల ధ్యానమే భక్తి.

అంతేకానీ లోకమంతా చూడాలని చేసే నటనలు పూజలు కావు. ఈ సత్యాన్ని మనిషి గ్రహిస్తే మేలు!

**లోకాస్సమస్తా సుఖినోభవంతు**



# ఉబ్బలి బసవన్న

**పూర్వం శ్రీశైల ప్రాంతం లోని బ్రహ్మగిరి సమీపం లో ఒక మహా శివభక్తుడైన శిల్పి వుండేవాడు. ఆయన ఒకసారి మల్లికార్జున స్వామిని సేవించడానికి శ్రీశైలం వచ్చాడు. అలా స్వామిని పూజించి యింటికి చేరిన శిల్పి సదా ఆలయాన్ని గురించే ఆలోచించడం ప్రారంభించాడు.**

తన శిల్పకళా నైపుణ్యంతో శ్రీశైల ఆలయ ప్రాంగణం లోనూ బయటా కూడా మహత్తరమైన నందులను నెలకొల్పాలని అనుకున్నాడు.ఉత్సాహంతో పని ప్రారంభించాడు.

శిల్పి నక్త వ్రతాన్ని(పొద్దున్నించీ భోజనం చేయకుండా రాత్రి శివపూజ చేసి భుజించడాన్ని నక్తం అంటారు) పాటిస్తూ నలభై రోజులలో రెండు మహత్తరమైన నందులను తయారు చేశాడు. కవలపిల్లల్లా ఒకే రూపుతో ముచ్చటగా వున్న నందులను చూసి ఆనందించాడు. కానీ ఏమి లాభం?వెంటనే విచారం లో మునిగి పోయాడు.ఈ మహత్తర పెద్ద నందులను శ్రీశైలానికి ఎలా చేర్చాలి?అన్నదే అతని బాధ. మధ్యలో పాతాళగంగను కూడా దాటాలి మరి. నిద్రకూడా పట్టలేదు. అర్ధ రాత్రి గడిచాక మత్తు వచ్చినట్లు కళ్ళు మూసుకున్నాడు శిల్పి. వెంటనే ఒక కల. కలలో స్వామి కరుణించాడు. స్వామి శిల్పి తో యిలా అన్నాడు.

భక్తా! నీ సంకల్పం మహత్తర మైనది. నీ శ్రమ ఫలించింది. ఇవిగో ఈ పలుపు త్రాళ్ళను తీసుకొని నందుల మెడలకు తగిలించు. వెనుతిరిగి చూడకుండా శ్రీశైలం చేరుకో...

వెంటనే కళ్ళు తెరిచాడు శిల్పి. ఎదురుగా పలుపు త్రాళ్ళు కనిపించాయి. సంతోషంతో ఉక్కిరిబిక్కిరి అయ్యాడు వెంటనే త్రాళ్ళను నందుల మెడ లకు తగిలించాడు.త్రాళ్ళను చేత బట్టి శ్రీశైలానికి బయల్దేరాడు. తెల్లవారు ఝామునకు పాతాళగంగను చేరుకున్నాడు. అలాగే కృష్ణానదిని దాట సాగాడు.నీటిలో కొంత దూరం వెళ్ళాడు. రెండవ ఒడ్డుకు చేరబోతున్నాడు. ఒక నంది అతని ముందు వున్నది యింకొకటి వెనక వస్తున్నది. వెనక వస్తున్న నంది కాలు నీళ్ళలోని రాళ్ళ మధ్య యిరుక్కొని అది రావడం మానేసింది కంగారుగా నంది ఎందుకు కదలడం లేదని కొంచెం పక్కకు తిరిగి చూశాడు శిల్పి.అంతే కాలు పైకి లాక్కుంటున్న నంది చైతన్యం కోల్పోయి మళ్ళీ శిలగా మారిపోయింది.

శిల్పి చేసేదేమీ లేక దానిని అక్కడే వదిలి ఒక నంది తోనే శ్రీశైలం చేరాడు. ఇప్పుడు శ్రీశైలంలో వున్న నంది ఆ శిల్పి చేసినదే నని చెప్తారు. ఇదంతా కర్ణా కర్ణిగా వినపడుతున్న గాథ. ఊబినుండి కాలు పైకి లాక్కుంటూ శిలగా మారిపోయిన నంది "ఉబ్బలి బసవన్న" అని పిలువబడుతూ ఇటీవలి కాలం వరకూ భక్తులకు దర్శన మిచ్చేది. శ్రీశైలం ప్రాజెక్ట్ వల్ల పాతాళ గంగలో మునిగిపోయిన నంది 700 అడుగుల లోతున నీటిలో యిప్పటికీ వుందట.

* * *

# కణ్వమహర్షి




కణ్వమహర్షి కశ్యప ప్రజాపతి వంశంలో పుట్టాడు. ఈయనను 'మునికుల చూడామణి' అంటారు. అంటే మునులందరిలో గొప్పవాడు అని అర్థం. ఈయన చిన్నప్పటి నుండి తపోనిష్ఠలో ఉండి జీవితమంతా బ్రహ్మచారిగానే గడిపాడు. సామవేద మంత్రాలు బాగా తెలిసినవాడు.

కణ్వ మహర్షి ఆశ్రమం మాలినీ నదీ తీరంలో ఉండేది. ఇంద్రుడి ఖాండవ వనం, కుబేరుడి చైత్రరథం ఎంత గొప్పగా ఉంటాయో కణ్వుడి ఆశ్రమం అంత గొప్పగా ఉండేది. ఆయన ఆశ్రమంలో ఎప్పుడూ వేదఘోష వినిపిస్తూ ఉండేది. అగ్నిహోత్రాలు నిత్యం ఉండేవి. శాస్త్ర ప్రవచనాలతో, వేదార్థ మీమాంస గోష్ఠిలో జరిగే వాదనలతో, గొప్ప తపస్సంపన్నులతో దివ్యాశ్రమంలా ఉండేది. అక్కడ పక్షులు గానం చేస్తుంటే ఏనుగులు చెట్ల నీడలో నిలబడి వినేవి. మహర్షులు పెట్టే పిండాలు తినడానికి ఎలుకలు, పిల్లులు స్నేహంతో వచ్చి వంతులు వేసుకుని తినేవి. ఆ ప్రాంతానికి వచ్చిన రాజర్షులు కానీ, బ్రహ్మర్షులు కానీ కణ్వ మహర్షి దగ్గర ఆశీర్వాదం తీసుకోకుండా వెళ్ళేవారు కాదు. అంత పవిత్రమైంది కణ్వ మహర్షి ఆశ్రమం.

ఒకనాడు కణ్వ మహర్షి మాలినీ నదిలో స్నానం చెయ్యడానికి వెళ్ళినపుడు ఒక చిన్నపిల్ల ఏడుపు వినిపించింది. కణ్వుడు ఆ ఏడుపు వినిపించిన వైపు వెళ్ళి అక్కడ తామరాకుల మీద పడుకోబెట్టి ఉన్న చంటిపిల్లని చూశాడు. అంతలో ఆకాశవాణి "మహర్షీ! ఈ బాలిక మేనక విశ్వామిత్రులకు పుట్టిన అమ్మాయి. ఈ అమ్మాయికి శకుంతల అని పేరు పెట్టి నీవు పెంచు. ఆ అమ్మాయికి పుట్టిన అబ్బాయి గొప్ప చక్రవర్తి అవుతాడు" అని చెప్పింది. కణ్వ మహర్షి ఆ అమ్మాయిని తీసకుపోయి తనే తల్లి, తండ్రి అయి పెంచాడు. శకుంతలని ముద్దుగా పెంచుతూ కణ్వ మహర్షి అన్ని విద్యలూ నేర్పించాడు.



శకుంతల పెద్దదై తండ్రి పూజకి కావలసిన పూలు కోసి సహాయపడేది.

ఒకనాడు దుష్యంత మహారాజు వేటకి వచ్చి అలసిపోయి కణ్వాశ్రమానికి వచ్చాడు. అక్కడ శకుంతలను చూసి ఆమె గురించి తెలుసుకుని పెళ్ళి చేసుకోమని అడిగాడు. శకుంతల కూడా దుష్యంతుణ్ణి చూసి ఇష్టపడింది.

కణ్వ మహర్షి లేని ఆ సమయంలో దుష్యంతుడు శకుంతలను గాంధర్వ పద్ధతిలో పెళ్ళి చేసుకుని చాలాకాలం అక్కడే ఉండిపోయాడు. కణ్వమహర్షి వచ్చాక నిన్ను తీసుకు వెడతానని, నీకు పుట్టబోయేవాడే నా తర్వాత రాజవుతాడని చెప్పి రాజధానికి వెళ్ళిపోయాడు దుష్యంతుడు.

కణ్వ మహర్షి తిరిగివచ్చి జరిగింది తెలుసుకుని శకుంతలను దీవించి నీకేం కావాలో అడగమన్నాడు. పుట్టబోయే కుమారుడు వంశోద్ధారకుడు, ఆయురారోగ్య ఐశ్వర్య బలాలతో ఉండాలని, తన మనస్సు ఎప్పుడూ ధర్మకార్యాలు చెయ్యడం గురించే ఆలోచించాలని కోరింది శకుంతల.

శకుంతలకి కొడుకు పుట్టిన తర్వాత కణ్వ మహర్షి ఆ పిల్లవాడికి భరతుడు అని పేరు పెట్టాడు. భరతుడు క్రూరజంతువుల్ని తన బలంతో చంపేస్తుండేవాడు. అందుకే అతనికి "సర్వదమనుడు" అని పేరు కూడా వచ్చింది.

కణ్వ మహర్షి భరతుణ్ణి చూసి యువరాజు పట్టాభిషేకానికి తగినవాడని ఆలోచించి శంకుతలని పిలిచి దుష్యంత మహారాజు వద్దకు పంపుతానని అన్నాడు. ఆశ్రమంలో ఉన్న అందరికీ భోజనాలు పెట్టించి కొంతమంది శిష్యుల్ని తోడుగా ఇచ్చి శకుంతలా భరతుల్ని దుష్యంతుడి దగ్గరికి పంపాడు.

దుష్యంతుడు మొదట శకుంతల నాకు తెలియదు అని అన్నాడు. కాని ఆకాశవాణి చెప్పిన విషయాలు విని జరిగినది గుర్తుకు వచ్చి శకుంతలా భరతుల్ని ఆదరించాడు.

ధర్మశాస్త్రము అనేది కణ్వ మహర్షి రచించిన గ్రంథం.

ఇదీ కణ్వ మహర్షి చరిత్ర. కణ్వ మహర్షి మహా తపస్వి. బ్రహ్మనిష్ఠుడు, ధర్మప్రవక్త, మహర్షి కూడా. కణ్వమహర్షి బ్రహ్మచారి అయి ఉండి కూడా ఒక కుమార్తెను పెంచి మన భారతావనికి భరతుణ్ణి అందించాడు.



# శ్రీ విష్ణు మహాపురాణం

కిడాంబి నరసింహాచార్య

**గత సంచిక తరువాయి**

పరాశరుడంటున్నాడింకా – అని కృష్ణుని బలరాముడు హెచ్చరించగా నవ్వుతూ ఒక్కటి చరచి పాము బంధం నుండి తనను విడిపించుకున్నాడు కృష్ణుడు. రెండు చేతులతో నాగశ్రేష్ఠుని మధ్యమ శిరస్సును వంచి, వంగిన తల పైకి ఎక్కి పరాక్రమశాలి కృష్ణుడు నాట్యం చేశాడు. కృష్ణుడు తన పాదాలతో తొక్కడం వలన నాగుని ప్రాణాలు పడగలలో నిలిచాయి. పాము తల ఎత్తిన చోటల్లా కృష్ణుడు తన పాదంతో ఒత్తుతున్నాడు. కృష్ణుని చేష్టలతో నాగుడు భ్రాంతుడై మూర్ఛపోయాడు. రేచక్ర దండపాత వంటి నాట్య విన్యాసంతో నాగుడు రక్తాన్ని కక్కుకున్నాడు. ఆ నాగుని పగిలిన శిరస్సు, మెడల భాగం నుండి, ముఖాల నుండి రక్తం కారింది. దాన్ని చూచి నాగుని భార్యలు దీనంగా కృష్ణునితో అన్నారు.

ఓ దేవదేవేశ! నీవు సర్వజ్ఞుడవని, ఉత్తముడవని తెలిసింది. పరంజ్యోతి, అచింత్యము అయిన పరమేశ్వరుని అంశవే నీవు. ఇతరులనుండి జన్మలేని, విభువైన నిన్ను స్తుతించడానికి దేవతలకే సాధ్యం కాదు. అట్టి నీ స్వరూప వర్ణనాన్ని ఆడవాళ్ళు ఎట్లా చేస్తారు. నీకు ఈ భూమి, ఆకాశము, జలము, అగ్ని, గాలులు శరీరం వంటివి. ఈ బ్రహ్మాండమంతా నీకు అల్పాంశము. ఇట్టి నిన్ను మేమెట్లా స్తుతించగలము? యోగులు ఎవని స్వరూపాన్ని, ఎప్పుడూ తెలుసుకోలేదో అట్టి అణువు కంటే అణువైన, స్థూలము కంటే స్థూలమైన ఆ పరమార్థానికి నమస్కరిస్తున్నాము. బ్రహ్మ వల్ల ఎవరికి జన్మ లేదో, ఎవ్వనిని యముడు సంహరించలేడో, స్థితికర్త వేరొకడు లేడో అట్టివానికి నమస్కారము. నీకు కోపం ఏమాత్రం లేదు. రక్షణమే నీ పని. కనుక కాళియుని అణచవద్దు. మా మాట విను. ఆడవాళ్ళపై సాధువులు దయ చూపాలి. వారు ఎప్పుడూ మూఢులు. దీనప్రాణులు. కనుక ఈ దీనుని మా మాట విని క్షమించు. నీవు క్షమించేవాళ్ళలో మొదటివాడివి. సమస్త జగత్తుకు ఆధారానివి నీవు. వీడు అల్పబలము గల నాగుడు. నీ కాళ్ళ తొక్కిడితో అర్ధ ముహూర్తంలో

ప్రాణాలు వదులుతాడు. ఈ నాగుడు అల్పబలం కలవాడు. నీవు భువనముల కన్నిటికి ఆశ్రయుడవు. నాశము లేనివాడివి. ప్రీతిని కొద్దిగా, ద్వేషాన్ని అధికంగా చూపుతున్నావు. అందువలన ఓ జగత్స్వామీ చనిపోయే వీనిపై దయ చూపు. ఈ నాగుడు ప్రాణాలు వదులుతున్నాడు కానీ ఓ స్వామీ! మాకు భర్తృ భిక్షను ప్రసాదించు. ఓ భువనేశ! జగన్నాథ! మహాపురుషులందరికన్నా ముందున్నవాడా! ఈ నాగుడు ప్రాణాన్ని వదులుతున్నాడు. మాకు భర్తృ భిక్షను ప్రపసాదించు. ఓ వేదాంతవేద్యా! దేవేశ! దుష్టులైన దైత్యులను సంహరించేవాడ! ఈ నాగుడు ప్రాణం వదులుతున్నాడు కనుక మాకు భర్తృ భిక్షనివ్వు అని నాగపత్నులు ప్రార్థించారు.

పరాశరుడంటున్నాడు — వారిట్లా ప్రార్థించగా వారితో ఓదార్పబడి, నాగుడు శరీరంలో శక్తి లేకపోయినా ఓ దేవదేవా! ప్రసాదించు అని మెల్ల మెల్లగా పలికాడు. కాళియుని మాట — ఓ నాథ! నీకు పరమైన, సహజ సిద్ధమైన ఎనిమిది గుణములనే ఐశ్వర్యమున్నది. అటువంటి ఐశ్వర్యము గల నిన్ను నేను సంతోష పరచగలనా? నీవు పరుడవు. నీవు మొదటి కారణము నుండి పరులను ఆత్మగా కలవాడవు. పరుడైన వానికన్నా పరుడవు. అట్టి నిన్ను నేను సంతృప్తి పరచగలనా? ఎవని నుండి బ్రహ్మ, రుద్రుడు, చంద్రుడు, ఇంద్రుడు, మరుత్తులు, అశ్వినులు, వసువులు, ఆదిత్యులు వచ్చారో అట్టి నిన్ను నేను సంతోష పరచగలనా? ఎవని ఒక అవయవములోని సూక్ష్మాంశతో ఈ జగత్తంతా ఏర్పడిందో, అవయవము అంశతో లోకాన్ని కల్పించేవానిని నేను సంతృప్తి పరచగలనా? సంతోష పరచగలనా? సత్తు, అసత్తు రూపం గలవాని అసలు స్వభావాన్ని బ్రహ్మాది త్రిదశేశ్వరులు తెలుసుకోలేరు. ఆతనిని నేనెట్లా స్తుతించను? స్తుతించగలనా? ఎవనిని బ్రహ్మాదులు నందనాది వనములలో గంధము కలిగిన పూలతో అర్చిస్తారో వానిని నేనెట్లా పూజించగలను? ఎవని అవతార రూపాలను



ఇంద్రుడు ఎల్లప్పుడూ అర్చిస్తాడో ఆ అవతార రూపుని, పరమ రూపాన్ని తెలుసుకోలేడో, అట్టి అవతార రూపుని నేనెట్లా అర్చించను? యోగులు ఇంద్రియముల నన్నిటిని విషయముల నుండి మరల్చి ధ్యానంతో ఎవనినర్చిస్తారో ఆతనిని నేను అర్చించగల సమర్థుడనా? ఎట్లా అర్చించను? యోగులు అతని రూపాన్ని హృదయంలో సంకల్పించి ధ్యానంతో అర్చిస్తారు. భావ పుష్పాలతో పూజిస్తారు. ఆతనిని నేనెట్లా అర్చించను? ఓ దేవదేవేశ! నేను నిన్ను పూజించటానికి లేదా స్తుతించటానికి అర్హుడను కాను. సమర్థుణ్ణి కాను. నీ మనస్సులో దయ తలచి నన్ను అనుగ్రహించు. ఈ సర్పజాతి క్రూరమైనది. నేను అందులో జన్మించాను. ఆ స్వభావమే నాకున్నది. నా తప్పు కాదు. నీవే సృష్టిస్తావు అన్నిటినీ. నీవే సంహరిస్తావు. సృష్టించే నీవు జాతిని, దానికి తగిన స్వభావాన్ని, రూపాన్ని సృష్టిస్తావు. నన్ను ఈ సర్పజాతిలో సర్పరూపంగా సృష్టించావు. అట్లాగే స్వభావమిచ్చావు. అందుకు తగినట్లు చేశాను. ఓ దేవదేవా! నేను మరొక రకంగా ప్రవర్తిస్తే నాపై దండ ప్రయోగం చేయటం నీ మాట ప్రకారం తగును. అయినా అజ్ఞుడనైన నాపై ఓ జగత్స్వామీ! దండాన్ని ప్రయోగించావు. ఈ పరమైన దండము మంచిదే. వేరేవారు కాకుండా నీవు విధించావు. సహిస్తాను. వీర్యము, విషము పోయి నీతో అణచబడ్డాను. నాకు ప్రాణాన్ని ఇవ్వు. ఏం చేయాలో చెప్పు అని నాగుడు అన్నాడు.

భగవంతుడన్నాడు — ఓ నాగా! నీవు ఇక్కడ ఉండొద్దు. ఈ యమునా నదీ జలంలో ఉండొద్దు. పుత్రులు పరివారంతో కూడి సముద్రపు జలంలోకి వెళ్ళు. సముద్రములో నా పాదాలను నీ తలపై చూచి గరుడుడు ఎప్పుడూ నిన్ను తాకడు అని అన్నాడు.

పరాశరుడన్నాడు — అని సర్పరాజును కృష్ణుడు విడిచాడు. ఆతడు కృష్ణునకు నమస్కరించి, సముద్రములోకి వెళ్ళాడు. అందరు చూస్తుండగానే భృత్యులు, బంధువులు, సుతులతో కూడి వెళ్ళాడు. భార్యలందరితో కూడి తన మడుగును విడిచి వెళ్ళాడు. సర్పము పోయాక చనిపోయిన వాడు తిరిగి వచ్చినట్లు ఆనందపడి కౌగిలించుకున్నారు. కన్నీటితో గోపాలురు కృష్ణుని తలను తడిపారు ప్రేమతో. ఇతరులు ఏ కష్టం లేకుండా పని ముగించిన కృష్ణుని ఆశ్చర్య మనస్కులై చూస్తున్నారు. పవిత్ర జలము గల యమునా నదిని గోపాలురు ఆనందంతో స్తుతించారు. గోపికలు కృష్ణుని మంచి చేష్టలను స్తుతిస్తుండగా, ఆతడు గోపాలురతో కూడా పొగడబడుతూ వ్రజమునకు వచ్చాడు అని పంచమాంశ యందు ఏడవ అధ్యాయము ముగిసినది.

**(సశేషం)**

శ్రీ వేంకటేశ్వర మహామంత్రపీఠం ఆధ్వర్యంలో

# శ్రీనివాస కళ్యాణాలు

**ఉచిత శ్రీనివాస కళ్యాణాలను నిర్వహించండి!**
**శ్రీవారి కృపకు పాత్రులుకండి!!**



**తిరుమల శ్రీవేంకటేశ్వరుని కరుణా కటాక్షములు అందరికీ లభించాలని 'కరోనా' లాంటి మహమ్మారి నుండి లోకాన్ని స్వామివారు రక్షించాలనే ఉద్దేశ్యంతో, భగవంతునికి మరియు ఆయన భక్తులకు సేవచేయాలన్న లక్ష్యంతో "శ్రీనివాస కళ్యాణాలు" అనే కార్యక్రమమును చేపట్టాము.**

కలియుగ దైవమైన తిరుమల శ్రీవేంకటేశ్వరునికి ప్రతి సంవత్సరం 7 కళ్యాణాల కంటే తక్కువ కాకుండా కనీసం 111 కళ్యాణాలను వివిధ ప్రాంతాలలో ఉచితంగా నిర్వహించాలని సంకల్పించాము.

ఆహ్వానించిన భక్తుల ప్రాంతములో అనగా వారి వారి ఊరు, అపార్టుమెంట్ లేదా ఇంటివద్దనే నిర్వహించెదము. శ్రీవారి కళ్యాణమును శాస్త్రోక్తంగా నిర్వహించుటకు అన్ని ఏర్పాట్లు అనగా విగ్రహాలను, బ్రాహ్మణులను, ఇతర సామగ్రిని మేమే ఏర్పాటు చేసెదము. కళ్యాణముతో పాటు వీలైతే అన్నమయ్య కీర్తనలు, ప్రవచనములను కూడా ఏర్పాటు చేయగలము. భక్తులలో శ్రీవేంకటేశ్వరస్వామి పట్ల భక్తి భావమును, శరణాగత తత్త్వమును ప్రోత్సహించుచు, స్వామివారి సేవాభాగ్యమును మరియు ఆశీస్సులను అందించుటే మా లక్ష్యం.

**శ్రీవారి కళ్యాణమును తమ ప్రాంతము, ఊరు, ఇంటి వద్ద నిర్వహించుటకు ఆసక్తికల భక్తులు మమ్మల్ని సంప్రదించవలెనని మనవి. భక్తులకు అనువైన రోజున (పుట్టినరోజు, పెండ్లిరోజు, షష్టిపూర్తి... ) 'నమో వేంకటేశాయ' రథం యుక్తంగా విచ్చేసి శ్రీనివాస కళ్యాణమును నిర్వహించుదుము. (హైదరాబాద్ మరియు పరిసర ప్రాంతాలలో మాత్రమే)**

**(ఈ శ్రీనివాస కళ్యాణాల కార్యక్రమము ప్రభుత్వము వారు ఆధ్యాత్మిక సమావేశాలకు అనుమతించిన వెంటనే తిరిగి ప్రారంభమగును.)**

**శ్రీవేంకటేశ్వర మహామంత్రపీఠం**

శ్రీవేంకటేశ్వర పాదసేవకుడు
**పుల్లగూర్ల సాయిరెడ్డి**
(గోవిందదాసు)

ఫోన్: 040-27175050
సెల్: 93482 12354
E.mail: srivenkatesham@gmail.com
Website:Srivenkatesham.org

# రాశి ఫలితములు

## మేషరాశి

**అశ్వని 1,2,3,4 పాదములు, భరణి 1,2,3,4 పాదములు, కృత్తిక 1వ పాదము**

ఈ రాశి స్త్రీ పురుషులకు గ్రహములు వ్యతిరేకం ఉన్నందున ప్రతి విషయంలో మనసు పరిపరి విధములుగా ఉంటుంది. బంధుమిత్రులు స్నేహితులతో మాట పట్టింపులు కలిగి ఉన్నారు. అవసరానికి డబ్బు ఏదో రకంగా రావటానికి నవగ్రహ ప్రదక్షిణలు, వినాయక సరస్వతి పూజలు. ఆరోగ్యము కుదుట పడుతుంది. మానసిక ఒత్తిడి తగ్గును. జాగ్రత్తగా ఉండండి.

## వృషభరాశి

**కృత్తిక 2,3,4, రోహిణి 1,2,3,4 పాదములు, మృగశిర 1,2 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు మొదట రెండు వారములు చాలా అనుకూలంగా ఉంటుంది. తదుపరి సామాన్యంగా ఉంటుంది. బంధుమిత్రుల కలయిక వివాహ ప్రయత్నములు ఫలించుట. ఆకస్మికంగా ధనం అంతా ఖర్చు జరుగును. ఏవైన ఖరీదు చేయుట జరుగును. నవగ్రహ ప్రదక్షిణలు, మహా న్యాస రుద్రాభిషేకములు. ఆస్తులు సమకూర్చుకొనుటకు అనుకూలం.

## మిథునరాశి

**మృగశిర 3, 4 పాదములు, ఆరుద్ర 1,2,3,4 పాదములు, పునర్వసు 1, 2, 3 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు అనుకూలంగా ఉంటుంది. తొందరపడి మాట్లాడరాదు. మాటలలో పొదుపు కావాలి. చేయు వృత్తి వ్యాపారములలో అందరి మన్ననలు కలిగి ఉంటారు. భార్యా బిడ్డలతో ప్రేమాభిమానాలు కలిగి ఉంటారు. దైవారాధన తప్పదు.

## కర్కాటకరాశి

**పునర్వసు 4వ పాదము, పుష్యమి 1,2,3,4 పాదములు, ఆశ్లేష 1,2,3,4 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు అనుకూలంగా ఉంటుంది. వృత్తి ఉద్యోగ వ్యాపారములందు ఆకస్మిక ధనలాభములు. అధికారుల ఒత్తిడి ఉంటుంది. వస్తు వాహన లాభము. బంధుమిత్రుల కలయిక. అనారోగ్య సమస్యలు కొంచె ఎక్కువగా ఉన్నవి. శ్రద్ధ తీసుకొనగలరు. ఆకస్మిక ప్రమాదములు ఉన్నవి. నవగ్రహ ప్రదక్షిణలు. సుబ్రమణ్యేశ్వర ఆరాధన చేయండి.

## సింహరాశి

**మఘ 1,2,3,4 పాదములు, పుబ్బ 1,2,3,4 పాదములు, ఉత్తర 1వ పాదము**

ఈ రాశి స్త్రీ పురుషులకు సామాన్యంగా ఉంటుంది. వృత్తి వ్యాపార ఉద్యోగములో కొన్ని విధములుగా చికాకులు కలిగిన సందర్భములో మనసులో భగవంతుని స్మరణ చేయండి. మీకు కలిగిన ఇబ్బంది నివారణ జరుగును. నవగ్రహ జపదానములు మహన్యాస రుద్రాభిషేకం చేయించండి.

## కన్యారాశి

**ఉత్తర 2,3,4 పాదములు, హస్త 1,2,3,4 పాదములు, చిత్త 1,2 పాదములు**

ఈ రాశి స్త్రీ పురుషులకు అనుకూలంగా ఉంటుంది. వృత్తి వ్యాపార ఉద్యోగులకు కలిసి వచ్చే రోజులు. వస్తు వాహన యోగం ఉన్నది. ఆకస్మిక ధన సంపాదన ఉన్నది. మీరు మంచి సమయం చూసి ప్రారంభించిన పనులు నెరవేరగలవు. బంధుమిత్రులలో అసూయ ఉంటుంది. ఆదిత్య హృదయం పారాయణం ఆదివారం గం. 6 నుంచి 7 మధ్య 6 సార్లు చేయండి.

## తులారాశి

**చిత్త 3,4 పాదములు, స్వాతి 1,2,3,4 పాదములు, విశాఖ 1,2,3 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు అనుకూలంగా ఉంటుంది. దూరప్రయాణములు ఆకస్మిక ధనలాభములు. వ్యాపారరీత్య అనుకూలం. వివాహ ప్రయత్నములు అనుకూలం. విందులు, వినోదములు, వస్తువాహన ఆభరణ లాభం. కోర్టు కేసులు రాజీమార్గం, అధికారుల దాడులు. ఆర్భాటం వలన కష్టనష్టములు, అనారోగ్యం. వాదోపవాదములకు తావు ఇవ్వరాదు. సత్యనారాయణ స్వామి నవగ్రహములతో పూర్తి పూజలు చేయండి.

## వృశ్చికరాశి

**విశాఖ 4వ పాదము, అనూరాధ 1,2,3,4 పాదములు, జ్యేష్ఠ 1,2,3,4 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు సామాన్యంగా ఉంటుంది. దూర ప్రయాణంలో జాగ్రత్తలు. అనారోగ్య సమస్యలు, మానసిక ఒత్తిడి. ప్రతిది ఒక సమస్యగా మారకుండా చూసుకోవాలి. మాటలలో మాధుర్యం, ప్రేమతో మీరు బయటపడగలరు. పైవారి వలన ఇబ్బందులు రాకుండా జాగ్రత్తగా మసలుకోవలసి ఉన్నది. మీ ఇష్టదైవం, శనిభగవానుని ఆరాధన, శని పూజాఫలదీపికలు పంచి శ్రీవారి దర్శనం చేసుకోండి.

## ధనూరాశి

**మూల 1,2,3,4 పాదములు, పూర్వాషాఢ 1, 2, 3, 4 పాదములు, ఉత్తరాషాఢ 1వ పాదము.**

ఈ రాశి స్త్రీ పురుషులకు అనుకూలంగా ఉంటుంది. ప్రతి విషయంలో చాలా జాగ్రత్త. తొందరపాటు లేకుండా ప్రశాంతంగా ఆలోచన చేసి పసందైన విందులు, వినోదములతో పనులు పూర్తి చేసుకొనగలరు. వ్యవహారములో చక్కగా వినయ విధేయతలతో ఆచరించండి. వినాయక, సరస్వతి చిత్రగుప్తుని పూజలు చేయండి.

## మకరరాశి

**ఉత్తరాషాఢ 2,3,4 పాదములు, శ్రవణం 1,2,3,4 పాదములు, ధనిష్ట 1,2 పాదములు**

ఈ రాశి స్త్రీ పురుషులకు అనుకూలంగా ఉంటుంది. ఎప్పటి నుండో పెండింగ్లో ఉన్న పనులు నెరవేరగలవు. వస్తు వాహన గృహములు అమర్చుకొనుటకు అవకాశములు ఎక్కువగా ఉన్నవి. సంఘంలో గౌరవ మన్ననలు, దూర ప్రయాణములు కలిసి వస్తాయి. ప్రయాణ జాగ్రత్తలు పాటించగలరు. ఆకస్మిక ధనలాభము కలిగి ఉన్నారు. గ్రామదేవత ఆరాధన చాలా అవసరం ఉన్నది.

## కుంభరాశి

**ధనిష్ట 3,4 పాదములు, శతభిషం 1,2,3,4 పాదములు, పూర్వాబాద్ర 1,2,3 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు సామాన్యంగా ఉంటుంది. ఆచితూచి నడుచుకొనగలరు. మీ ప్రయత్న లోపము వలన కొన్ని ఇబ్బందులు ఉన్నవి. విశ్వాసముతో చేయు ప్రయత్నములు ఫలించగలవు. గురుబలంతో విజయం సాధించగలరు. దక్షిణామూర్తి, షిరిడిసాయి పూజలు, శనగల గుగ్గిళ్ల ప్రసాదములు పంచండి.

## మీనరాశి

**పూర్వాబాద్ర 4వ పాదము, ఉత్తరాబాద్ర 1,2,3,4 పాదములు, రేవతి 1,2,3,4 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు సామాన్యంగా ఉంటుంది. ప్రతి అడుగు జాగ్రత్తగా వేయండి. ఎవరికి హామి ఉన్నా ఇబ్బందులలో పడగలరు. ఎంత పొగిడితే అంత కష్టాలుండగలవు. వివాహ విషయములు కలిసివస్తాయి. ఆకస్మికంగా ధనం ఖర్చుఅవుతుంది. ప్రతి రూపాయి ఖర్చుకు ఆలోచన చేయండి. మహన్యాస రుద్రాభిషేకం చేయండి.

# మీ విజ్ఞానం ఈ

నిర్వహణ: **డా.పి. లలితవాణి**




శ్రీ వేంకటేశం
ఆధ్యాత్మిక మాసపత్రిక
ఇం.నెం. 1-1-53, వీధి నెం.1,
హబ్సీగూడ, హైదరాబాద్-500007,
ఫోన్: 040-27175050
Email: srivenkatesham@gmail.com


ఈ ప్రశ్నలన్నింటికీ ఇదే పేపరు మీద కొట్టివేతలు లేకుండా సమాధానాలు రాసి ఈనెల 20వ తేదీలోగా మాకు పంపగలరు. మీ చిరునామాను స్పష్టంగా రాయాలి. సరియైన సమాధానాలు వ్రాసిన వారిలో లక్కీడిప్ ద్వారా ఒకరిని ఎంపిక చేసి వారికి 'శ్రీవారి పాదాలు' బహుమతిగా ఇవ్వబడతాయి.

## ఈ క్రింది ప్రశ్నల జవాబుల కోసం గత నెల సంచికను పరిశీలించండి

1. శ్రీవారి అభిషేక జలం పాదతీర్థం ఎలా మారింది?
2. సుకన్య ఎవరి కూతురు?
3. తిరువాదవూరుకి ఏమని పేరు వచ్చింది?
4. బృహద్రథుని కొడుకు ఎవరు?
5. చ్యవనుడు ఎవరి కొడుకు?
6. అయిదు మూర్తులున్న అంజుమూర్తి కోవెల ఎక్కడున్నది?
7. అభిషేక ప్రియుడు ఎవరు?
8. బ్రాహ్మీ ముహూర్తం ఎప్పుడు?
9. ఢమరుక నాదం దేనికి ప్రతిరూపం?
10. కరువు లేని శివాలయం ఎక్కడుంది?
11. కచుడు ఎవరి కొడుకు?
12. హిరణ్యకశిపుని తల్లి పేరేమిటి?
13. చెమటలు పట్టే విగ్రహం ఎవరిది?
14. చ్యవన మహర్షికి యౌవనాన్ని ఇచ్చింది ఎవరు?
15. సుమంత్రుడు ఎవరు?

1. ______________________
2. ______________________
3. ______________________
4. ______________________
5. ______________________
6. ______________________
7. ______________________
8. ______________________
9. ______________________
10. ______________________
11. ______________________
12. ______________________
13. ______________________
14. ______________________
15. ______________________

పేరు: ______________________

చిరునామా: ______________________

______________________

______________________

______________________

పిన్‌కోడ్: ______________________

ఫోన్: ______________________

## గత నెల ప్రశ్నలకు కరెక్టు సమాధానాలు

1. తులసి మొక్కను, 2. 12, 3. 14 సంవత్సరములు పూర్తి అయ్యే వరకు, 4. ధర్మధ్వజుడు, 5. సువర్ణముఖి, 6. గరుడాద్రి, 7. నందనార్, 8. బ్రహ్మపురం, 9. 'క్షి' అనే అక్షరం, 10. విభృతుడు, 11. మోక్షమును ఇచ్చువాడు, 12. అంజనాదేవి ఆంజనేయుని పుత్రునిగాపొందటం వల్ల,13. తిరువట్టార్, 14. దుర్వాస మహర్షి, 15.ఆవుతోకనుకృష్ణుని పైనుండి తిప్పటం

## సరైన సమాధానాలు రాసినవారు

1.వనమాల రామలింగాచారి, 2. కె. జయశ్రీ, 3. బులుసు బాబూరావు, 4. సాయికుమార్, 5. కె.ఎస్.ఎస్. లక్ష్మి, 6. పి. యశోద, 7. జె. వెంకటరమణ, 8. రామానుజాచారి, 9. సూరి సౌభాగ్య లక్ష్మి

## లక్కీడిప్ ద్వారా స్వామివారి పాదాలు పొందిన విజేత

## జె. జయశ్రీ



Postel Registration No.
HSE/879/2022-2024

Published on 28th and Licenced to
Post On 29th & 30th of Every Month

RNI No.
APTEL/2008/23122

# శ్రీ వేంకటేశం



If Un delivered please return to:

**SRI VENKATESHAM**, **(Sri Venkateshwara Maha Maha Peetham)**
H.No: 1-1-53, Street No. 1, Habsiguda, Hyderabad-500007. Ph: 040-27175050

డిజిటల్ పాఠకుల కోసం పూర్తిగా కలర్ పేజీలు https://www.readwhere.com లో చదవండి
Srivenkatesham Magazine in Google Drive https://drive.google.com/drive/folders/1jOWBeoUHjF4Qhn4wl-d9eUGlh6kVYyLq